మీడియాకు సంబంధించిన అన్ని విషయాల కోసం 9246213493
సహాయ
మీడియా సర్వీసు రి.
3-7-255,మన్సూరాబాద్,ఎల్బీనగర్,హైదరాబాద్-68

www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

అనుక్షణం
# నవభూమి
ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక

ANU FURNITURE®
HYDERABAD | BENGALURU
Call: +91 9100913033, 8688003033




Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
Navabhoomi daily fallows..
హైదరాబాద్ | 25 సోమవారం | నవంబర్ 2024 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 70

## అదానీ ముడుపులపై సుప్రీంలో విచారణ

- అదానీ - జగన్ ముడుపుల వ్యవహారంలో అనూహ్య పరిణామం
- తక్షణ విచారణ కోరుతూ విశాల్ తివారీ పిటిషన్
- భారత్‌లో సోలార్ ఎనర్జీ ఒప్పందాల కోసం అదానీ గ్రూపు
- రూ. 2,029 కోట్ల ముడుపుల ఆరోపణలపై యుఎస్‌లో కేసు
- గౌతమ్ అదానీ, సాగర్ అదానీ సహా 8 మందిపై అభియోగాలు

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**
ఆదానీ ముడుపుల వ్యవహారం కలకలం రేపింది. అమెరికాలో నమోదైన అభియోగాల పైన పెద్ద ఎత్తున రాజకీయం దుమారం చెలరేగింది. భారత్‌లో సోలార్ ఎనర్జీ ఒప్పందాల కోసం అదానీ గ్రూపు రూ. 2,029 కోట్ల ముడుపుల ఆరోపణలపై అమెరికాలో కేసు నమోదైంది. రేపటి నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సమయంలో ఈ కేసుకు సంబంధించి సుప్రీం కోర్టు కేంద్రంగా కీలక పరిణామం చోటు చేసుకుంది. న్యాయస్థానం ఏ విధంగా స్పందిస్తుంది అనేది ఆసక్తికరంగా మారుతోంది. ఆదానీ ముడుపులపై సుప్రీం కోర్టులో పిటీషన్ దాఖలైంది. ఈ కేసుపై దర్యాప్తునకు ఆదేశించాలని న్యాయవాది విశాల్ తివారీ సుప్రీం కోర్టులో పిటీషన్ వేసారు. గతంలో కూడా హిండెన్‌బర్గ్ రిపోర్టుపై దర్యాప్తు కోరుతూ ఆయన పిటిషన్ వేశారు. ఈ పిటీషన్‌పైన కోర్టు స్పందన తెలియాల్సి ఉంది. ఇటు, భారత్ లో సోలార్ ఎనర్జీ ఒప్పందాల కోసం అదానీ గ్రూపు రూ. 2,029 కోట్ల ముడుపులు ఇచ్చారనే ఆరోపణలతో కేసు నమోదైంది. ఈ కేసులో గౌతమ్ అదానీ, సాగర్ అదానీ సహా మొత్తం 8 మందిపై అభియోగాలు నమోదయ్యాయి. రేపు (సోమవారం) తక్షణ విచారణ కోరుతూ పిటిషనర్ విశాల్ తివారీ మెన్షన్ చేయనున్నారు. దీంతో, అందరి చూపు

## జమిలిపై కీలక నిర్ణయం

- నేటి నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు
- సమావేశాల నిర్వహణపై కేంద్రం అఖిలపక్ష సమావేశం
- అదానీ ముడుపుల వ్యవహారంపై చర్చ జరపాలని కాంగ్రెస్ డిమాండ్
- జమిలి ఎన్నికలు,వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు కేంద్రం సిద్ధం

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**
పార్లమెంట్ శీతాకాల సమావేశాలు రేపు (సోమవారం) ప్రారంభం కానున్నాయి. సమావేశాల నిర్వహణపై కేంద్రం అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో పలు పార్టీలు అనేక అంశాలు ప్రస్తావించాయి. ఆదానీ ముడుపుల వ్యవహారంపై చర్చించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. మణిపూర్ అంశాన్ని ప్రస్తావించింది. ఈ సమావేశాల్లోనే కేంద్రం ఒన్ నేషన్ - ఒన్ ఎలక్షన్‌తో పాటుగా వక్ఫ సవరణ బిల్లుకు సిద్దమవుతోంది. ఈ బిల్లు ఆమోదం ద్వారా దేశ వ్యాప్తంగా జమిలి ఎన్నికల ప్రక్రియకు కౌంట్ డౌన్ మొదలవుతుంది. పార్లమెంట్ శీతాకాల సమావేశాల పై కేంద్రం నిర్వహించిన అఖిల పక్షంలో హాట్ డిబేట్ జరిగింది. సమావేశాల్లో ఆదానీ ముడుపుల వ్యవహారం పైన చర్చించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. దీంతో పాటుగా మణిపూర్ అల్లర్లు, వక్ఫ సవరణ బిల్లు, చైనా సరిహద్దు అంశం సహా ప్రజా సమస్యలను అఖిలపక్షంలో విపక్షాలు లేవనెత్తాయి. అన్ని అంశాల పైన ప్రభుత్వం చర్చకు సిద్దంగా ఉందని రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజుజు స్పష్టం చేసారు. కీలక బిల్లుల ఆమోదానికి సహకారం అందించాలని మంత్రులు కోరారు. ఇక, రాజ్యాంగం ఏర్పాటై 75 ఏళ్ళు పూర్తవుతున్న సందర్భంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలపై అఖిల పక్షంలో చర్చ జరిగింది.

## రేపే సోరేన్ ప్రమాణస్వీకారం

- రాంచీలో ప్రమాణస్వీకారానికి రంగం సిద్ధం
- నాల్గోసారి ముఖ్యమంత్రిగా హేమంత్ ప్రమాణస్వీకారం
- రాహుల్‌గాంధీ,మమతాదీదీ,కూటమి నేతలు హాజరు
- ఈ ఎన్నికల్లో ఓడిన మంత్రులకు మంత్రివర్గంలో చోటు

2



**రాంచీ-నవభూమిబ్యూరో:** జార్కండ్ ముఖ్యమంత్రిగా సోరెన్ మరోసారి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇందు కోసం ఈ నెల 26 ముహూర్తం ఖరారు చేసారు. రాంచీలో జరిగే ప్రమాణ స్వీకారానికి కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీతో పాటుగా పశ్చిమ బెంగాల్ సీఎం మమతా, ఇండియా కూటమి నేతలు హాజరు కానున్నారు. తాజాగా ఎన్నికల ఫలితాల్లో బీజేపీ కూటమిని ఓడించిన జేఎంఎం - కాంగ్రెస్ కూటమి అధికారం నిలబెట్టుకుంది. మంత్రివర్గ కూర్పు పైన సోరెన్ కసరత్తు చేస్తున్నారు. జార్కండ్ ఎన్నికల్లో అధికారం నిలబెట్టుకున్న హేమంత్ సోరెన్ నాలుగో సారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నా రు. ఈ నెల 26న ప్రమాణ స్వీకారానికి ముహూర్తంగా నిర్ణయం తీసుకున్నారు. కాంగ్రెస్‌తో కలిసి జేఎంఎం కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. గత ప్రభుత్వంలో మంత్రులుగా పని చేసి ఓడిన నలుగురికి తిరిగి కేబినెట్‌లో అవకాశం ఇవ్వాలని సోరెన్ నిర్ణయించారు. తాజా ఎన్నికల్లో జేఎంఎం - 34, బీజేపీ - 21, కాంగ్రెస్ - 16, ఆర్జేడీ - 04 సీపీఐ (ఎంఎల్) (ఎల్) - 02, ఏజేఎస్‌యూపీ - 01, ఎల్‌జేపీఆర్‌వీ - 01, జేకేఎల్ఎం - 01 జేడీయూ - 01 స్థానం దక్కించుకున్నాయి. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తారు మారు చేస్తూ బీజేపీ కూటమిని జేఎంఎం - కాంగ్రెస్ కూటమి ఓడించి అధికారంలోకి వచ్చింది. జార్కండ్ అసెంబ్లీలో మొత్తం 81 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. మెజార్టీ మార్క్ 41 కాగా, జేఎంఎం - కాంగ్రెస్ కూటమి 56 స్థానాల్లో

## పవర్ షేరింగ్ ఫార్ములా!?

- ఎక్కువ సీట్లు వచ్చాయి కాబట్టి..సీఎం సీటు ఇవ్వాలని పట్టుబడుతున్న బీజేపీ
- సీఎం సీట్లో దేవేంద్ర ఫడ్నవీస్, డిప్యూటీ సీఎంలుగా షిండే,అజిత్ పవార్
- రెండున్నర ఏళ్ల తర్వాత అధికారం బదిలీ..సీఎంగా షిండే,డిప్యూటీ సీఎంలుగా దేవేంద్ర,అజిత్

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**
మహారాష్ట్రలో భారతీయ జనతా పార్టీ పాగా వేసింది. కనీవినీ ఎరుగని అత్యంత భారీ మెజారిటీని సాధించింది. శివసేన (ఏక్‌నాథ్ షిండే)- బీజేపీ- నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (అజిత్ పవార్) సారథ్యంలోని మహాయుటి కూటమి విజయదుందుభి మోగించింది. మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. మొత్తం 288 నియోజకవర్గాలు ఉన్న మహారాష్ట్ర అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కావాల్సిన మేజిక్ ఫిగర్ 145. దీన్ని అలవోకగా అందుకుంది మహాయుటి. ఈ కూటమి అభ్యర్థులు 230 నియోజకవర్గాల్లో ఘన విజయం సాధించారు. ఓ అధికార కూటమి ఇంత భారీ మెజారిటీతో గెలుపొందడం ఇదే తొలిసారి. ఇది- బీజేపీకి రుచి చూసిన చారిత్రాత్మక విజయం అనడంలో ఎలాంటి సందేహాలు అక్కర్లేదు. బీజేపీతో పాటు ఏక్‌నాథ్ షిండే శివసేన, అజిత్ పవార్ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ కలిసికట్టుగా పోరాడాయి. శివసేన ఉద్ధవ్ థాకరే, ఎన్సీపీ, కాంగ్రెస్ మహా వికాస్ అఘాడీని మట్టి కరిపించాయి. ఈ తిరుగులేని విజయాన్ని అందుకున్నాయి. బీజేపీ 149 సీట్లల్లో పోటీ చేసి132 చోట్ల విజయం సాధించింది. షిండే వర్గం శివసేన 81 నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెట్టగా 57 మంది గెలుపొందారు. అజిత్ వర్గానికి చెందిన ఎన్సీపీ మొత్తం 59 స్థానాల్లో పోటీ చేయగా 41 సీట్లు ఈ పార్టీ ఖాతాలో పడ్డాయి. లోక్‌సభ ఎన్నికలతో పోల్చుకుంటే ఇప్పుడు ఈ మూడు పార్టీల ఓటుబ్యాంకు అమాంతం పెరిగింది.

## ఆలీకి ఊహించని షాక్!



వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్ మండలం ఎక్మామిడిలోని అలీ ఫామ్ హౌస్‌లో అక్రమ నిర్మాణాలపై గ్రామ కార్యదర్శి శోభారాణి నోటీసులు
అక్రమనిర్మాణాలు నిలిపివేయాలన్న కార్యదర్శి
2

## సంగారెడ్డి జైలులో లగచర్ల రైతులను విచారించిన ఎన్‌హెచ్ఆర్‌సీ

- రైతులను 5 గంటల పాటు విచారించిన ఎన్‌హెచ్ఆర్‌సీ
- ఎన్‌హెచ్ఆర్‌సీ డిప్యూటీ రిజిస్ట్రార్ ముఖేశ్ నేతృత్వంలో 3గురు సభ్యులు, వికారాబాద్ జిల్లా అధికారులు విచారణ
- మరో రెండు రోజుల పాటు విచారణ కొనసాగింపు 2



## నేడు ఢిల్లీకి సీఎం రేవంత్..



- ప్రజా విజయోత్సవాలపై అధిష్ఠానంతో చర్చ
- మంత్రివర్గ విస్తరణ,కార్పొరేషన్ పదవులపై కసరత్తు
- 9న తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ
- సోనియా, రాహుల్‌కు ప్రత్యేకంగా ఆహ్వానం

2

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి పోలీసుల నోటీసులు

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పాటు మరికొందరికి పోలీసులు నోటీసులు
- బీఎన్ఎస్ 35(3) సెక్షన్ కింద హుజూరాబాద్ పోలీసులు నోటీసులు
- అనుమతి లేకుండా కౌశిక్ రెడ్డి ధర్నా చేసి ప్రజలకు ఇబ్బంది కలిగించారని అభియోగం

2



## సజ్జల అరెస్ట్‌కు రంగం సిద్ధం...!!

- సోషల్ మీడియాలో పోస్టింగ్స్ విషయంలో పలువురు వైసీపీ ముఖ్యులకు నోటీసులు జారీ..ఇప్పటికే కొందరిని అరెస్ట్ చేసిన పోలీసులు
- పులివెందులకు చెందిన వర్రా రవీందర్‌రెడ్డి విచారణలో ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా సజ్జల భార్గవ్‌రెడ్డితో పాటు అర్జున్‌రెడ్డికి 41-ఏ నోటీసులు

2



**అమరావతి-నవభూమిబ్యూరో**
ఏపీలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కూటమి ప్రభుత్వం తాజాగా తీసుకుంటున్న నిర్ణయాలు సంచలనంగా మారుతున్నాయి. సోషల్ మీడియాలో పోస్టింగ్స్ విషయంలో పలువురు వైసీపీ ముఖ్యులకు నోటీసులు జారీ చేసారు. కొందరిని అరెస్ట్ చేసారు. తాజాగా పులివెందులకు చెందిన వర్రా రవీందర్ రెడ్డి విచారణలో ఇచ్చిన స్టేట్ మెంట్ ఆధారంగా సజ్జల భార్గవ్‌రెడ్డితో పాటు అర్జున్‌రెడ్డికి పోలీసులు 41-ఏ నోటీసులు జారీ చేసారు.

**నోటీసుల జారీ**
సోషల్ మీడియా పోస్టింగ్స్ కేసులో సజ్జల భార్గవ్, అర్జున్ రెడ్డిని సోమవారం విచారణకు రావాలని పోలీసులు నోటీసులు జారీ చేసారు. వీరితో పాటు మరికొంత మంది వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలకు నోటీసులు ఇచ్చిన పోలీసులు..వారిని సైతం విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. వర్రా రవీందర్ రెడ్డి అసభ్య పోస్టింగ్స్ చేసారంటూ రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. వర్రా రవీందర్ రెడ్డి విచారణ సమయంలో పలువురి వైసీపీ ముఖ్య నేతల పేర్లు ప్రస్తావించినట్లు తెలుస్తోంది. దీంతో , ప్రస్తుతం పోలీసులు వారిని విచారణకు రావాలంటూ నోటీసులు జారీ చేస్తున్నారు.

**పోలీసుల విచారణలో**
ఈ కేసులో ఏ1గా వర్రా రవీందర్‌రెడ్డి, ఏ2గా సజ్జల భార్గవరెడ్డి, ఏ3 అర్జున్‌రెడ్డిల పేర్లు చేర్చారు. అయితే ఇప్పటికే వర్రా రవీందర్‌రెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్ మీద కడప జైలుకు తరలించారు. ఇక, ఇప్పుడు భార్గవరెడ్డికి నోటీసులు ఇచ్చేందుకు విజయవాడ వెళ్లిన పోలీసులు ఆయన ఇంట్లో అందుబాటులో లేకపోవడంతో సజ్జల భార్గవ్ తల్లికి నోటీసులు అందజేశారు. అదే సమయంలో అర్జున్‌రెడ్డికి కూడా పోలీసులు 41-ఏ నోటీసులు జారీ చేశారు. ఇప్పటికే వీరిపై లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. సోషల్ మీడియా పోస్టుల్లో సజ్జల భార్గవ్ రెడ్డి కీలకంగా పోలీసులు భావిస్తున్నారు. తాజా కేసులో ఆయన్ను విచారించి అరెస్ట్ చేయాలని కూడా యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

**అరెస్ట్ ఖాయమంటూ**
సజ్జల భార్గవ్ రెడ్డి 2022 లో వైసీపీ సోషల్ మీడియా బాధ్యతలు తీసుకున్నారు. ఆ తరువాతనే సోషల్ మీడియా వేదికగా అసభ్యకరమైన పోస్టులు పెట్టారని చెబుతున్నారు. ప్రత్యర్ధి పార్టీల నేతల పైన భార్గవ్ సూచనల మేరకే పోస్టులు పెట్టినట్లు వర్రా రవీందర్ రెడ్డి తన వాంగ్మూలంలో

## జగన్ చుట్టూ బిగిస్తున్న ఉచ్చు!

- జగన్‌పై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయవచ్చా అన్న కోణంలో న్యాయ నిపుణుల సలహా కోరిన కూటమి ప్రభుత్వం
- జగన్‌ను ప్రాసిక్యూట్ చేయడానికి గవర్నర్ అనుమతి కోరే అవకాశం
- అవినీతి నిరోధక చట్టంలోని 17 ఏ అధికరణం ప్రకారం మాజీ సీఎంను అరెస్టు చేసి విచారణ జరపడానికి గవర్నర్ అనుమతి అవసరం
- ఢిల్లీ నేతలతో చర్చించిన తరువాతనే సీఎం చంద్రబాబు తుది నిర్ణయం

2



**అమరావతి-నవభూమిబ్యూరో:** ఆదానీ కేసులో జగన్‌ను ఫిక్స్ అయ్యే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే అమెరికా కోర్టులో ఆదానీ ఏపీలో విద్యుత్ ఒప్పందాల కోసం లంచాలు ఇచ్చారని అభియోగాలు నమోదయ్యాయి. జగన్ పేరు ప్రస్తావన పైన కూటమి ఆచి తూచి స్పందిస్తోంది. కేంద్రంతో ఉన్న సత్సంబంధాల కారణంగా ఆదానీ వివాదంపైన స్పందించటం లేదు. కానీ, ఈ కేసులో జగన్‌ను మాత్రం ఫిక్స్ చేయాలని భావిస్తున్నారు. ఇందు కోసం న్యాయ పరంగా.. అదే విధంగా రాజకీయంగానూ మంతనాలు చేస్తున్నారు. కానీ, ఢిల్లీ నేతల అభిప్రాయమే ఇక్కడ కీలకంగా మారుతోంది. కూటమి ప్రభుత్వం కసరత్తు విద్యుత్ ప్రాజెక్టు ముడుపుల వ్యవహారంలో మాజీ సీఎం జగన్‌ను వదల కూడదని చంద్రబాబు ప్రభుత్వం భావిస్తోంది. ఈ కేసు పైన కూటమిలోని ముఖ్య నేతలు మాత్రం ఇప్పటి వరకు అధికారి కంగా స్పందించ లేదు. కేంద్ర ప్రాజెక్టు సెకీతో నాడు జగన్ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు ఆదానీ కేసులో ఇదే సాంకేతికంగా

## ఏపీలో భారీ వర్షాలు

- వాయుగుండంగా మారిన అల్పపీడనం
- ఏపీకి 3 రోజుల పాటు భారీ వర్షాల హెచ్చరిక
- కోస్తాంధ్ర, రాయలసీమలో వివిధ ప్రాంతాల్లో భారీ వర్షాలు
- రైతులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక

2



**అమరావతి-నవభూమిబ్యూరో**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని వర్షాలు వదిలిపెట్టడం లేదు. చలి తీవ్రత పెరుగుతున్న నవంబర్ నెలలోనూ ఏపీని వాన వెంటాడుతూనే ఉంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా ఏర్పడబోతుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఇప్పటికే ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఏపీ వ్యాప్తంగా మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. కోస్తాంధ్ర, రాయలసీమలో మూడు రోజుల పాటు వర్షాలు రేపు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారే అవకాశం ఉందని దీని ప్రభావంతో ఈ నెల 27, 28, 29 తేదీలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఏపీలోని కోస్తాంధ్ర, రాయలసీమలో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. "బంగాళాఖాతంలో మరో ఉపరితల ఆవర్తనం- ఏపీలో భారీ వర్షాలు" నవంబర్ 25వ తేదీన వాయుగుండంగా బలపడే అవకాశం తూర్పు హిందూ మహాసముద్రం మరియు దానిని ఆనుకుని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని, ఇది పశ్చిమ వాయువ్య దిశగా పయనిస్తూ దక్షిణ బంగాళాఖాతంలోని మధ్య భాగాల పైన నవంబర్ 25వ తేదీన వాయుగుండం గా బలపడేందుకు అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు. రైతులకు అలెర్ట్ దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇక వర్షాలు కురిసేందుకు రెండు రోజుల సమయం

# దారుణం.. న్యాయం కోసం వెళ్తే మహిళపై లైంగిక వేధింపులు..




**హైదరాబాద్-నవభూమి:** బాధితులకు అండగా నిలవాల్సిన పోలీసులు గాడి తప్పుతున్నారు. చట్టాలను పటిష్టంగా అమలు చేయాల్సిన పోలీసులే వాటిని తుంగలో తొక్కుతున్నారు. న్యాయం చేయాలంటూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ఓ మహిళకు దారుణ పరిస్థితి ఎదురైంది. సమస్య పరిష్కరించాలని ఎస్సై వద్దకు వెళ్లడం ఆమెకు కొత్త చిక్కులు తెచ్చిపెట్టింది. స్టేషన్ మెట్లు ఎక్కడమే ఆమె చేసిన పాపంగా మారిపోయింది. న్యాయం కోసం వెళ్తే చివరికి అన్యాయానికి గురైంది. ఎస్సై వేధింపులు తాళలేక సదరు మహిళ ఉన్నతాధికారులను ఆశ్రయించే పరిస్థితి ఏర్పడింది.

హైదరాబాద్ హయత్ నగర్‌కు చెందిన ఓ మహిళ భర్త వేధింపులు తట్టుకోలేక స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు 40 రోజుల కిందట వెళ్లింది. తన ఘోడు మొత్తం ఎస్సై ఎదుట వెల్లబోసుకుంది. భర్త వేధింపుల గురించి పూస గుచ్చినట్లు ఆయనకు వివరించింది. భర్తపై ఫిర్యాదు చేసి న్యాయం చేయాలని కోరింది.

అయితే ఫిర్యాదు నెపంతో మహిళ ఫోన్ నంబర్‌ను ఎస్సై తీసుకున్నాడు. ఆమెకు తరచూ ఫోన్లు చేస్తూ మాటలు కలిపే ప్రయత్నం చేశాడు. మెల్లిగా తన వక్రబుద్ధి మహిళ ఎదుట బయటపెట్టాడు ఆ ఎస్సై. కేసును తాను పరిష్కరిస్తానని, కాకపోతే కోరిక తీర్చాలంటూ పట్టుపట్టాడు.



# ఇల్లందు మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య ఇక లేరు..




**భద్రాద్రి కొత్తగూడెం-నవభూమి:** ఇల్లందు మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య(70) ఇక లేరు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న అబ్బయ్య.. హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇవాళ తెల్లవారు జామున కన్నుమూశారు. అబ్బయ్య మృతితో కుటుంబ సభ్యులు, అనుచరులు శోకసంద్రంలో మునిగిపోయారు. 1983లో బూర్గంపాడు నుంచి అబ్బయ్య ఎమ్మెల్యేగా తొలిసారి గెలుపొందారు. 1994, 2009లో ఇల్లందు నుంచి విజయం సాధించారు.

# అమ్మాయితో ఫోన్ కాల్స్.. రియల్ ఎస్టేట్ వ్యాపారి ట్రాప్.. నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి..



**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్ శివారు ఆదిభట్ల పీఎస్ పరిధిలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి కిడ్నాప్ కలకలం రేపింది. తమ వద్ద ఓపెన్ ప్లాట్స్ అమ్మకానికి ఉన్నాయని.. అమ్మాయితో వరుసగా ఫోన్లు చేయించిన ఆగంతకులు రియల్ ఎస్టేట్ వ్యాపారిని కిడ్నాప్ చేసి డబ్బుల కోసం బెదిరించారు. తమ వద్ద డబ్బులు లేవని చెప్పటంతో అతడితో కాగితాలపై వేలి ముద్రలు తీసుకొని విడిచిపెట్టారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఆదిభట్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం బోయవాడకు చెందిన రాచ నారాయణ అనే వ్యక్తి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. నారాయణకు గత పదిరోజులుగా ఓ అమ్మాయి గొంతుతో ఫోన్లు వచ్చాయి. తాము కార్ ఇన్సూరెన్స్ చేస్తామని, రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా చేస్తామని నమ్మించారు. కొంగరకలాన్ వద్ద తమకు ఓపెన్ ప్లాట్స్ ఉన్నాయని ప్రస్తుతం మార్కెట్ డౌన్ ఉన్నందున తక్కువ ధరకే ప్లాట్స్ వస్తాయని.. ఓసారి వచ్చి సైట్ విజిట్ చేయాలని కోరారు. వారి మాటలు నారాయణ నమ్మగా.. ఈనెల 21న మధ్యాహ్నం మెట్రో సిటీ వద్దకు రావాలని చెప్పారు. దీంతో నారాయణ తన డ్రైవర్ ముసిఫ్ ఖాన్‌తో కలిసి వారు చెప్పిన స్థలానికి వెళ్లి ఫోన్ చేశాడు. ఇలా కాల్ చేసిన వెంటనే ఓ నలుగురు వ్యక్తులు కారులో అక్కడకు వచ్చారు. క్షణం ఆలస్యం చేయకుండా నారాయణ, ముసిఫ్‌ఖాన్‌లను చుట్టుముట్టి తుపాకీతో బెదిరించారు. అనంతరం వారి కార్‌లో కూర్చోబెట్టుకొని సెల్‌ఫోన్లు లాక్కున్నారు. అనంతరం నగర శివారులోని ఓ ప్రాంతానికి తీసుకెళ్లి గదిలో బంధించారు. రూ.కోటి డబ్బులు ఇవ్వాలని అప్పుడే వదిలేస్తామని డబ్బులు డిమాండ్ చేశారు. అయితే తన వద్ద ప్రస్తుతం నగదు లేదని నారాయణ చెప్పాడు. దీంతో వారి వద్ద నుంచి తెల్ల కాగితాలపై వేలి ముద్రలు తీసుకున్నారు. అనంతరం కొంగరకలాన్‌లోని ఓ నిర్మానుష్యంగా ఉన్న ఓపెన్ ప్లాట్స్ వద్దకు తీసుకెళ్లారు. అక్కడ వాళ్లిద్దరిని వదిలేసి కారులో పారిపోయారు. భయంతో వణికిపోయిన నారాయణ వెంటనే ఆదిభట్ల పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. సీసీ కెమెరాలు, కారు నెంబర్ ఆధారంగా విచారణ చేపట్టారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఆదిభట్ల సీఐ రాఘవేందర్ వెల్లడించారు.

# యాదగిరిగుట్టలో భక్తుల రద్దీ



**యాదగిరిగుట్ట-నవభూమి:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయానికి భక్తులరద్దీ పెరిగింది. స్వామి వారిని దర్శించుకోడానికి ప్రముఖులు, భక్త జనం పోటెత్తారు. ఆదివారం సెలవు దినం కావడంతో స్వామి వారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ధర్మ దర్శనానికి సుమారు 2 గంటల సమయం, ప్రత్యేక దర్శనానికి గంట సమయం పడుతోంది. దీంతో క్యూ లైన్‌లో భక్తులు వేచి ఉన్నారు. శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి క్షేత్రం ఆదివారం భక్తజనసంద్రమైంది. కార్తీక మాసం, వారాంతపు సెలవుదినం కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో క్షేత్రానికి చేరుకున్నారు. స్వామి వారి నిజాభిషేకం, అర్చన, నిత్య కళ్యాణం, శ్రీ సత్యనారాయణ స్వామి వారి వ్రత పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వాహనాలతో పార్కింగ్ స్థలం నిండిపోగా క్షేత్రం చుట్టూ ఉన్న రింగ్‌రోడ్డులో కూడా వాహనాలను పార్కింగ్ చేశారు. కార్తీకమాసం పురస్కరించుకొని సత్యదేవుడి వ్రతాలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దీపారాధన స్థలాల్లో భక్తులతో రద్దీ నెలకొంది. కొండపైన గర్భాలయంలో పాంచనారసింహులతోపాటు శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కాగా, క్యూకాంప్లెక్స్‌లతోపాటు ప్రధానాలయం, కల్యాణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, శివాలయం, ప్రసాద విక్రయశాల, కొండకింద వ్రత మండపం, లక్ష్మీపుష్కరిణి, అన్నదాన సత్రం, కల్యాణ కట్ట తదితర ప్రాంగణాలు భక్తులతో రద్దీగా మారాయి. ఆలయ ఉత్తర దిశలో ఫొటోలు దిగేందుకు భక్తులు పోటీపడ్డారు. అదేవిధంగా భక్తులను కొండపైకి తరలించేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. సుప్రభాత సేవతో స్వామి అమ్మవార్లను మేల్కొలిపిన అర్చకస్వాములు స్వయంభువులకు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. కొండపైన శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు,

# రేవంత్ సర్కార్ మరో శుభవార్త.. ఒక్కొక్కరికీ నెలకు రూ.4 వేలు, వాళ్లకైతే రూ.6 వేలు.. ముహూర్తం ఫిక్స్..!



**హైదరాబాద్-నవభూమి:** రేవంత్ రెడ్డి సర్కార్ మరో శుభవార్త చెప్పేందుకు సిద్ధమవుతోంది. తెలంగాణ ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న పథకాల్లో ఆసరా పెన్షన్ కూడా ఒకటి. గతంలో వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మికులకు నెలకు 2 వేలు, దివ్యాంగులకు 4 వేలు ఇస్తుండగా.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అందరికీ 2 వేలు పెంచి ఇస్తామని హామీ ఇవ్వగా.. ఇప్పటివరకు అమలవ్వలేదు. కాగా.. ఈ పెంచిన డబ్బులతో ఆసరా పెన్షన్ పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

**తెలంగాణ ఆసరా పెన్షన్ పథకం**

తెలంగాణలో అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో రేవంత్ రెడ్డి సర్కార్.. కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. ఏడాది పూర్తవుతున్న సందర్భంగా పలు కీలక హామీలను అమలు చేయాలని భావిస్తోంది. ఇప్పటికే.. ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు పథకం, రైతు రుణమాఫీ, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల మేర ఉచిత విద్యుత్, ఆరోగ్య శ్రీ పరిధి పెంపు లాంటి కీలక పథకాలను అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. రాష్ట్ర ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రైతు భరోసాతో పాటు ఆసరా పింఛన్ పథకాలపై కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

అయితే.. గత ప్రభుత్వంలో వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మికులకు రూ.2 వేలు, దివ్యాంగులకు రూ.4 వేల చొప్పున పెన్షన్ అందిచగా.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. 2 వేలు ఉన్న పెన్షన్‌ను రూ.4 వేలకు, రూ.4 వేలుగా ఉన్న దివ్యాంగుల పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచుతామని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నప్పటికీ.. ఇంకా పింఛన్ల పెంపు లేకపోవడంతో ప్రజల్లో కొంత అసంతృప్తి నెలకొంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో కూడా ప్రజలు ఇదే విషయంపై అసంతృప్తి వెల్లగక్కుతున్నట్టు సర్కార్ దృష్టికి వచ్చింది.

మరోవైపు.. త్వరలోనే సర్పంచ్ ఎన్నికలు కూడా ఉండటంతో.. ప్రజల్లోని అసంతృప్తి కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రభావం చూపే అవకాశం కూడా ఉండటంతో.. ఆసరా పింఛన్ పథకం అమలుపై కీలక నిర్ణయం తీసుకునే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. స్థానిక సంస్థ ఎన్నికలలోపే ఈ పెన్షన్ పెంపు పథకాన్ని అమలు చేసి.. ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తీసేయాలని ప్రభుత్వం భావిస్తోంది. రైతు భరోసాతో పాటు ఆసరా పింఛన్ పథకం అమలుపై ప్రభుత్వ కసరత్తు చేస్తోంది.

కాగా.. డిసెంబర్ 09 నుంచి అసెంబ్లీ శీతాకాల సమావేశాలు జరుగనున్న నేపథ్యంలో.. ఈ సమావేశాల్లో రైతు భరోసా పథకంపై ప్రత్యేకంగా చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇప్పటికే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయగా.. అన్ని జిల్లాల్లో పర్యటించి అభిప్రాయాలు సేకరించింది. ఉపసంఘం ఇచ్చే నివేదికపై అసెంబ్లీలో చర్చించి, అన్ని పార్టీల నుంచి అభిప్రాయాలు తీసుకుని.. రైతు భరోసాపై తుది నిర్ణయం ప్రకటించనున్నారు. ఈ క్రమంలోనే.. అసెంబ్లీ సమావేశాల్లోనే ఆసరా పెన్షన్ పథకం అమలుపై కూడా ప్రకటన చేయనున్నట్టు సమాచారం. దీంతో.. అసెంబ్లీ సమావేశాల తర్వాత కొత్త ఏడాది నుంచి పెంచిన డబ్బులతో పెన్షన్ లబ్దిదారుల అకౌంట్లలో జమయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

# సంగారెడ్డి జైలులో లగచర్ల రైతులను విచారించిన ఎన్‌హెచ్ఆర్‌సీ




**హైదరాబాద్-నవభూమి:** వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటనలో అరెస్టై ప్రస్తుతం సంగారెడ్డి సెంట్రల్ జైల్లో ఉన్న రైతులను నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ బృందం ఆదివారం కలిసింది. 8 మంది సభ్యులతో కూడిన బృందం సభ్యులను పరామర్శించి ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటనలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ ఘటనలో పలువురు రైతుల్ని అరెస్ట్ చేయగా.. ప్రస్తుతం వారు సంగారెడ్డి జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. వీరిని నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ బృందం ఇవాళ కలిసింది. 8 మంది సభ్యులతో కూడిన బృందం జైలుకు చేరుకొని రైతులతో మాట్లాడారు. ఈ కేసులో 2 నిందితుడు సురేష్ సహా 19 మంది నిందితులు సంగారెడ్డి జిల్లా జైలులో ఉండగా.. వారిని కలిశారు. శనివారం ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న 8 మంది సభ్యులతో కూడిన NHRC బృందం.. ఈ రోజు ఉదయం నేరుగా సంగారెడ్డి జైలుకు వెళ్లింది. అక్కడ ఖైదీలుగా ఉన్న రైతులను కలిసి... లగచర్ల ఘటనలో ఏం జరిగిందో వారి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కాగా, లగచర్లలో ఫార్మా విలేజ్ ఏర్పాటును అక్కడి రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ఈనెల 11న భూసేకరణ ప్రజాభిప్రాయ సేకరణ కోసం వికారాబాద్ కలెక్టర్ సహా.. ఇతర అధికారులు గ్రామానికి చేరుకోగా వారిపై రైతులు దాడికి పాల్పడ్డారు. కడా ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి ఈ దాడిలో తీవ్రంగా గాయపడ్డారు. కలెక్టర్ సహా.. ఇతర అధికారుల వాహనాలు ధ్వంసం అయ్యాయి. ఘటనపై ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేయగా.. వీడియోలో ఆధారంగా పోలీసులు నిందితులను గుర్తించారు. మరుసటి రోజు రాత్రి తండాల్లోకి వెళ్లిన పోలీసులు రైతులను అదుపులోకి తీసుకున్నారు. మొత్తం19 మంది రైతులను కోర్టులో హాజరు పరచగా.. వారికి రిమాండ్ విధించారు. ప్రస్తుతం సంగారెడ్డి జైలులో రైతులు రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. అయితే రైతుల అరెస్టుల సమయంలో మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందని పలువురు ఆశ్రయించారు. కుట్రపూరితంగా అమాయకులను అరెస్టు చేశారని ఫిర్యాదు చేశారు. గిరిజనులు, ఆడవారి పట్ల పోలీసులు అసభ్యంగా ప్రవర్తించారని.. అర్ధరాత్రి ఇండ్లలోకి చొరబడి తమ వారిని అరెస్టు చేశారని పలువురు బాధితులు %చీఎ=జ%ని ఆశ్రయించారు. దీంతో 8 మంది సభ్యులతో జాతీయ మానవ హక్కుల సంఘం ఓ బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ ఘటనపై పూర్తి విచారణ చేసి.. బాధితులకు న్యాయం చేసేందుకు %చీఎ=జ% రంగంలోకి దిగింది.

కాగా, కుట్రపూరితంగా లగచర్లలో అధికారులపై దాడులకు పాల్పడ్డారని సీఎం రేవంత్ విమర్శించారు. ఈ ఘటనలో ప్రతిపక్షాల కుట్ర ఉందని అన్నారు. లగచర్లలో ఫార్మా కంపెనీలు పట్టడం లేదని.. అక్కడ ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అయితే ఈ కేసులో ఏ1 నిందితుడిగా పేర్కొంటూ బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

# అలీకి ఊహించని షాక్.. అక్రమ నిర్మాణాలపై నోటీసులు!

- **వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్ మండలం ఎక్మామిడిలోని అలీ ఫామ్‌హౌస్‌లో అక్రమ నిర్మాణాలు**
- **నోటీసులు ఇచ్చిన గ్రామ కార్యదర్శి శోభారాణి**
- **వెంటనే అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని నోటీసులు**

**నవాబ్‌పేట్-నవభూమి:** టాలీవుడ్ హాస్యనటుడు అలీకి ఊహించని షాక్ తగిలింది. ఆయన అక్రమ నిర్మాణాలపై అధికారులు నోటీసులు జారీ చేశారు. తెలంగాణలోని వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్ మండలం ఎక్మామిడిలోని ఫామ్‌హౌస్‌లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని గ్రామ కార్యదర్శి శోభారాణి నోటీసులు ఇచ్చారు. అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని అందులో పేర్కొన్నారు. కాగా, ఈ నోటీసులపై అలీ తన తరఫు న్యాయవాది ద్వారా సమాధానం చెప్పేందుకు రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. కావాలనే కొందరు తనపై కుట్రపూరితంగా ఇలా చేస్తున్నారని అలీ ఆరోపిస్తున్నట్టు సమాచారం. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి పోలీసుల నోటీసులు

**హుజూరాబాద్-నవభూమి:** ఆలస్యంగా వెలుగులోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పాటు మరికొందరికి పోలీసులు నోటీసులు ఇచ్చారు. బీఎన్ఎస్ 35(3) సెక్షన్ కింద హుజూరాబాద్ పోలీసులు నోటీసులు అందజేశారు. దళిత బంధు నిధులు విడుదల చేయాలని నవంబర్ 9న బీఆర్ఎస్ ధర్నా నిర్వహించింది. ఈ క్రమంలో అనుమతి లేకుండా హైవేపై కౌశిక్ రెడ్డి ధర్నా చేసి ప్రజలకు ఇబ్బంది కలిగించారని నోటీసులిచ్చారు. అధికార యంత్రాంగం అనుమతి లేకుండా రోడ్డుపై అక్రమంగా గుమిగూడటం, దళిత బంధు పథకం లబ్ధిదారులతో ధర్నా చేయడం, తెలిసి కూడా విద్వేష పూరిత ప్రసంగాలు చేయడం వంటి ఆరోపణలు కేసు పెట్టారు. ధర్నా, ఆందోళనను విరమించుకోవాలని పోలీసులు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని అభ్యర్థించినా తిరస్కరించారని

# నేడు ఢిల్లీకి సీఎం రేవంత్..

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారం చేపట్టి డిసెంబరు 7 నాటికి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ఏఐసీసీ పెద్దలను ఆయన కలవనున్నారు. ప్రజాపాలన విజయోత్సవాల గురించి తెలపడంతోపాటు ఢిల్లీ పెద్దలను ఈ ఉత్సవాలకు ఆహ్వానించనున్నట్టు తెలిసింది. అలాగే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీతోనూ రేవంత్ భేటీ కానున్నారు. అధికారం చేపట్టి ఏడాది అవుతున్నా.. మంత్రివర్గంలో ఇంకా 6 స్థానాలు ఖాళీగానే ఉన్న నేపథ్యంలో క్యాబినెట్ విస్తరణపై రాహుల్‌తో చర్చించనున్నట్టు సమాచారం. ఇక సచివాలయంలో ఏర్పాటు చేయబోయే తెలంగాణ తల్లి విగ్రహాన్ని.. డిసెంబర్ 9న ఆవిష్కరించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఆ కార్యక్రమానికి సోనియా, రాహుల్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించనున్నట్టు సమాచారం. ఇటు ఖాళీగా ఉన్న కొన్ని కార్పొరేషన్ పదవుల భర్తీతోపాటు 'కులగణన' పైనా అధిష్ఠానంతో చర్చించనున్నారు. ఇదిలాఉండగా.. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా కుటుంబ ఫంక్షన్‌లో సీఎం పాల్గొనున్నట్టు తెలిసింది.

# ఏపీలో భారీ వర్షాలు

(1వపేజీ తరువాయి)ఉన్నందున ముఖ్యంగా రైతులు వరి కోతకు వచ్చిన సమయంలో ధాన్యం తడిసిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల రైతులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటే నష్టం జరగకుండా కాపాడుకోవచ్చు అన్నారు. తెలుగు వాళ్లకు దగ్గరైన వార్నర్ ఇక ఐపీఎల్ ఆడడు ఏపీలో వర్షాలపై ఏపీ విపత్తుల నిర్వహణా సంస్థ అలెర్ట్ రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం వాయుగుండంగా బలపడే అవకాశం ఉన్న నేపథ్యంలో అది వాయువ్యదిశగా కదులుతూ ఆ తర్వాత రెండు రోజుల్లో తమిళనాడు, శ్రీలంక తీరాల వైపు వెళ్లే ఛాన్స్ ఉన్నదని రోణంకి కూర్మనాథ్ తెలిపారు. దీని ప్రభావంతో ఏపీలో కొన్ని ప్రాంతాలలో భారీ వర్షాలు కురవగా మిగిలిన చోట్ల అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. వర్షాలు కురిసే నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అన్నారు.

# అదానీ ముడుపులపై సుప్రీంలో విచారణ

(1వపేజీ తరువాయి)సుప్రీం వైపే ఉంది. "జగన్ కు ఉచ్చు, గౌతమ్ ఆదానీ పలు రాష్ట్రాల్లో విద్యుత్ సంస్థలకు సెకీ ద్వారా సోలార్ విద్యుత్ కట్టబెట్టేందుకు ఒప్పందాల కోసం ముడుపులు ఇచ్చారనే అభియోగాలు ఇప్పుడు సంచలనంగా మారాయి. ఈ ఆరోపణలను ఆదానీ ఖండించారు. ఈ వ్యవహారంలో ఏపీ మాజీ సీఎం జగన్ పేరు ప్రస్తావనకు వచ్చింది. ఏపీలో విద్యుత్ ఒప్పందాల కోసం జగన్‌కు ఆదానీ ముడుపులు చెల్లించారనేది అభియోగం. అయితే, వైసీపీ నేతలు వీటిని ఖండించారు. అదే సమయంలో ఏపీలోని కూటమి ప్రభుత్వం సైతం ఆదానీ ముడుపుల వ్యవహారం పైన ఆచి తూచి స్పందిస్తోంది. కానీ, జగన్ ను మాత్రం ఈ వివాదంలో ఫిక్స్ చేసేలా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే దీనికి సంబంధించి లీగల్ ఒపీనియన్ కోరినట్లు సమాచారం.

# రేపే సోరేన్ ప్రమాణస్వీకారం

(1వపేజీ తరువాయి)విజయం సాధించింది. 43 స్థానాల్లో పోటీ చేసిన ఝూర్కండ్ ముక్తి మోర్చా జేఎంఎం ఏకంగా 34 చోట్ల విజయం సాధించింది. అటు ఎన్డీఏ కూటమి 24 స్థానాలకే పరిమితం అయింది. 68 స్థానాల్లో బీజేపీ పోటీ చేయగా, 21 స్థానాల్లో విజయం సాధించింది. మిత్రపక్షాలైన ఎల్‌జేపీ రామ్‌విలాస్ పాసవాన్ పార్టీ, జేడీయూ, ఏజేఎస్‌యూ చెరో స్థానంలో విజయం సాధించాయి. బర్హెట్‌లో ఝూరండ్ సీఎం హేమంత్ సోరెన్ 39 వేలకుపైగా ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. ఆయన భార్య కల్పనా సోరెన్ గండేలో 13 వేలకుపైగా ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు.

# జగన్ చుట్టూ బిగిస్తున్న ఉచ్చు!

(1వపేజీ తరువాయి)కీలకం కాబోతోంది. అటు ఆదానీ అంశం కావటంతో కూటమి నేతలు ఆచి తూచి వ్యవహరిస్తున్నారు. ఈ కేసులో బీజేపీ నాయకత్వం ఆలోచన ఏంటో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆదానీ గురించి ప్రస్తావన లేకుండా జగన్ పైన ఏ విధంగా ముందుకు వెళ్లే అవకాశం ఉందనేది పరిశీలిస్తున్నారు. న్యాయ సలహా కోసం నిపుణులను సంప్రదిస్తున్నారు. సౌర విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకోవడానికి రూ.1750 కోట్ల లంచం ఇచ్చారని చార్జిషీటులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఉన్నారని చార్జిషీటులో నిర్దిష్టంగా ప్రస్తావించారు. దీని ఆధారంగా జగన్‌పై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయవచ్చా అన్న కోణంలో కూటమి ప్రభుత్వం న్యాయ నిపుణుల సలహా కోరింది. ఈ మేరకు న్యాయ నిపుణుల సలహా ఇందుకు సానుకూలంగా వస్తే జగన్‌ను ప్రాసిక్యూట్ చేయడానికి గవర్నర్ అనుమతిని ప్రభుత్వం కోరే అవకాశం కనిపిస్తోంది. అవినీతి నిరోధక చట్టంలోని 17 ఏ అధికరణం ప్రకారం మాజీ సీఎంను అరెస్టు చేసి విచారణ జరపడానికి గవర్నర్ అనుమతి అవసరమని ప్రభుత్వంలోని ముఖ్యులు గుర్తు చేస్తున్నారు. ఢిల్లీ అభిప్రాయం మేరకు తాజాగా అసెంబ్లీ సమావేశాల చివరి రోజున ఇదే అంశం పైన పలువురు సభ్యులు సభలో ప్రస్తావన చేసారు. జగన్ పైన చర్య తీసుకోవాలని డిమాండ్ చేసారు. కానీ, ముఖ్యమంత్రి స్పందించారు. ఎట్టి పరిస్థితుల్లో అవినీతి సహించబోమని ..అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కేసులో ప్రధానంగా ఆదానీ పైన ఆరోపణలు రావటంతో కేంద్రంతో చర్చలు చేయాలని భావిస్తోంది. ఆదానీ పాత్ర పైన బీజేపీ ఏ రకంగా స్పందిస్తుంది..జగన్ పైన చర్యలకు దిగితే ఎలాంటి పర్యవసానాలు ఎదురవుతాయనే అంశం పైన అభిప్రాయాలు తీసుకుంటున్నారు. దీని పైన ఢిల్లీ నేతలతో చర్చించిన తరువాతనే తుది నిర్ణయం తీసుకోవాలని భావిస్తోంది. దీంతో, ఇప్పుడు ఢిల్లీ అభిప్రాయం కీలకంగా మారుతోంది.

# పవర్ షేరింగ్ ఫార్ములా!?

(1వపేజీ తరువాయి)శరద్ పవార్" ఈ మూడు పార్టీలు ఖచ్చితంగా పరస్పరం సహకరించుకోగలిగితేనే మహాయుటి ప్రభుత్వం ఏర్పడగలగుతుంది. ఈ పరిణామాలను షిండే వర్గ శివసేన నాయకులు తమకు అనుకూలంగా మలచుకుంటోన్నట్లు తెలుస్తోంది. 50:50 పవర్ షేరింగ్ ఫార్ములాను తెర మీదికి తీసుకొచ్చినట్లు టైమ్స్ నౌ ఓ కథనాన్ని ప్రసారం చేసింది. తొలి రెండున్నరేళ్లు ఏక్‌నాథ్ షిండే, మలి రెండున్నరేళ్లు దేవేంద్ర ఫడ్నవిస్ ముఖ్యమంత్రిగా వ్యవహరించేలా ప్రతిపాదించాలని శివసేన నిర్ణయించినట్లు చెబుతున్నారు. దీనిపై కొత్తగా ఎమ్మెల్యేలతో నిర్వహించబోయే సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటారని, ఓ తీర్మానాన్ని ఆమోదిస్తారని అంటున్నారు. కొత్త ప్రభుత్వంలో కూడా షిండే ముఖ్యమంత్రిగా, దేవేంద్ర ఫడ్నవిస్, అజిత్ పవార్ ఉప ముఖ్యమంత్రులుగా తొలి రెండున్నరేళ్ల పాటు కొనసాగించాలని, మలి రెండున్నరేళ్ల కాలంలో దేవేంద్ర ఫడ్నవిస్ ముఖ్యమంత్రిగా, షిండే, అజిత్ పవార్ ఉప ముఖ్యమంత్రులుగా వ్యవహరించేలా పవర్ షేరింగ్ ఫార్ములాను అమలు చేయాలనే డిమాండ్ క్రమంగా ఊపందుకుంటోంది. మహారాష్ట్రలో చరిత్ర తిరగరాసిన ఎన్డీయే-52 ఏళ్ల రికార్డు బద్దలు..!" 2019 నాటి ఎన్నికల్లోనూ ఉద్ధవ్ థాకరే సారథ్యంలోని శివసేన ఇదే ఫార్ములాను బీజేపీకి ప్రతిపాదించిన విషయం తెలిసిందే. దీనికి అంగీకరించకపోవడంతో ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు ఉద్ధవ్. ఎన్సీపీ, కాంగ్రెస్‌తో కలిసి మహా వికాస్ అఘాడీ ఏర్పాటు చేశారు. ఇప్పుడు కూడా అదే రిపీట్ కావడం ఖాయంగా కనిపిస్తోంది.

ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే- మూడు పార్టీలు కలిసివుంటనే మహాయుటి.. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలుగుతుంది. అధికారాన్ని అందుకోగలుగుతుంది. ఏ ఒక్క పార్టీకి కూడా సొంతంగా ప్రభుత్వాన్ని నెలకొల్పడానికి అవసరమైన మేజిక్ ఫిగర్ దక్కకపోవడం ప్రాధాన్యతను సంతరించు కుంది. "

# సజ్జల అరెస్ట్‌కు రంగం సిద్ధం...!!


(1వపేజీ తరువాయి)చెప్పటంతో వీరిపైన పోలీసులు ఫోకస్ చేసారు. తాజా నోటీసులు ఇచ్చారు. ఈ నెల 8న నమోదైన ఐటీ, బీఎన్ఎస్, అట్రాసిటీ యాక్ట్ కింద ఈ ముగ్గురుపైన కేసులు నమోదయ్యాయి. వర్రా రవీందర్‌రెడ్డి పైన కడప జిల్లాలో పది కేసులు, రాష్ట్ర వ్యాప్తంగా 40 కేసులు నమోదయ్యాయి. దీంతో, వైసీపీ సోషల్ మీడియా బాధ్యతలు చూసిన భార్గవ్ రెడ్డి, అర్జున్ రెడ్డి అరెస్ట్ పైన పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది.

# 29న దీక్షా దివస్: కేటీఆర్

**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ ఉద్యమ సందర్భంలో కేసీఆర్ చేపట్టిన దీక్షను స్ఫూర్తిగా తీసుకుని.. కాంగ్రెస్ కబంధ హస్తాల నుంచి తెలంగాణకు విముక్తి కల్పించడానికి మరో సంకల్ప దీక్ష చేపట్టాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నెల 29న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టనున్న దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. 33 జిల్లా కేంద్రాల్లోని పార్టీ కార్యాలయాల్లో 29న దీక్షా దివ్‌సను నిర్వహించేందుకు ఇన్‌చార్జ్‌లను నియమించినట్లు తెలిపారు.

ఇందుకోసం 26న సన్నాహక సమావేశాలు, 29న నిమ్స్‌లో అన్నదాన కార్యక్రమం చేపడతామన్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 హైదరాబాద్ సోమవారం 25 । నవంబర్ । 2024



## గన్స్‌తో బెదిరించి జ్యుయలరీ షాపులో దోపిడీ..



**పాట్నా:నవభూమి:**జ్యుయలరీ షాపులోకి కొందరు వ్యక్తులు ప్రవేశించారు. గన్స్‌తో అక్కడి సిబ్బందిని బెదిరించారు. ఆ షాపులోని బంగారు నగలు, ఆభరణాలు, డబ్బును దోచుకున్నారు. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయారు. ఆ షాపులోని సీసీటీవీలో రికార్డైన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. బీహార్‌లోని సమస్తిపూర్‌లో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం రాత్రి షాపు మూసే సమయానికి పాత పోస్టాఫీసు రోడ్డులో ఉన్న అనిల్ జ్యుయలరీలోకి కొందరు వ్యక్తులు ఒక్కొక్కరుగా ప్రవేశించారు.కాగా, కస్టమర్లుగా వచ్చిన ఆ వ్యక్తులు గన్స్ తీశారు. ఆ షాపులోని సిబ్బందిని బెదిరించారు. ఒక సిబ్బంది నుంచి తాళాలు తీసుకున్నారు. ఒక వ్యక్తి, మహిళ కలిసి ర్యాకుల్లో ఉన్న నగల బాక్సులను తెరిచారు. బంగారు ఆభరణాలతోపాటు కౌంటర్‌లోని డబ్బును బ్యాగులో వేసుకున్నారు. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయారు.మరోవైపు ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఆ జ్యుయలరీ షాపు వద్దకు చేరుకున్నారు. సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. ఆ షాపు సిబ్బందిలో కొందరిపై అనుమానం వ్యక్తం చేశారు. నిందితులను గుర్తించామని, వారిని త్వరలో అరెస్ట్ చేస్తామని పోలీస్ అధికారి వెల్లడించారు. మరోవైపు జ్యుయలరీ షాపులో దోపిడీకి సంబంధించిన సీసీటీవీ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## ఎన్నికల విజయోత్సవంలో అపశృతి.. మంటలు చెలరేగి గెలిచిన అభ్యర్థికి కాలిన గాయాలు



**ముంబై - నవభూమి:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన ఒక అభ్యర్థి విజయోత్సవంలో అపశృతి జరిగింది. మహిళలు ఇచ్చిన హారతిపై గులామ్ పడటంతో మంటలు చెలరేగాయి. దీంతో ఆ అభ్యర్థితో పాటు పలువురు మహిళలకు కాలిన గాయాలయ్యాయి. చంద్‌గడ్‌లో పోటీ చేసిన స్వతంత్ర అభ్యర్థి శివాజీ పాటిల్ విజయం సాధించారు. దీంతో శనివారం రాత్రి మహ్గావ్‌లో అభిమానులు ఏర్పాటు చేసిన విజయోత్సవంలో ఆయన పాల్గొన్నారు.

కాగా, ఈ సందర్భంగా రంగులు చల్లుకున్నారు. కొందరు మహిళలు శివాజీ పాటిల్‌కు హారతులు ఇచ్చారు. అలాగే అక్కడున్న వారిపై క్రేన్ సహాయంతో గులాల్ చల్లారు. అయితే హారతులపై గులాల్ పడటంతో భారీగా మంటలు చెలరేగాయి. భయాందోళన చెందిన అక్కడున్న వారు దూరంగా పరుగెత్తారు. ఎన్నికల్లో గెలిచిన స్వతంత్ర అభ్యర్థి శివాజీ పాటిల్‌తోపాటు మరి కొందరు మహిళలకు కాలిన గాయాలయ్యాయి. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## 'ఇండియా కూటమి పార్టీలు సహకరించుకోలేదు'.. కాంగ్రెస్ నేత ఆరోపణ



**ముంబై-నవభూమి:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) ఘోర ఓటమిపై ఆ పార్టీలు నిందించుకుంటున్నాయి. ఇండియా కూటమిలోని మిత్రపక్షాలు ఒకరికొకరు సహకరించుకోలేదని కర్ణాటక హోం మంత్రి, కాంగ్రెస్ ఎన్నికల ఇంచార్జ్ జీ పరమేశ్వర్ ఆరోపించారు. ఇబ్బందికరమైన ఓటమికి కారణం కూటమి భాగస్వాముల మధ్య సహకారం, సమన్వయం లేకపోవడమేనని విమర్శించారు.కాగా, పలు నియోజకవర్గాల్లో శివసేన (యూబీటీ)కి కాంగ్రెస్ పూర్తిగా మద్దతివ్వలేదని పరమేశ్వర్ తెలిపారు. ఉద్ధవ్ ఠాక్రే పార్టీ కూడా అదే విధంగా వ్యవహరించిందని, శరద్ పవార్ ఎన్సీపీ వర్గం కూడా తమ సహకారం ఇవ్వలేదన్నది స్పష్టంగా కనిపించిందని అన్నారు.మరోవైపు దేశంలో ఈవీఎంలు ఉన్నంత వరకు కాంగ్రెస్ లేదా మరేదైనా పార్టీ అధికారంలోకి రావడం చాలా కష్టమని పరమేశ్వర్ తెలిపారు. ఈవీఎంలను హ్యాకింగ్ చేయడంలో వారు (బీజేపీ) నిపుణులని ఆరోపించారు. ఎక్కడ కావాలంటే అక్కడ ఎన్నికల ఫలితాలను వారు తారుమారు చేయగలరని విమర్శించారు.

## కుటుంబం ఎదుటే.. పోలీస్‌ను కొట్టిన కొందరు వ్యక్తులు



**లక్నో:- నవభూమి:**ఒక పోలీస్ అధికారిని అతడి కుటుంబం ఎదుటే కొందరు వ్యక్తులు కొట్టారు. తొలుత ప్రతిఘటించేందుకు ఆయన ప్రయత్నించారు. అయితే ఎక్కువ మంది దాడి చేయడంతో తనను కొట్టవద్దని వేడుకున్నారు. చివరకు అక్కడకు చేరుకున్న పోలీసులు పరిస్థితిని చక్కదిద్దారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో ఈ సంఘటన జరిగింది. రాజతలాబ్ పోలీస్ స్టేషన్ హెడ్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌వో) అజిత్ వర్మ శనివారం సాయంత్రం తన భార్య, పిల్లలతో కలిసి కారులో ప్రయాణించాడు. కారు డ్రైవ్ చేసిన ఆయన ఒక ఆటోను ఢీకొట్టాడు. దీంతో సివిల్ డ్రెస్‌లో ఉన్న ఆ పోలీస్‌పై అక్కడున్న కొందరు వ్యక్తులు దాడి చేశారు. పిడిగుద్దులు కురిపించారు.కాగా, తాను పోలీస్ అధికారినని, కొట్టవద్దని అజిత్ వర్మ చెప్పినప్పటికీ వారు పట్టించుకోలేదు. అక్కడున్న పోలీస్ కానిస్టేబుల్ జోక్యం చేసుకున్నప్పటికీ ఫలితం లేకపోయింది. చివరకు సమీప పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీసులు అక్కడకు చేరుకున్నారు. జనానికి నచ్చజెప్పి అతడ్ని విడిపించారు. మరోవైపు ఇరు వర్గాలు ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకున్నారు. కాగా, ఆ పోలీస్‌పై దాడి ఘటనను కొందరు వ్యక్తులు మొబైల్‌లో రికార్డ్ చేశారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## పట్టణీకరణతో పిచ్చుకలు కనుమరుగు.. ప్రధాని మోదీ ఆవేదన

**ముంబై - నవభూమి:** పట్టణీకరణ పెరిగినా కొద్ది పిచ్చుకలు కనుమరుగవుతూ వచ్చాయని, ఇప్పుడు నగరాల్లో ఎక్కడా పిచ్చుకలు కనిపించడం లేదని ప్రధాని నరేంద్రమోదీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇవాళ మన్ కీ బాత్ 116వ ఎపిసోడ్‌లో ప్రధాని ప్రసంగించారు. పిచ్చుకలు జీవవైవిధ్య నిర్వహణలో కీలకపాత్ర పోషిస్తాయని, కాబట్టి పిచ్చుకల జనాభాను తిరిగి పెంచాల్సిన అవసరం చాలా ఉన్నదని ప్రధాని చెప్పారు.ఈ తరం పిల్లల్లో చాలా మందికి పిచ్చుకలను ప్రత్యక్షంగా చూసిన అనుభవం లేదని, కేవలం ఫొటోల్లో, వీడియోల్లో వాటిని చూపించాల్సి వస్తోందని ప్రధాని మోదీ అన్నారు. అలాంటి పిల్లలు పిచ్చుకలను ప్రత్యక్షంగా చూసే రోజు మళ్లీ రావాలని ఆకాంక్ష వెలిబుచ్చారు. కలిసికట్టుగా ప్రయత్నాలు చేస్తే అది అసాధ్యమేమీ కాదని అన్నారు. ఈ సందర్భంగా తమిళనాడు రాజధాని చెన్నైలోని కుడుగల్ ట్రస్ట్ పిచ్చుకల జనాభా పెంపు కోసం చేస్తున్న కృషి గురించి ప్రధాని తెలియజేశారు.

# అక్కడ జైల్లో ఉద్యోగుల కంటే ఖైదీలకే ఎక్కువ జీతం..



**న్యూఢిల్లీ-నవభూమి:**సాధారణంగా ఏదైనా తప్పు చేస్తే జైలుకు పంపుతారు.. అయితే అలా జైలుకు వెళ్లిన వారు జైలు ఉద్యోగుల కంటే ఎక్కువ సంపాదిస్తున్నారు అన్న విషయం మీకు తెలుసా? వినడానికి విచిత్రంగా ఉన్న అది నిజం. మామూలుగా జైల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలలో పరివర్తన తీసుకురావడం కోసం వారి చేత చిన్న చిన్న పనులు చేయిస్తూ ఉంటారు. అలా చేయించిన పనుల ద్వారా వచ్చిన కొంత మొత్తాన్ని ఖైదీల ఆదాయం కింద జమ చేసి వారి విడుదల సమయంలో వారికి అందిస్తారు. ఇది కేవలం జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత వారు బ్రతకడానికి భరోసా కల్పిస్తుంది అని జైలు శాఖ నమ్ముతుంది. . వెయ్యేళ్ల నాటి శ్రీరామ విగ్రహానికి రిపేరు అయితే యూకే లో మాత్రం జైలులో ఉన్న ఖైదీలు పొందుతున్న ఉపాధి అక్కడ పనిచేస్తున్న అధికారుల జీతాల కంటే ఎక్కువ అన్న విషయం తాజాగా వైరల్ అయింది. అయితే ఇది ఎలా సాధ్యం అనుకుంటున్నారా.. యూకే జైల్స్ లో రూల్స్ మన వాటికంటే కాస్త భిన్నంగా ఉంటాయి. ఇక్కడ ఒకసారి జైలుకు వెళ్తే అయితే బెయిల్ మీద లేకపోతే విడుదలయ్యాక మాత్రమే ఖైదీలు బయటికి వస్తారు. కానీ యూకేలో బహిరంగ జైళ్లలో ఉన్న ఖైదీలు బయటకు వెళ్లి పనిచేసుకునే అవకాశం ఉంటుంది . ఆ విధంగా అక్కడ ఖైదీలు బయటకు వెళ్లి వివిధ రకాల ఉద్యోగాలు చేసుకొని అధిక మొత్తంలో జీతం సంపాదిస్తున్నారు. ఒకరకంగా చెప్పాలి అంటే అక్కడ జైల్లో ఉన్న సెక్యూరిటీ గార్డులు,బయోకెమిస్టు, సైకోథెరపిస్ట కంటే కూడా ఖైదీలు ఎక్కువే సంపాదిస్తున్నారు. జైల్ నుంచి బయటకు వచ్చే పని చేసే వారిలో చాలామంది లారీలు, బస్సులు సైతం నడుపుతున్నారు. శిక్షాకాలం ముగిసే సమయానికి వీరికి తాత్కాలిక లైసెన్స్ కూడా వచ్చేస్తోంది.అత్యధికంగా వీరిలో కొంతమంది $ 46,005 అంటే మన కరెన్సీ లో 38,84,491 రూపాయలు సంపాదిస్తున్నారు. మరోపక్క జైల్లో గార్డ్ గా పనిచేసే వ్యక్తి జీతం $ 35,085 అంటే సుమారు 29,62,446 అన్నమాట. కొందరు ఖైదీల తమ సంపాదనలో కొంత మొత్తాన్ని స్వచ్ఛంద సంస్థలకు కూడా అందిస్తున్నారట. ఇలా బయటకి వెళ్లి పనిచేయడం శిక్షకాలం ముగిసి బయటకు వచ్చిన తర్వాత సమాజంలో మంచిగా మెలగడానికి వారికి ఎంతో ఉపయోగపడతాయి అంటున్నారు జైలు అధికారులు.

## అద్భుతం.. వెయ్యేళ్ల నాటి శ్రీరామ విగ్రహానికి రిపేరు



**న్యూఢిల్లీ-నవభూమి:** తిరుమల తిరుపతి దేవస్థానానికి సంబంధించి వెయ్యేళ్ల పురాతన శ్రీరాముని విగ్రహానికి రిపేర్ చేశారు. శ్రీరాముని విగ్రహానికి సంబంధించిన వేలు విరిగింది. దీనికి మరమ్మతులు చేశారు. 1,000 ఏళ్ల విగ్రహానికి మరమ్మతు చేయడంపై అభిమానులు సర్వత్రా హర్షం వ్యక్తం అయింది. ఆలయ సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం.. 2021లో శ్రీరాముని జాతర సందర్భంగా విగ్రహానికి సంబంధించి ఎడమ చేతి వేళ్లలో ఒకదానికి చిన్నపాటి ఫ్రాక్చర్ ఏర్పడింది. దాంతో ఆలయ అధికారులు దానిని తాత్కాలికంగా బంగారం కవచంతో కప్పి పెట్టారు. కొండపై ఈ విగ్రహం లభ్యమైనట్లు తెలిపింది. సహస్రాబ్ది నాటిదని భావిస్తున్నట్లు టీటీడీ వర్గాలు వెల్లడించాయి. 12 ఏళ్లకు ఒకసారి పాడైపోయిన విగ్రహాలకు మరమ్మతు చేయించడం తిరుమలలో జరుగుతుంటుంది. ఈ విగ్రహం వేలు కూడా విరిగి ఐదేళ్లకు పైగా కావడంతో.. ఇటీవల ఈ విషయాన్ని తిరుమలలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా జీయర్ స్వామిజీలు, ఆగమ సలహాదారులు, అర్చకులతో కూడిన కమిటీ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ప్రత్యేక హోమం, పూర్ణాహుతి, కాలవాహనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అంతేకాకుండా.. తిరుమలలోని శ్రీవేంకటేశ్వం స్వామి అధికారిక సంరక్షకుడు, టీటీడీ కూడా ఆలయంలోని శ్రీరామ అంగుళీ సంధాన సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. విగ్రహాలకు చిన్నచిన్న నష్టాలను సరిచేయాలని నిర్ణయించి ఆ మేరకు రిపేరు చేశారు. తదుపరి డ్రైవ్ మళ్లీ 2030లో జరుగుతుంది.

## పేలిన మందుపాతర.. జవాన్‌కు తీవ్ర గాయాలు



**ముంబై - నవభూమి:**నక్సలైట్‌లు పాతిపెట్టిన మందుపాతర పేలడంతో ఒక జవాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. రాయ్‌గూడెం, తుమల్‌పాడ్ గ్రామాల మధ్య నక్సలైట్‌లు ప్రెషర్ కుక్కర్‌లో పేలుడు పదార్థాలు నింపి పాతిపెట్టారు. పేలుడులో తీవ్రంగా గాయపడిన జవాన్‌ను భద్రతా బలగాలు ఆస్పత్రికి తరలించాయి.ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా ఈ మధ్య కాలంలో ఛత్తీస్‌గఢ్‌లో తరచూ ఎన్‌కౌంటర్‌లు చోటుచేసుకుంటున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లలో పలువురు నక్సలైట్‌లు ప్రాణాలు కోల్పోయారు. జవాన్‌లలో కూడా కొందరు గాయపడ్డారు. ఈ క్రమంలో తాజాగా మందుపాతర పేలుడు ఘటన చోటుచేసుకోవడం కలకలం రేపుతోంది.

## 'ప్రేమ' వేధింపులు తట్టుకోలేక పురుగుల మందు తాగి చనిపోయింది



**భీమిలి-నవభూమి:** ప్రేమ వేధింపులకు మరొకరు బలి అయ్యారు. ఇష్టం లేదని చెప్పినా.. వినకుండా అదే పనిగా వేధింపులకు దిగిన వ్యక్తి విషయంలో వేదనకు గురైన ఒక అబల తన ప్రాణాల్ని తీసుకుంది. ఈ విషాద ఉదంతం భీమిలి మండలంలో చోటు చేసుకుంది. ప్రేమోన్మాది వేధింపులకు బలైన రాశి ఉదంతం ఆలస్యంగా వెలుగు చూసింది. సంచలనంగా మారిన ఈ ఉదంతంలోకి వెళితే.. భీమిలి మండలం మజ్జివలస గ్రామానికి చెందిన 22 ఏళ్ల రాశి డిగ్రీ వరకు చదివింది. ప్రస్తుతం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యా వాలంటీరుగా పని చేస్తోంది. అదే గ్రామానికి చెందిన 26 ఏళ్ల పిల్లి రాజు గడిచిన కొన్నేళ్లుగా ఆమె వెంట పడుతున్నాడు. ప్రేమ పేరు చెప్పి వేధింపులకు దిగుతున్నాడు. వెయ్యేళ్ల నాటి శ్రీరామ విగ్రహానికి రిపేరు తనకు ఇష్టం లేదని ఎన్నిసార్లు చెప్పినా అతను పట్టించుకోకపోగా.. ఆమెపై వేధింపుల తీవ్రతను పెంచేవాడు. దీంతో విసిగిపోయిన ఆమె.. పొలాల్లో జల్లటానికి ఇంట్లో ఉంచిన పురుగుల మందును ఈ నెల 16న తాగింది. ఆమె ఆత్మహత్యయత్నాన్ని గుర్తించిన ఇంట్లోని వారు ఆమెను తగరపువలస ఎన్నారై ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆమెకు చికిత్సను అందించారు. మృత్యువుతో పోరాడిన ఆమె చివరకు ఓడిపోయింది. గురువారం సాయంత్రం రాశి కన్నుమూసింది. శుక్రవారం ఉదయం ఆమెకు అంత్యక్రియల్ని నిర్వహించారు. యువతి మరణానికి కారణమైన రాజును పోలీసులు అరెస్టు చేశారు. అతడ్ని రిమాండ్ కు తరలించారు. అయితే.. ఇంటి పరువు బజారున పడుతుందన్న ఉద్దేశంతో ఈ విషయాలేవీ బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే.. రాశి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లుగా పేర్కొన్నారు.

## అత్యధిక, అత్యల్ప మెజార్టీలు ఇవే.. మహా ఓటరు తీర్పులో ఎన్నో ట్విస్టులు..



**ముంబై - నవభూమి:** మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. మహాయుతి, మహా వికాస్ అఘాడి మధ్య జరిగిన పోరులో బీజేపీ, షిండే నేతృత్వంలోని శివసేన, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ కలిసిన మహాయుతి కూటమి ఘన విజయం సాధించింది. మహాయుతి సృష్టించిన సునామీకి కాంగ్రెస్, ఎన్సీపీ(శరద్ పవార్), శివసేన(యూబీటీ)లు కలిసిన మహా వికాస్ అఘాడి పత్తా లేకుండా పోయింది. మహారాష్ట్ర ఓటరు స్పష్టమైన తీర్పు ఇవ్వడంతో మహాయుతి కూటమి అభ్యర్థులు గెలిచిన స్థానాల్లో ఎక్కువ నియోజకవర్గాల్లో భారీ మెజార్టీ సాధించారు. మహా వికాస్ అఘాడి గెలిచిన స్థానాల్లో శివసేన(యూబీటీ) అభ్యర్థుల్లో ఒకరే 50వేలకు పైగా మెజార్టీతో గెలుపొందారు. మిగతా అభ్యర్థులు 50 వేల లోపు మెజార్టీ సాధించారు. మహాయుతి కూటమిలో మాత్రం దాదాపు 15 మంది లక్షలకు పైగా మెజార్టీ సాధించారు. బీజేపీ అభ్యర్థులు ఎనిమిది చోట్ల, షిండే నేతృత్వంలోని శివసేన మూడు చోట్ల, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ నాలుగు చోట్ల లక్షకు పైగా మెజార్టీ సాధించింది. మొత్తం మహాయుతి కూటమి 235 స్థానాల్లో మహా వికాస్ అఘాడి 49, ఎంఐఎం ఒకటి, పీడబ్ల్యూపీఐ ఒక స్థానంలో గెలుపొందగా ఇతరులు రెండు స్థానాల్లో గెలిచారు. అత్యధిక మెజార్టీ సాధించిన వారిలో ఎక్కువమంది బీజేపీ, షిండే నేతృత్వంలోని శివసేన, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకి చెందిన అభ్యర్థులే ఉన్నారు.


**అత్యధికం.. అత్యల్ప స్థానాలు ఇవే..**

మహారాష్ట్రలోని సిర్పూర్ శాసనసభ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి కాశీరామ్ వెచన్ పవార్ తన సమీప ప్రత్యర్థి స్వతంత అభ్యర్థి డాక్టర్ జితేంద్ర యువరాజ్ ఠాకూర్‌పై లక్షా 45వేల 944 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మహారాష్ట్ర మొత్తంగా చూస్తే ఈ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ సాధించిన వ్యక్తిగా కాశీరామ్ వెచన్ పవార్ రికార్డు సృష్టించారు. ఇక ఎంఐఎం అభర్థి ముఫ్తీ మహ్మద్ ఇస్మాయిల్ అబ్దుల్ మాలేగావ్ సెంట్రల్ నుంచి కేవలం 162 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. గత ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి 38,519 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందిన ఎంఐఎం అభ్యర్థి ముఫ్ మహ్మద్ ఇస్మాయిల్ ఈ ఎన్నికల్లో కేవలం 162 ఓట్ల తేడాతో గెలిచారు. మహారాష్ట్రలో అతి తక్కువ మెజార్టీతో గెలిచిన అభ్యర్థిగా ఇస్మాయిల్ నిలిచారు. ఆ తర్వాత కాంగ్రెస్‌కు చెందిన నానాబహు ఫల్గుణరావ్ పటేల్ సకోలి నియోజకవర్గం నుంచి 208 ఓట్ల తేడాతో గెలిచారు.

**మహా ఓటరు తీర్పులో ట్విస్ట్‌లు..**

మహారాష్ట్ర ఓటర్లు ఎలాంటి కన్ఫ్యూజన్ లేకుండా ఈ ఎన్నికల్లో స్పష్టమైన తీర్పునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో మహా వికాస్ అఘాడి ఎక్కువ స్థానాలు సాధించడంతో మహారాష్ట్రలో ప్రస్తుత ప్రభుత్వంపై ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారని, పార్టీని చీల్చారనే ఉద్దేశంతో షిండే, అజిత్ పవార్‌పై ప్రజలు కోపంగా ఉన్నారంటూ మహా వికాస్ అఘాడి చేసిన ప్రచారం అసత్యమని ఫలితాల ద్వారా తెలుస్తోంది. మహాయుతి కూటమి అధికారంలో ఉండాలని ప్రజలు స్పష్టమైన తీర్పునివ్వగా.. ఈ ఎన్నికల్లో మాత్రం హిందూ ఓట్లు పోలరైజ్ అయ్యాయనే అభిప్రాయాన్ని కొందరు వ్యక్తం చేస్తున్నారు. మొత్తం సీట్లలో 80 శాతానికి పైగా సీట్లను మహాయుతి కూటమి గెలుచుకోవడంతో ఓట్ల పోలరైజేషన్ జరిగిందనే చర్చ జరుగుతోంది.

# క్యాన్సర్‌ను భయపెడుతున్న కోవిడ్?



**న్యూఢిల్లీ-నవభూమి:**కోవిడ్ సమయంలో ఎన్ని అనారోగ్య సమస్యలు తలెత్తాయో అందరికీ తెలుసు. కోవిడ్ బారిన పడిన వారి బాధ అంతా ఇంత కాదు. మనలో చాలామందికి కొవిడ్ శోకడం వల్ల ఆరోగ్యం పై పడే దుష్ప్రభావాల గురించి మాత్రమే తెలుసు.. కానీ కోవిడ్ ఇన్ఫెక్షన్ వల్ల మనకు ఓ ప్రయోజనం కూడా ఉంది అంటున్నారు ఇంగ్లాండ్ కు చెందిన శాస్త్రవేత్తలు. మరి ఆ ప్రయోజనం ఏమిటో తెలుసుకుందాం పదండి.. అస్తవ్యస్తమైన జీవనశైలి, స్ట్రెస్ కారణంగా ప్రస్తుతం చాలామంది క్యాన్సర్ తో బాధపడుతున్నారు. చాప కింద నీరులా ఈ క్యాన్సర్ మన వ్యవస్థను క్షీణింప చేస్తుంది. కీమోథెరపీలో ఎన్ని చేయించుకున్న చాలామందికి ప్రయోజనం మాత్రం కనిపించడం లేదు. పైగా క్యాన్సర్ ట్రీట్మెంట్ అంటే ఎంతో రిస్క్ తో కూడుకున్న ట్రీట్మెంట్ అన్న విషయం మనందరికీ తెలుసు. అయితే క్యాన్సర్ తీవ్రతను తగ్గించడానికి కోవిడ్ వైరస్ ఉపయోగపడుతుంది అని తాజాగా ఓ పరిశోధనలో తేలింది. 'జర్నల్ ఆఫ్ క్లినికల్ ఇన్వెస్టిగేషన్' మేగజైన్ లో ప్రచురించిన వివరాల ప్రకారం క్యాన్సర్ తీవ్రతను తగ్గించడానికి ఎలుకలపై చేసిన పరిశోధనలో ఈ వివరాలు తెలిసాయి. ఈ పరిశోధన ప్రకారం.. మన శరీరంలో మైనోసైట్లు అనే తెల్ల రక్త కణాలు ఉంటాయి. ఇవి మన శరీరంలో ఇన్ఫెక్షన్లు, వైరస్లు సోకకుండా రక్షణ కల్పిస్తాయి. అయితే కొన్నిసార్లు క్యాన్సర్ కణాలు వీటిని తమకు అనుకూల కణాలుగా మార్చుకుంటాయి. అందువల్ల మన శరీరంలో రోగనిరోధక వ్యవస్థ క్షీణిస్తుంది. అయితే కోవిడ్ ఇన్ఫెక్షన్ సోకిన సమయంలో మన శరీరంలో ఓ ప్రత్యేక రకమైన మోనోసైట్లు ఉత్పత్తి అవుతాయి అని పరిశోధనలో తేలింది. ఇవి క్యాన్సర్ వ్యతిరేక గుణాలు కలిగి ఉంటాయి కాబట్టి క్యాన్సర్ కణాలను తగ్గిస్తాయి అని శాస్త్రవేత్తలు గుర్తించారు. దీనికి సంబంధించి మరిన్ని పరిశోధనలు జరుగుతున్నాయి.

# మేం.. ప్రజాకోర్టులో గెలిచాం..



**బెంగళూరు-నవభూమి:** ప్రజాకోర్టులో గెలిచామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య సంతోషం వ్యక్తం చేశారు. మూడు స్థానాల్లో మా అభ్యర్థులకు ప్రజలు ఆశీస్సులు అందించారని వారికి ధన్యవాదాలన్నారు. విజయానికి కార్యకర్తల కృషి, నాయకుల కష్టం ఉందన్నారు. బెంగళూరులో శనివారం మీడియాతో మాట్లాడారు. మా ప్రభుత్వ సాధనలను ప్రజలు విశ్వసించారన్నారు. కాంగ్రెస్ పార్టీ వాస్తవాలను ప్రజలు గమనించారన్నారు. బీజేపీ-జేడీఎసలు నిరంతరం తప్పుడు ప్రచారం చేసినా వారి పట్ల కనీస సానుభూతి చూపలేదన్నారు. మా ప్రభుత్వంతోపాటు నన్ను విమర్శలు చేసే పార్టీకి తగిన గుణపాఠం లభించిందన్నారు. ఏడాదిన్నర క్రిందట 135 స్థానాల్లో గెలుపొందామని ప్రస్తుతం మూడింటితో 138కి చేరిందన్నారు.శిగ్గావిలో ముస్లిం అభ్యర్థికి టిక్కెట్ ఇచ్చినప్పుడు వ్యతిరేకత వచ్చిందని అనంతరం అక్కడివారంతా కలసి పనిచేశారన్నారు. బీజేపీ మతతత్వపార్టీకి మద్దతు ఇవ్వరాదని తీర్మానించారన్నారు. చెన్నపట్టణలో కుమార స్వామి, దేవేగౌడలు చేసిన ప్రచారంను ప్రజలు నమ్మలేదన్నారు. దేవేగౌడతో ఎన్నో ఏళ్లు కలసి ఉన్నానని అయినా నాపట్ల తీవ్రమైన ఆరోపణలు చేశారన్నారు. నా గురి సిద్దరామయ్య అంటూ అహంకారంతో మాట్లాడారన్నారు. 40ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, రెండుసార్లు సీఎంగా, డీసీఎంగా మంత్రిగా నేనెప్పుడూ అలా మట్లాడలేదన్నారు. ఎన్నికలలో కుటుంబమంతా ఏడ్చారని అయినా ప్రజలు మాకే ఓటు వేశారన్నారు.

**ప్రియాంకగాంధీకి శుభాకాంక్షలు**

కేరళ రాష్ట్రం వాయనాడ్‌లో ప్రియాంకగాంధీ భారీ మెజారిటీతో గెలుపు సాధించడంపై సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లు హర్షం వ్యక్తం చేశారు. ప్రియాంకగాంధీకి ఫోన్‌చేసి అభినందనలు తెలిపారు. కేరళ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఝార?ండ్‌లో సీఎం సోరన్‌ను ఈడీ జైలుకు పంపడం, తప్పుడు కేసులో వేధించారనేది ప్రజలు గుర్తించారన్నారు.

**రాష్ట్రమంతటా సంబరాలు**

కాంగ్రెస్ పార్టీ విజయంతో రాష్ట్రమంతటా సంబరాలు చేసుకున్నారు. కేపీసీసీ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు సౌమ్యరెడ్డి నేతృత్వంలో కేపీసీసీ కార్యాలయం వద్ద బాణాసంచా పేల్చి స్వీట్లు పంచుకున్నారు. వేడుకలు, ర్యాలీలు నిర్వహించారు.



## గన్స్‌తో బెదిరించి జ్యుయలరీ షాపులో దోపిడీ..

**పాట్నా- నవభూమి:** జ్యుయలరీ షాపులోకి కొందరు వ్యక్తులు ప్రవేశించారు. గన్స్‌తో అక్కడి సిబ్బందిని బెదిరించారు. ఆ షాపులోని బంగారు నగలు, ఆభరణాలు, డబ్బును దోచుకున్నారు. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయారు. ఆ షాపులోని సీసీటీవీలో రికార్డైన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. బీహార్‌లోని సమస్తిపూర్‌లో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం రాత్రి షాపు మూసే సమయానికి పాత పోస్టాఫీసు రోడ్డులో ఉన్న అనిల్ జ్యువలరీలోకి కొందరు వ్యక్తులు ఒక్కొక్కరుగా ప్రవేశించారు. కాగా, కస్టమర్లుగా వచ్చిన ఆ వ్యక్తులు గన్స్ తీశారు. ఆ షాపులోని సిబ్బందిని బెదిరించారు. ఒక సిబ్బంది నుంచి తాళాలు తీసుకున్నారు. ఒక వ్యక్తి, మహిళ కలిసి ర్యాకుల్లో ఉన్న నగల బాక్సులను తెరిచారు. బంగారు ఆభరణాలతోపాటు కౌంటర్‌లోని డబ్బులను బ్యాగులో వేసుకున్నారు. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయారు.
మరోవైపు ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఆ జ్యుయలరీ షాపు వద్దకు చేరుకున్నారు. సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. ఆ షాపు సిబ్బందిలో కొందరిపై అనుమానం వ్యక్తం చేశారు. నిందితులను గుర్తించామని, వారిని త్వరలో అరెస్ట్ చేస్తామని పోలీస్ అధికారి వెల్లడించారు. మరోవైపు జ్యుయలరీ షాపులో దోపిడీకి సంబంధించిన సీసీటీవీ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.



## నాణ్యమైన కాలం!

కాలం అంటే ఏమిటి? దానిని కొలిచేదెట్లా? గంటలు, రోజులు, నెలలు, సంవత్సరాల్లోనా?... 'తారీఖులు, దస్తావేజులు... ఇవి కావోయ్ చరిత్రకర్థం' అన్నారు శ్రీశ్రీ. అసలు కాలం (టైమ్) అనే భావనే ఒక ఇల్యూజన్ అని ఐన్‌స్టీన్ సిద్ధాంతం. ఒక సూర్యుడు సమస్త జీవులకు తానొక్కొకండుగా కనిపిస్తాడట. కాలం కూడా అంతే. కాలం ఒక సాపేక్ష (రిలేటివ్) అనుభవం. కొందరికి భారంగా, కొందరికి దివ్యంగా, కొందరికి వేగంగా, కొందరికి నిలకడగా ఉన్నట్టు ఏకకాలంలో అది అనుభూతులను పంచుతుంది. ఒక ఆదియునూ, ఒక అంతమూ కలిగిన ఒకానొక పరిణామక్రమపు ప్రస్థానాన్ని కాలంగా గుర్తుపెట్టుకుంటాము. ఈ ప్రస్థానంలో కలిగిన సామూహిక అనుభూతుల ప్రాతిపదికపై ఆయా చారిత్రక విభాత సంధ్యల మానవ కథ వికాసమెట్టిదో గణించగలుగుతాము. అందువల్ల పరిమాణం కంటే నాణ్యతే కాలానికి సరైన కొలమానం. మన పూర్వీకులు 'రాశి కంటే వాసి మిన్న' (క్వాంటిటీ కన్న క్వాలిటీ మిన్న) అని అందుకే భావిం చారు. సరిగ్గా ఏడాది కిందటి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు కూడా ఈ రెండు భావాల మధ్య ఘర్షణను తలపించాయి. ఫార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ సిద్ధాంతాన్ని ప్రజలు తిరస్కరించారు. 'ఎన్నాళ్లు బతికామన్నది కాదు, ఎలా బతికామన్నది ముఖ్యం' అనే 'మాగ్నాకార్టా'కు పట్టం కట్టారు. ఆ తర్వాత ఏం జరిగింది?

ఏదో ఒక పల్లెనడిగి తెలుసుకుందాం. లాటరీ పద్ధతిలో ఆ పల్లె పేరు కోపల్లె. కేరాఫ్ తెనాలి. ఏదైతేనేం, ఏదో ఒక ఇల్లు. తలుపు తట్టిన ఇల్లు దర్జీ పని చేసుకునే ధర్మయ్యది. వాళ్లమ్మగారి పేరు ఏసురత్నమ్మ. కాలం మారింది బాబూ అంటున్నదామె. వాళ్లా యన బతికి ఉన్నప్పుడు వృద్ధాప్య పింఛన్ మంజూరీ కోసం ఐదేళ్లు తిరిగాడట. పింఛన్ రాలేదు. ఈలోగా ఆయన కాలం చేశారు. వితంతు పింఛనైనా ఇస్తారేమోనని ఏసురత్నమ్మ ఏడాది న్నరపాటు పంచాయతీ ఆఫీసు చుట్టూ తిరిగిందట. చివరకు ఆశ వదిలేసుకుని ఇంటి పట్టునే ఉంటున్నది. కొన్నాళ్ల కిందట గ్రామ వలంటీరునంటూ ఒకమ్మాయి ఇంటికొచ్చింది. 'అవ్వా నీకు పింఛన్ వస్తోందా?' అని అడిగి మరీ కాయితాల మీద వేలి ముద్రలు వేయించుకుని పోయింది! 'ఏళ్లు తిరిగినా రాని పింఛన్ ఏలిముద్రలేస్తే వచ్చేత్తాదా అనుకుని పట్టించుకోలేదు. ఒకరోజు అదే వాలంటీరమ్మ వచ్చి ఇదిగో నీ పింఛనంటూ డబ్బులు చేతిలో పెడితే నమ్మలేకపోయా'నంటూ చెప్పుకొచ్చింది. దర్జీ లకు రూ.10 వేల ఆర్థికసాయం పథకంలో ఆమె కొడుకు ధర్మయ్య లబ్ధిదారుడు. కోడలి పేరు వజ్రమ్మ. తన పేరు పేద లకు ఇళ్ల స్థలాల పథకంలో చేరిందని సంతోషంగా చెప్పిందామె. ఇంకో నెలరోజుల్లో స్థలం కాగితాలు చేతికిస్తారు. అన్న చెప్పా డంటే చేస్తారంతే. చాలా నమ్మకంగా కనిపించింది. వజ్రమ్మ పెద్దకొడుకు జశ్వంత్. గుంటూరులో బీటెక్ ఫస్టియర్ పూర్తయింది. జగనన్న విద్యాదీవెన పథకం కింద ప్రభుత్వం రూ.52 వేలు కట్టేసింది. రెండో కొడుకు యశ్వంత్ పాలిటెక్నిక్ చదువుతున్నాడు. జగనన్న వసతి దీవెన పథకంలో 15 వేలు మంజూర య్యాయి. తొలివిడత 7,500 అందుకున్నాడు. కూతురు సుష్మ తొమ్మిదో క్లాసు. అమ్మఒడి కింద వజ్రమ్మ ఖాతాలో 15 వేలు పడ్డాయి. ఇవి పాతరోజులు కావు సారూ... ఇప్పుడు సంతో షంగా ఉందంటున్నాడు ధర్మయ్య. బతకడం కోసం బతుకంతా పోరాడిన ఏసురత్నమ్మ ఇప్పుడు స్థిమితంగా కనబడింది. జీవిత కాలపు ఎదురుచూపుల తర్వాత ఇప్పుడామె కళ్లలో ఒక సంతృప్తి మెరుస్తున్నది. ఆ ఇళ్లే కాదు, ఏ ఇంటికెళ్లి ఆరాతీసినా రోజులు మారాయనీ, ఇప్పుడు బాగుందనే చెప్పుకొచ్చారు. కోపల్లే కాదు, ఏ పల్లెను పలకరించినా అదే గుండె చప్పుడు. అక్కడికి దగ్గర్లోనే వున్న కొల్లిపర మండలం గుదిబండవారిపాలెం రైతు శ్రీను శేఖర్‌రెడ్డి మంచి జోష్ మీదున్నాడు. మూడెకరాల్లో జొన్న, మూడెకరాల్లో మొక్కజొన్న వేశాడు. దిగుబడి బాగా వచ్చింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో మద్దతు ధరకు ఇచ్చేశాడు. పోయినేడు కంటే రూ. 50 వేలు ఎక్కువొచ్చాయి. తేమ శాతం చూడాలి, తూర్పారపట్టాలనే షరతులేమీ లేవు. పదమూడు రోజుల్లో బ్యాంకు ఖాతాలో డబ్బులు పడ్డాయి. కొడుకు బీఫా ర్మసీ చదువుతున్నాడు. జగనన్న విద్యాదీవెన పథకంలో రూ.80 వేల ఫీజును ప్రభుత్వం కట్టేసింది. వసతి దీవెన కింద తొలివిడత రూ.7,500 వచ్చాయి. ఇది రైతురాజ్యమంటాడు శ్రీను శేఖర్‌రెడ్డి. అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గంలో కల గోడు అనే ఓ మారుమూల గ్రామం వుంది. ఆరు కిలోమీటర్ల దూరంలో ఉండే గుమ్మఘట్ట మండల కేంద్రానికి వెళ్లాలంటే బస్సు సౌకర్యంగానీ, ఆటో సౌకర్యం గానీ ఉండేది కాదు. కొంత మందికి మోటార్ బైక్‌లు ఉన్నాయి. మిగతా వాళ్లు నడిచి వెళ్లా ల్సిందే. కానీ రెండు బెల్టు షాపులు మాత్రం ఉండేవి. చీప్ లిక్కర్‌కు బానిసలై ఇద్దరు చనిపోయారు కూడా. కొత్త ప్రభుత్వం రాగానే ఆ రెండు షాపులు మాయమైపోయాయి. ఇప్పుడు మందు తాగాలంటే ఆరేడు కిలోమీటర్లు నడిచిపోవాలి. పైగా షాక్ కొట్టే ధరలు. గత్యంతరం లేక తాగుడు మానేశానంటు న్నాడు బోయ రాజశేఖర్. 'జగనన్న చేసిన పనికి మొదట్లో బాధగా వుండేది సామీ. రానురాను అలవాటైంది. ఇప్పుడు ఆరోగ్యం బాగుంద'న్నాడు. ఆ మారుమూల గ్రామానికి ఇప్పుడు గ్రామ సచివాలయం ఒక పెద్ద సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్. ఎప్పుడు చూసినా ఓ పది నుంచి పాతికమంది అక్కడ తచ్చాడు తుంటారు. ఉపాధి హామీ డబ్బు పడిందో లేదో చూసుకోవడాని కని కొందరు, రైతు భరోసా వచ్చిందో లేదో తెలుసుకోవడానికి వచ్చామని కొందరు చెబుతారు. వాళ్ల దృష్టిలో ఈ భూప్రపంచం మీది ఏ సమస్యకైనా గ్రామ సచివాలయంలో పరిష్కారం దొరుకుతుంది. చాలా గ్రామాల్లో సచివాలయాలు అటువంటి విశ్వాసాన్ని నింపగలిగాయి. మంగలి సాకమ్మ కోడలు చనిపోయింది. కొడుకు దేశాలు పట్టిపోయాడు. ఏడేళ్ల మనవడిని కూలినాలి చేస్తూ సాకమ్మ పోషించుకుంటున్నది. మనవడికి చదువుకోవా లని కోరిక.

# అమెరికాలో కేసు ..దేశంలో రాజకీయ దుమారం



విద్యుత్ ఒప్పందాల్లో అదానీ లంచాల వ్యవహారంపై అమెరికాలో కేసు నమోదైంది. దీంతో మన దేశంలో రాజకీయ దుమారం చెలరేగింది. ప్రధానంగా ఏపీ, తెలంగాణ రాజకీయాల్లో అదానీ ప్రభావం కనిపిస్తున్నది. ఇప్పటికిప్పుడు ఏదో అయిపోతుందని కాదు కానీ, తమ దేశ చట్టాల ప్రకారం కేసును అమెరికా ముందుకు తీసుకువెళ్తే మాత్రం పెను ప్రకంపనలు తప్పవు. ఇతర ప్రయోజనాలు ఆశించి మన దేశంలో లాగానే వ్యవహరిస్తే మాత్రం అదానీ వివాదం టీ కప్పులో తుఫాన్ వలె ముగిసిపోతుంది.

విద్యుత్ ఒప్పందాల్లో రూ.2 వేల కోట్ల వరకు లంచాల ఆరోపణలపై గౌతమ్ అదానీతో పాటు సాగర్ అదానీ, వినీత్ జైన్, రంజిత్ గుప్తా, సిరిల్ కబా నెస్, సౌరవ్ అగర్వా ల్, దీపక్ మల్హోత్రా, రూపేష్ అగర్వాల్ సహా ఎనిమిది మందిపై కేసులు నమోదయ్యాయి. అమెరికా న్యాయవిభాగం అధికారిక వెబ్‌సైట్‌లో ఈ వివరాలు అందుబాటులో ఉన్నాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ విద్యుత్ ఒప్పందాల్లో లంచాల వ్యవహారంపై కేసు అమెరికాలో నమోదు కాగా, ఆ కంపెనీ కార్యకలాపాలు భారత్‌లో నిర్వహిస్తున్నది. విద్యుత్ ఉత్పత్తి చేసేదీ, వినియోగించేదీ ఇక్కడే. ఒప్పందాలు చేసుకున్నదీ ఇక్కడి రాష్ట్రాలతోనే. అయితే అమెరికాలో కేసులేమిటి? అమెరికాకు ఏం సంబంధం? అనే సందేహాలు కలుగవచ్చు. గ్రీన్ ఎనర్జీ కోసం అదానీ కంపెనీ అమెరికన్ల నుంచి కూడా నిధులు సేకరించింది.

అందుకోసం అదానీ కంపెనీ గురించి ఆ దేశంలో ఇన్వెస్టర్లకు సమాచారం ఇచ్చారు. తమ కంపెనీ లంచాలకు వ్యతిరేకమని, విలువలు పాటించామని తప్పుడు సమాచారం ఇచ్చారనేది ప్రధాన ఆరోపణ. లంచాల వ్యవహారం మన దేశంలోనే జరిగినా.. అది అమెరికా నిబంధనలకు విరుద్ధం. కాబట్టి, అమెరికా చట్టాల ప్రకారం కేసులు అక్కడ నమోదయ్యాయి. అదే భారత్‌లో అయితే గతంలో వచ్చిన ఆరోపణలు టీ కప్పులో తుఫాన్‌లా ముగిసినట్టే ఇప్పుడూ అలాగే ముగిసేవి. కానీ, ఇప్పుడు కేసులు నమోదైంది అమెరికాలో కాబట్టి అంత సులువుగా సమసిపోతాయనే అంచనాకు రాలేం. రెండు దేశాల మధ్య సంబంధాలు, ఇతర అనేక అంశాలు ఈ కేసుపై ప్రభా వం చూపుతాయి. బైడెన్ శకం మరో రెండు నెలల్లో ముగిసిపోయి.. ట్రంప్ శకం ప్రారంభం కానున్నది. దీనిపై బైడెన్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో తెలియదు. రెండు నెలల్లోనే నిర్ణయాలు వెలువడతాయా? లేక ట్రంప్ పగ్గాలు చేపట్టేదాకా కేసు కొనసాగుతుందా అనేది కూడా మనం చెప్పలేం.

'ఓటుకు నోటు కేసులో ఏకంగా ఎమ్మెల్సీనే కొనేందుకు రూ.50 లక్షల నగదుతో పట్టుబడ్డ రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకొని మరీ ముఖ్యమంత్రిని చేశారు. రూ.2 వేల కోట్ల లంచం ఆరోపణలు వచ్చిన అదానీ ఒకవేళ కాంగ్రెస్‌లో ఉండి ఉంటే అతడిని ప్రధానమంత్రిని చేసేవారా?' అని నెటిజన్లు రాహుల్‌గాంధీని ఒక ఆట ఆడుకుంటున్నారు. ఒకవైపు న్యాయస్థానాల్లో కేసు నడుస్తుండగా నే దేశంలో జోరుగా రాజకీయాలు సాగుతున్నాయి. రాజకీయ పక్షాలు ప్రతి అంశం నుంచి ప్రయోజనాలను ఆశిస్తాయి. అమెరికా కోర్టు అదానీ అరెస్టుపై ప్రకటన చేయగానే ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ తీవ్రంగా స్పందించా రు. ఒక ముఖ్యమంత్రిపై రూ.10–15 కోట్ల ఆరోపణలు రాగానే అతన్ని అరెస్టు చేశారని, మరి రూ.2 వేల కోట్ల అవినీతి ఆరోపణలు వచ్చినా అదానీని ఎందుకు అరెస్టు చేయడం లేదని ఆయ న ప్రశ్నించారు. నిజమే ఎలాంటి ఆధారాలు లేకపోయినా లిక్కర్ స్కామ్ అంటూ ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఉన్న కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారు. అదే విధంగా ఝార?ండ్ సీఎంనూ అరెస్ట్ చేశారు. మరి అమెరికా వంటి అగ్రరాజ్యం కోర్టు చెప్పినా అదానీని ఎందుకు అరెస్టు చేయడం లేదు. రాహుల్‌గాంధీ అడిగిన ప్రశ్నలో న్యాయం ఉన్న ది. అయితే ఆయన వేసిన ప్రశ్నకు కౌంటర్‌గా సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు సంధించిన ప్రశ్నలు మరింత ఆసక్తికరంగా ఉన్నాయి.

'అదా నీ విద్యుత్ ఒప్పందాల కోసం లంచాలు ఇవ్వజూపారనేది ఆరోపణలు మాత్రమే. నిజం కావచ్చు, కాకపోవచ్చు. ఆరోపణలకే అదానీని అరెస్టు చేయాలని రాహుల్ పట్టుబడుతున్నారు. మరి ఏకంగా ఓటుకు నోటు కేసులో శాసనమండలి సభ్యుడిని కొనేందుకు రూ.50 లక్షల నగదుతో దొరికిన రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకొని ముఖ్యమంత్రిని చేశారు. మరి రూ.2 వేల కోట్ల లంచం ఆరోపణలు వచ్చిన అదానీ ఒకవేళ కాంగ్రెస్‌లో ఉండి ఉంటే అతన్ని ప్రధానమంత్రిని చేసేవారా?' అని నెటిజన్లు రాహుల్‌గాంధీ ని ఆడుకుంటున్నారు. కాంగ్రెస్ నాయకులు అదానీ వ్యవహారంలో మోదీని తప్పుబడితే.. బీజేపీ నాయకులు రేవంత్‌రెడ్డిని ఆడుకుంటున్నారు. అదానీ వ్యవహారంలో మోదీని తప్పుపట్టేవారు.. రూ.వంద కోట్ల విరాళం అదానీ నుంచి తీసుకున్న వ్యవహారంలో, అదానీతో చేసుకున్న ఒప్పందాల వ్యవహారంలో రేవంత్ రెడ్డిని ఎందుకు తప్పుబట్టడం లేదని, అతనిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని బీజేపీ నాయకులు ఎదురు ప్రశ్నిస్తున్నారు.

అదానీ కేసు ఎలా ముగుస్తుందనేది అమెరికా కోర్టు నిర్ణయిస్తుంది. ఈ లోపు రాజకీయ పక్షాల న్నీ తమ పార్టీల కోణంలో రాజకీయం చేస్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ప్రధాని మోదీ.. అదానీ వ్యవహారాన్ని ప్రస్తావించారు. గతంలో రాహుల్ కూడా అదానీపై ఆరోపణలు చేశారు, ఎన్నికల సమయంలో ట్రక్కుల్లో అదానీ నుంచి నోట్ల కట్టలు రాగానే మౌనం వహించార ని మోదీ ఆరోపించారు. ఈ ఆరోపణల ప్రకారం కాంగ్రెస్‌కు నోట్ల కట్టలు పంపించిన అదానీకి ఇప్పుడు బీజేపీ ఏకంగా అధికార ప్రతినిధిగా అం డగా నిలవాల్సిన అవసరమేమిటి? ట్రక్కుల్లో నోట్ల కట్టలు పంపించే అదానీపై ప్రభుత్వం ఎం దుకు చర్య తీసుకోవడం లేదు? అంటే ప్రధాని స్థాయి వాళ్లు కూడా ఎన్నికల్లో నోటికి వచ్చింది మాట్లాడుతారన్న మాట. వారు కూడా బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తారన్న మాట. ఈ లంచాల వ్యవహారంతో ఏపీకి కూడా స బంధాలు ఉండటంతో టీడీపీ అనుకూల మీడి యా అదానీ కన్నా జగన్‌నే ఎక్కువగా టార్గెట్ చేస్తున్నది. జగన్ హయాంలో జరిగిన ఒప్పందా ల్లో అదానీ లంచాలు ఇచ్చారని టీడీపీ ఆరోపిస్తు న్నది. అదే నిజమైతే ఆ ఒప్పందాలను ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం రద్దు చేస్తుందా? రాజకీయ విమర్శలే తప్ప ఒప్పందాల రద్దు వంటి చర్యలు ఉండవనిపిస్తున్నది. ఓ సినిమాలో చిరంజీవి ఫ్యాన్‌గా రవితేజ నటిస్తాడు.

# హమారా సంవిధాన్ - హమారా సమ్మాన్




భారత రాజ్యాంగాన్ని స్వీకరించినందుకు గుర్తుగా ప్రతి సంవత్సరం నవంబర్ 26 న రాజ్యాంగ దినోత్సవం జరుపుకుంటారు. 1949లో భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభ ఆమోదించిన రోజుగా ప్రతి సంవత్సరం నవంబర్ 26న సంవిధాన్ దివస్ అని పిలువబడే రాజ్యాంగ దినోత్సవాన్ని మన దేశంలో జరుపుకుంటాం. 2015లో భారత ప్రభుత్వం నవంబర్ 26ని రాజ్యాంగ దినోత్సవంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

**మన రాజ్యాంగం –మన గౌరవం:**

ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం "మన రాజ్యాంగం, మన గౌరవం" థీమ్ గా తీసుకున్నారు. "రాజ్యాంగం పట్ల పౌరుల అవగాహనను బలోపేతం చేయడమే లక్ష్యంగా సమాజాన్ని రూపొందించడంలో రాజ్యాంగ ప్రాముఖ్యత, ప్రాథమిక సూత్రాలు ప్రతి భారతీయుడితో అనుసంధానించబడి ఉండేలా చూడటానికి పౌరులకు వారి చట్టపరమైన హక్కుల గురించి అవగాహన కల్పించడం ఈ ఏడాది ప్రచారం లక్ష్యం." రాజ్యాంగంలోని ప్రాథమిక సూత్రాలను సరళీకరించడం, సాధారణ ప్రజలకు ప్రాచుర్యం కల్పించడంపై ఇది దృష్టి పెడుతుంది. రాజ్యాంగం ప్రోత్సహిస్తున్న న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం వంటి విలువలను పౌరులు అర్థం చేసుకోవడానికి ఇది సహాయపడుతుంది. ఈ ప్రచారం భారత రాజ్యాంగం కింద పౌరుల చట్టపరమైన హక్కులు, విధులు, అర్హతల గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి రూపొందించబడింది. ఇది వ్యక్తులు తమ హక్కులను ధృవీకరించడానికి అధికారం ఇస్తుంది. దేశం, సమాజం పట్ల ప్రజల బాధ్యతలను నెరవేర్చేలా చేస్తుంది. ఈ చొరవలో భాగంగా, సమానత్వ హక్కు, భావప్రకటనా స్వేచ్ఛ హక్కు, నిష్పాక్షిక విచారణ హక్కు వంటి రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కులతో సహా వారి హక్కులపై చర్చలలో పాల్గొనడానికి పౌరులను ప్రోత్సహిస్తారు. ఉప ఇతివృత్తాలుగా "సబ్కో న్యాయ్ హర్ ఘర్ న్యాయ్", "నవ భారత్ – నవ సంకల్ప్", " విధి జాగృతి అభియాన్" తీసుకున్నారు.

**రాజ్యాంగ రూపకల్పన – పీఠిక**

క్యాబినెట్ మిషన్ ప్రణాళిక ప్రకారం రాజ్యాంగ సభ ఏర్పాటుకు ఎన్నికలలో గెలిచిన నాయకులు, ప్రతినిధులతో 1946లోనే పరిషత్ ఏర్పాటు జరిగింది. రాజ్యాంగ రూపకల్పనకు ముసాయిదా కమిటీని ఏర్పాటు చేశారు. 'భారత రాజ్యాంగ పితామహుడు'గా పరిగణించబడే డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ముసాయిదా కమిటీకి ఛైర్మన్‌గా ఉన్నారు. రాజ్యాంగ పరిషత్ సలహాదారుగా న్యాయకోవిదుడు డా. బెనగల్ నర్సింగరావు వివిధ దేశాల రాజ్యాంగాలు కూలంకషంగా అధ్యయనంచేసి రాజ్యాంగ ప్రథమ ముసాయిదా తయారీలో అంబేద్కర్ గారికి సాయపడ్డారు. రాజ్యాంగాన్ని వ్రాయడానికి పట్టిన కాలం 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు. స్వాతంత్ర్యానంతరం 15మంది స్త్రీలతో సహా



మొత్తం 299మంది సభ్యులతో పూర్తి రాజ్యాంగం ముసాయిదాను 1949 నవంబర్ 26వ తేదీ నాడు నూతన రాజ్యాంగాన్ని ఆమోదిం చింది. 24 జనవరి 1950న గౌరవనీయ సభ్యులు తమ సంతకాలను జోడించారు. మూల రాజ్యాంగం హిందీ, ఆంగ్లంలో వ్రాయబడింది. రాజ్యాంగం వాస్తవానికి మొత్తం 284 మంది సభ్యులచే సంతకం చేయబడింది. మూల భారత రాజ్యాంగం ముద్రించబడకుండా చేతితో వ్రాయబడింది. 13 డిసెంబరు1946న అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రవేశపెట్టిన "ఆబ్జెక్టివ్స్ రిజల్యూషన్" తరువాత 22 జనవరి 1947న పీఠికగా ఆమోదించబడింది.

**1935 చట్టం మూలాధారం:**

భారత రాజ్యాంగానికి 1935 భారత ప్రభుత్వ చట్టం మూలాధారం అయినప్పటికీ అనేక అంశాలు ఇతర రాజ్యాంగాల నుంచి గ్రహించారు. ఏకపౌరసత్వం , పార్లమెంటరీ విధానం , సభాపతి పదవి బ్రిటన్ నుండి, ప్రాథమిక హక్కులు అత్యున్నత న్యాయస్థానం, న్యాయ సమీక్షాధికారం అమెరికా నుండి, ఆదేశిక సూత్రాలు, రాష్ట్రపతి ఎన్నిక పద్ధతి, రాజ్యసభ సభ్యుల నియామకం ఐర్లాండ్ నుండి, ప్రాథమిక విధులు రష్యా నుండి, కేంద్ర రాష్ట్ర సంబంధాలు కెనడా నుండి, అత్యవసర పరిస్థితి జర్మనీ నుండి గ్రహించబడ్డాయి.

**ప్రధాన లక్ష్యం:**

రాజ్యాంగ ప్రధాన లక్ష్యం ప్రజల ప్రాథమిక హక్కులను పరిరక్షించడం. రాజ్యాంగం పౌరుల ప్రాథమిక హక్కులు, విధులను తెలియజేస్తుంది. ప్రభుత్వ సంస్థల రాజకీయ ప్రవర్తన, నిర్మాణం, అధికారాలు విధులను నిర్దేశిస్తుంది. రాజ్యాంగ నియమాన్ని ఉల్లంఘించే అధికారం సామాన్యునితో పాటుగా రాష్ట్రపతికి కూడా లేదు. రాజ్యాంగం రాజ్యాంగ సభచే సృష్టించబడినందున ఇది పార్లమెంటరీ ఆధిపత్యం కంటే రాజ్యాంగ ఆధిపత్యాన్ని తెలియజేస్తుంది. రాజ్యాంగ ప్రారంభం నుండి చివరి వరకు భారతీయులచే రూపొందించబడింది. భారతదేశాన్ని సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా ప్రకటించింది. ఈ దేశంలోని పౌరులందరికీ సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం లభిస్తాయని ఇది నిర్ధారిస్తుంది. భారత రాజ్యాంగ ప్రవేశిక రాజ్యాంగ ప్రాథమిక విలువలు, లక్ష్యాలను వివరించే సంక్షిప్త పరిచయ ప్రకటన. ఇది రాజ్యాంగానికి మార్గదర్శక స్ఫూర్తిగా, ఆత్మగా పనిచేస్తుంది. ప్రవేశికలోని భారత ప్రజలమైన "మేము" అనే పదం రాజ్యాంగానికి ప్రజలే ఆధారమని తెలుపుతుంది. 'శాసనం చేసుకొని మాకు మేము సమర్పించుకుంటున్నాం' అనే భావన రాజ్యాంగ పరిషత్తు ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తుందని వివరిస్తుంది. భారత ప్రభుత్వ నిర్మాణం ఎలా ఉండాలి, పరిపాలన ఎలా జరగాలి అనే విషయాలను రాజ్యాంగం నిర్దేశించింది. శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయ వ్యవస్థల ఏర్పాటు, ఆయా వ్యవస్థల అధికారాలు, బాధ్యతలు, వాటి మధ్య సమన్వయం ఎలా ఉండాలో కూడా నిర్దేశిస్తోంది. ప్రజల తరపున నిర్ణయాధికారులు ప్రజాభిప్రాయానికి న్యాయమైన ప్రాతినిధ్యం ఉండేలా చూస్తుంది. అధికారాన్ని చెలాయించే అధికారులు వారు సేవ చేసిన ప్రజలకు జవాబుదారీగా ఉండే మార్గాలను ఇది నిర్దేశించింది. భారత ప్రభుత్వ వ్యవస్థ, రాష్ట్రాలు, రాష్ట్రాల నిర్మాణం, కేంద్ర రాష్ట్ర సంబంధాలు, కేంద్ర రాష్ట్రాల విధులు, అధికారాలు, స్థానిక సంస్థలు, ఎన్నికలు మొదలైన విషయాలను నిర్వచించింది. ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం,పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ, బలమైన కేంద్రంతో కూడిన సమాఖ్య వ్యవస్థ,

ప్రాథమిక విధులు, ప్రాథమిక హక్కులు, ఆదేశ సూత్రాలు, ద్విసభా విధానం, భాషలు, వెనుకబడిన సామాజిక వర్గాలు, అవసరమైనపుడు రాజ్యాంగాన్ని సవరించుకోడానికి వెసులుబాటు కలిగిస్తూ సవరణ విధానాన్ని కూడా నిర్దేశించింది. ఇది ప్రజలకు వారి ప్రాథమిక హక్కులను ఇస్తుంది. ప్రభుత్వం తప్పనిసరిగా అనుసరించాల్సిన నియమాలను మార్గదర్శకాలను నిర్దేశిస్తుంది. రాజ్యాంగ ముఖ్య లక్షణాలు పార్లమెంటరీ ప్రభుత్వం, అధికారాల విభజన, ప్రాథమిక హక్కులు, లౌకికవాదం, సమాఖ్యవాదం. పౌరుల ఆసక్తులు, జీవితాలను రక్షించడానికి ప్రాథమిక హక్కులను అందించింది. వీటిని రాజ్యాంగంలోని మనస్సాక్షిగా కూడా పేర్కొంటారు. పౌరులందరికీ వారి ఎంపిక ప్రకారం జీవించే స్వేచ్ఛ ఉండేలా ఈ హక్కులు అందించబడ్డాయి. మనదేశం లౌకిక దేశం. పౌరులకు వారి మతాన్ని స్వేచ్ఛగా ఆచరించే హక్కు ఉంది. ఏ మతానికి ప్రాధాన్యత ఇవ్వబడదు. కేంద్ర, రాష్ట్ర పంచాయతీ రాజ్ అనే మూడు అంచెలు ఉన్నాయి.

దేశంలో అధికారం కార్యనిర్వాహక, శాసనసభ మరియు న్యాయవ్యవస్థగా విభజించబడింది. వీటిలో ప్రతిదీ దాని స్వంత అధికారం మరియు అధికారాలు కలిగి ఉన్నాయి. అధికార విభజన అనేది నిర్దిష్ట వ్యక్తుల సమూహంలో అధికారాన్ని దుర్వినియోగం చేయకుండా లేదా కేంద్రీకృతం కాకుండా నిర్ధారిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించే శాసనాలు రాజ్యాంగానికి విరుద్ధంగా ఉంటే న్యాయ సమీక్ష చేసే అధికారం భారత న్యాయ వ్యవస్థకు ఉంది. ఇందిరా గాంధీ ప్రభుత్వం 42 వ రాజ్యాంగ సవరణ ద్వారా న్యాయ సమీక్ష అధికారాన్ని తొలగించగా, మొరార్జీ దేశాయ్ ప్రభుత్వం 44 వ రాజ్యాంగ సవరణ ద్వారా తిరిగి పునరుద్ధరించబడింది.

**నవంబర్ 26 రాజ్యాంగ దినోత్సవం**

**జనక మోహన రావు దుంగ**
**8247045230**

# ఈశ్వరానుగ్రహంతో అపమృత్యువు దూరం

భక్తి

పూర్వకాలంలో ఉజ్జయిని పట్టణంలో వేదప్రియుడు అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడికి.. దేవప్రియుడు, ప్రియమేథుడు, సుక ృతుడు, సువ్రతుడు అని నలుగురు కుమారులు. నలుగురూ సుగుణోపేతులే. తండ్రి ఎంత ధర్మానుష్ఠానపరుడో కొడుకులు కూడా అంతటి ధర్మానుష్ఠానపరులు. ఆ ఊరి పక్కనే ఉన్న పర్వత శిఖరాల్లో ఒక రాక్షసుడున్నాడు. అతడి పేరు దూషణుడు. లోకంలో అందరినీ బాధపెడుతూ ఎక్కడా ఎవ్వరూ ఈశ్వరార్చన చేయలేని స్థితిని కల్పించాడు. ఉజ్జయినిలో ఈ నలుగురూ శివార్చన చేస్తున్న విషయం తెలుసుకున్న దూషణుడు వారి వద్దకు వచ్చి.. 'మీరు పార్థివ లింగానికి అర్చన చేయడానికి వీలు లేదు. మీరు నన్ను మాత్రమే అర్చించాలి. నాకు మాత్రమే పూజలు చేయాలి. పశుపతి ఎంతటివాడు? అటువంటివాళ్లను నేను ఎందరినో గెలిచాను. మీరు శివపూజను విడిచిపెడతారా లేక లింగమును ధ్వంసం చెయ్యనా?' అని అడిగాడు. దూషణుడి మాటలకు వాళ్లు కొంచెం కూడా బెదరలేదు. 'తుచ్ఛుడు.. వీడి ప్రలాపాలు వింటూ కూర్చుంటే సమయం వ ృథా అయిపోతుంది. హాయిగా మనం శంకరుడిని నమ్ముకుని ఉందాము. శంకరుని రక్షణయందు ఉండగా మనకు భయం ఏమిటి!' అని శివపూజపై మనసు లగ్నం చేశారు. దూషణుడు ఆ నలుగురి మీదకు కత్తి ఎత్తాడు. అయినా వాళ్లు కదల్లేదు. కనీసం కత్తికి బెదిరి చెయ్యి కూడా అడ్డుపెట్టకుండా.. 'హరఓం హర హర' అంటూ అలాగే కూర్చున్నారు. ఏ రూపంలో వస్తున్న మ ృత్యువునయినా ఈశ్వరుడు తప్పించగలడు. ఈశ్వరానుగ్రహం ఉన్నవాడు తప్పనిసరిగా రక్షింపబడతాడు. ఆ నలుగురు బ్రాహ్మణకుమారులూ దీన్నే నమ్మి మట్టితో చేసిన చిన్న పార్థివ లింగానికిఆరాధన చేస్తున్నారు. దూషణుడు వారిపైకి కత్తి ఎత్తగానే.. ఆ పార్థివలింగం నుంచి పరమేశ్వరుడు మహాకాళ స్వరూపంతో బయటకు వచ్చి కోపంతో ఒక్కసారి హుంకరించాడు. ఆ హుంకారానికి దూషణుడు, అతని సైనికులు బూడిదరాశులై పడిపోయారు. కానీ.. ఆ వేడి అక్కడే కూర్చున్న నలుగురు బ్రాహ్మణ కుమారులను మాత్రం ఏమీ చేయలేదు. వేడి ధర్మం కాల్చడమే. అగ్నిహోత్రం ఒకరిని కాల్చి వేరొకరిని వదలదు. కానీ, ఆ వచ్చిన వేడి పరమాత్మ స్వరూపం. అందుకే దూషణుని, అతని సైన్యాన్ని మాత్రమే కాల్చి స్వామి భక్తులైన ఆ నలుగురిని మాత్రం కాపాడింది. అప్పుడు బ్రాహ్మణ కుమారులు ఆ స్వామిని.. చనిపోయేవారిని చంపకుండా మిగిల్చిన రూపంగా భావించి స్తోత్రం చేశారు. అంతమందిని చంపి.. అక్కడే ఉన్న తన భక్తులైన నలుగురిని వదిలిన రూపం. కాబట్టి అది మహాకాళ స్వరూపం. ఆ రూపాన్ని చూసి దేవతలు పొంగిపోయి స్వామిని స్తోత్రం చేశారు. 'ఈశ్వరా మీరు ఇక్కడ లింగరూపంలో ఉద్భవించండి. ఇటువంటి సజ్జనులు, మీమీద పూనిక ఉన్నవాళ్లు, మీరు ఉన్నారని నమ్మినవాళ్లు ఎవరు ఇక్కడికి వస్తారో వారు అకాలంగా పడిపోకుండా అనుగ్రహించడానికి స్వయంభూలింగంగా ఉండాలి' అని అడిగారు. వారి కోరిక మేరకు అక్కడ మహాకాళ లింగంగా ఆవిర్భవించాడు. మనకు భయం వేసినప్పుడు 'హరహర మహాదేవ శంభోశంకర' అని పరమేశ్వరుని ధ్యానిస్తే తక్షణం మన భయం తొలగిపోతుంది. ఈశ్వరుడు అంతటా ఎప్పుడూ మనతోనే ఉంటాడు.



## తేనీరు ఇలా కూడా!

ఒంట్లో నీరసంగా అనిపించినపుడు, ఆరోగ్యం బాగాలేనపుడు ఇంట్లో దొరికే కొన్ని దినుసులు ఉపయోగించి కొత్త రకంగా తేనీటిని తయారు చేసుకుని తాగితే క్షణాల్లో శరీరానికి శక్తి లభిస్తుంది. బడలికని పోగొట్టి మెదడుని ఉత్తేజితం చేసేందుకు తేనీటిలో కలపాల్సిన దినుసులు ఇవే....అల్లం: ఒక చిన్న అల్లం ముక్కను పొట్టు తీసి కచ్చా పచ్చాగా నూరి మరుగుతున్న తేనీటిలో వేస్తే అందులోనుంచి వచ్చే సువాసనకే అలసట మొత్తం పోతుంది. ఈ తేనీటిని తాగిన వెంటనే అల్లంలోని జింజరోల్ అనే సమ్మేళనం గొంతు గరగరను పోగొడుతుంది. రాత్రి తిన్న ఆహారపదార్థాలు పొట్టలో సమస్యలు కలిగించకుండా వాటిని క్షణాల్లో జీర్ణం చేస్తుంది. రోగనిరోధక శక్తిని కూడా పెంచుతుంది.

ఏలకులు : రెండు ఏలకులను పొట్టుతో సహా మెత్తగా నూరాలి. ఈ పొడిని కప్పు లేదా గ్లాసులో వేసుకోవాలి. అందులో ముందుగా తయారు చేసుకున్న వేడి తేనీటిని వడబోయాలి. తరవాత చెంచాతో కలిపితే తేనీటికి మంచి సువాసన పడుతుంది. ఈ తేనీటిని తాగడం వల్ల ఏలకులలో ఉండే రైబోఫ్లెవిన్, నియాసిన్ అనే విటమిన్లుబీ యాంటీ ఆక్సిడెంట్లు శరీరానికి అందుతాయి. ఇవి కడుపులో ఆమ్లతత్వాన్ని నిరోధిస్తాయి. శరీరంలో జీవక్రియలను వేగవంతం చేస్తాయి.

దాల్చినచెక్క: మరుగుతున్న తేనీటిలో అర అంగుళం పొడవున్న దాల్చిన చెక్కను వేస్తే అందులోని ఔషధగుణాలన్నీ తేనీటిలోకి చేరతాయి. ఉదయాన్నే ఈ తేనీటిని తాగితే నిద్ర మత్తు వదలిపోతుంది. దాల్చిన చెక్కలో ఉండే పాలీఫెనాల్ సమ్మేళనాలు రక్తంలో చక్కెర స్థాయిని క్రమబద్ధీకరిస్తాయి. గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి.

తులసి: వేడి తేనీటిలో నాలుగు లేదా అయిదు తులసి ఆకులు వేసుకుని తాగితే శరీరానికి రోగనిరోధక శక్తి అందుతుంది. ఒత్తిడి, మానసిక ఆందోళన, శ్వాసకోశ సమస్యలు తగ్గుతాయి. తులసిలోని యాంటీ ఆక్సిడెంట్లు, సి విటమిన్ చర్మ సౌందర్యాన్ని పెంచుతాయి.

## సిగలో ఫ్యాషన్ పువ్వు..

ముడిలో మల్లెలు ముడవడం, జడలో గులాబీలు తురమడం అందానికి పందిరేసే సంగతులే అయినా, ఈ రోజుల్లో పువ్వులు అవుటాఫ్ ఫ్యాషన్ అలమరాలో చేరిపోయాయి. అలా అని ఇంతి మనసు పూబంతుల మీద నుంచి సొంతం దూరమైపోయిందనీ చెప్పలేము. ఆ అందాన్ని ఎలాగోలా తన అలంకారంలో అమరిస్తే బాగుంటుందనే ఆలోచన సాగుతూనే ఉంటుంది. అందుకే, ఇటు ఫ్యాషన్ మెరిసేలా, అటు విరుల సొగసు విరిసేలా 'ఫ్లవర్ క్లా క్లిప్'లు మార్కెట్లోకి వస్తున్నాయి.

జుట్టు విరబోసుకోవడం ఇప్పుడు ప్యాషన్. కాలేజీకో, ఆఫీసుకో వెళ్లేప్పుడు మాత్రం గాలితో పాటు గోల చేసే జుట్టును గారాబంగా కట్టేయడానికి క్లా క్లిప్పులు లేదా క్లచ్‌లకు పనిచెబుతారు అమ్మాయిలు. దానిని దిగ్విజయంగా పూర్తి చేసి ఆడపిల్లల అభిమానాన్ని చూరగొన్నాయి కాబట్టే, వీటికి గర్ల్ సర్కిల్‌లో యమా క్రేజ్. మన్మథుడు సినిమాలో హీరోయిన్ క్లిప్పును తీసి ఫైలుకు పెట్టినట్టు, వీళ్లు కూడా వీలుని బట్టి వీటిని వాడేస్తుంటారు. అందుకే ఎన్నెన్నో వర్ణాలతో, ఇంకెన్నో అందాలతో ఇవి ముస్తాబయి వస్తున్నాయి. వీటికీ ఆడపిల్లలకూ ఉన్న అనుబంధాన్ని చూసి పువ్వుల సోకునూ రంగరించి ఆమెకు సింగారానికి సిద్ధం చేశారు డిజైనర్లు.

నచ్చిన పువ్వు..ఒకరికి గులాబీ పువ్వు ఇష్టం. మరొకరికి మల్లెలంటే ప్రాణం. ఇంకొకరు చామంతుల అందాన్ని ఆరాధిస్తారు. తులిప్, బ్లూ బెల్స్‌లాంటి ప్రత్యేకమైన పువ్వులు నచ్చేవారు కొందరుంటారు. ఇలా ఎవరి అభిరుచిని బట్టి వారు ఎంచుకునేలా అచ్చం నిజమైన పువ్వులను తలలో పెట్టుకున్నట్టు కనిపించేలా ఈ ఫ్లవర్ క్లా క్లిప్పులు రూపొందుతున్నాయి. రంగు రంగుల పూల అందాన్ని జడకు అద్దుతూనే ఫ్యాషన్ లుక్‌ని తీసుకురావడం వీటి ప్రత్యేకత. ప్లాస్టిక్‌తో చేసిన వాటితోపాటు, మెటల్ మీద ఎనామిల్ రంగులు వచ్చి, రాళ్లు, పూసలు పొదిగినవి కూడా ఈ తరహాలో తయారు అవుతున్నాయి. విరబోసిన జుట్టులో చిన్నపాయ తీసి పెట్టుకునేందుకు, బన్, హాఫ్ బన్ మోడళ్లకూ, ట్రెండీ హెయిర్ ట్కస్టెల్స్‌కు ఇవి చక్కగా నప్పుతాయి. సౌకర్యం విషయంలో ఎలాంటి రాజీ లేకుండా రోజువారీ వాడే వాటిలాగే వీటినీ పెట్టుకోవచ్చు. ఎంచక్కా పువ్వులు అలంకరించుకున్నట్టు అందంగానూ కనిపించొచ్చు. ప్రత్యేకంగా అలంకరించుకోకుండానే స్పెషల్‌గా కనిపించాలంటే పూల క్లిప్పులు మంచి ఎంపికఏమంటారు?





## వైఫల్యాన్ని గెలిచి... ప్రేరణగా నిలిచి...

పర్వతారోహకురాలు, పారాగ్లైడింగ్ పైలెట్, పర్యాటకురాలు, అన్వేషకురాలు... సురభీ ఛవ్డా గురించి ఇలాంటి విశేషాలు ఎన్నైనా చెప్పుకోవచ్చు. అనుకున్న లక్ష్యం నెరవేరకపోయినా...కొత్తదారుల్లో నడిచి విజయం సాధించారు. మోటివేషనల్ స్పీకర్‌గానూ తనదైన ముద్రవేస్తున్న సురభి తన గురించి ఏం చెబుతున్నారంటే...

"మాది గుజరాత్‌లోని జునాగఢ్. మా రాష్ట్రంలోనే అత్యంత ఎత్తైన గిర్నార్ పర్వతం ఉంది. దాన్ని చూస్తూ పెరిగిన నాకు పర్వతారోహణ మీద ఆసక్తి చిన్న వయసులోనే మొదలైంది. మా నాన్నతో అడవుల్లోకి, పర్వతాలపైకి వెళ్ళేదాన్ని. వాటి గురించి ఆయన ఎన్నో విషయాలు చెప్పేవారు. ప్రకృతి సౌందర్యంతో మమేకం ఎలా అవ్వాలో ఆయన నుంచే నేర్చుకున్నాను. మౌంట్ అబూలోని ఒక మౌంటెనీరింగ్ ఇనిస్టిట్యూట్‌లో చేరిన తరువాత... పర్వతారోహణ మీద నా ఆసక్తి మరింత పెరిగింది. బేసిక్ రాక్ క్లైంబింగ్ కోర్సు ద్వారా, పధ్నాలుగేళ్ళ వయసులో నా పర్వతారోహణ ప్రయాణం మొదలయింది. దానిలోని సాంకేతికమైన అంశాలన్నిటినీ అక్కడ తెలుసుకున్నాను. ఆ తరువాత అడ్వాన్స్ కోర్స్ చేశాను. రాక్ క్లైంబింగ్ ఇనస్ట్రక్టర్ హోదా సాధించాను.

దురదృష్టం వెంటాడింది... సాధారణ పర్వతాలకూ, మంచు పర్వతాలకూ అధిరోహణ విషయంలో చాలా వ్యత్యాసం ఉంటుంది. మంచులో మన ముందు ఏముందనేది తెలీ దు. ప్రతి అడుగు ఆచితూచి వెయ్యాలి. ఏ చిన్న పొరపాటు జరిగినా ప్రాణాపాయం తప్పదు. వాతావరణం కూడా కఠినంగా ఉంటుంది. వాటన్నిటినీ తట్టుకుంటూనే... హిమాలయాల్లోని అనేక శిఖరాగ్రాల్ని అధిరోహించాను. ఆ తరువాత నా జీవిత ధ్యేయమైన ఎవరెస్ట్ అధిరోహణకు 2014లో సిద్ధమయ్యాను. సవాలుతో కూడుకున్న ఆ ప్రయాణం కోసం ఎంతో కష్టపడ్డాను. ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నాను. కానీ దురదృష్టం నన్ను వెంటాడింది. బాల్యం నుంచి నాకు ఉన్న ఒక సమస్యే దానికి కారణం. చిన్నప్పటి నుంచీ నా కళ్ళు బలహీనంగా ఉండేవి. దానివల్ల ఎవరెస్ట్ ఎక్కుతున్నప్పుడు... స్నో బ్లయిండ్‌నెసకు గురయ్యాను. దాంతో రెండు, మూడు రోజుల పాటు క్యాంపుల్లోనే ఉండిపోవాల్సి వచ్చింది. ఇది భావోద్వేగపరంగా నామీద ప్రభావం చూపించింది. శారీరకంగానూ బలహీనమైపోయాను. 7,400 మీటర్ల ఎత్తువరకూ చేరుకున్నాక... వెనక్కి తిరిగి పోవాలనే క్లిష్టమైన నిర్ణయాన్ని తీసుకోవాల్సి వచ్చింది. అది నన్ను ఎంతో నిరాశకు గురిచేసింది. నా కలలన్నీ కుప్పకూలిపోయినట్టనిపించింది. దేనికోసమైతే అన్ని ప్రయత్నాలు చేశానో... అది నెరవేరలేదనే ఆవేదన వెంటాడింది. ఆ బాధ నుంచి బయటపడడానికి పారాగ్లైడింగ్ వైపు దృష్టి మళ్ళించాను. హిమాచల్‌ప్రదేశ్‌లోని బిర్‌కు వెళ్ళి శిక్షణ తీసుకున్నాను. 2017 నుంచి 'భారత పారాగ్లైడింగ్ సంఘం'లో సభ్యురాలుగా ఉన్నాను. దేశంలోని అనేక ప్రాంతాల్లో పారాగ్లైడింగ్ చెయ్యడమే కాదు... చాలామందికి శిక్షణ ఇస్తున్నాను. అగ్రశ్రేణి పారాగ్లైడర్స్‌లో ఒకరుగా గుర్తింపు పొందాను.

వివిధ ప్రదేశాల్లో పర్యటించడం అంటే నాకెంతో ఇష్టం. అలాగే ట్రెక్కింగ్ కోసం కొత్త కొత్త ప్రదేశాలను అన్వేషిస్తూ ఉంటాను. ఔత్సాహిక పర్వతారోహకుల కోసం టూర్స్ కూడా నిర్వహిస్తున్నాను. అయితే ఇంకా నాలో ఏదో వెలితి మాత్రం కొనసాగుతూ వచ్చింది. మనం జీవితంలో ఎన్నో లక్ష్యాలను నిర్దేశించుకుంటాం. వాటిని సాధించడానికి ఎంతో కష్టపడతాం. కానీ ప్రతిసారీ అనుకున్నది నెరవేరకపోవచ్చు. దానివల్ల తీవ్రమైన నైరాశ్యం కలుగుతుంది. ఈ సమస్యను నేనూ ఎదుర్కొన్నాను. వేరే యాక్టివిటీసలో నిమగ్నం కావడం ద్వారా దాని నుంచి బయటపడ్డాను. ఇలాంటి పరిస్థితులు ఎందరికో ఎదురవుతూ ఉంటాయి. వారికి ధైర్యం చెప్పి, జీవితాన్ని కొత్తగా ప్రారంభించేందుకు ప్రేరణ కలిగిస్తే బాగుంటుందని పించింది. అందుకే 'మోటివేషనల్ స్పీకర్'గా మారాను. ఇది నాకు ఎంతో సంతృప్తినిస్తోంది. వివిధ సంస్థలు, పాఠశాలలు, స్పోర్ట్స్ ఇనిస్టిట్యూట్స్ నన్ను ఆహ్వానిస్తున్నాయి. పారాగ్లైడింగ్‌లో, మౌంటెనీరింగ్‌లో శిక్షణ, టూర్స్ నిర్వహణతో బిజీగా ఉన్నా... జీవితం పట్ల అస్పష్టత, ఆందోళన ఉన్నవారిలో స్ఫూర్తి నింపాలనే ఉత్సాహం ఎప్పుడూ ఉంటుంది.

## ఊహలకు అందని రూపాలు

టీ కప్పులు, మగ్‌లను అందమైన కళారూపాలుగా మార్చుతూ, ఫంక్షనల్ ఆర్టిస్ట్‌గా రాణిస్తూ, మార్కెటింగ్ చేస్తూ, ఆర్ట్‌ప్రెన్యూర్‌గా మారింది శ్రీనియా చౌదరి. ఈ కళారూపం అంతగా సక్సెస్ కాదన్న వారి నోళ్లను మూయిస్తూ, ఛాలెంజ్‌గా తీసుకొని మరీ ఈ కళలో రాణిస్తోంది. ఢిల్లీలో సొంతంగా స్టూడియో ఏర్పాటు చేసుకోవడంతో పాటు తన కళారూపాలను వివిధ దేశాలకు ఎక్స్‌పోర్ట్ చేస్తోంది. ఎవరి ఊహకూ అందని కళారూపాలు శ్రీనియా చేతుల్లో రూపుదిద్దుకుంటాయి. పదేళ్లుగా సిరామిక్ మెటీరియల్‌తో మగ్‌లను తయారుచేస్తూ, వాటినే అందమైన కళాఖండాలుగా తీర్చిదిద్దుతోంది. యూరప్‌లోని లాట్వియాలో సిరామిక్స్ బియన్నాలే, మార్క్ రోత్కో మ్యూజియంలలోనూ తన కళారూపాలు స్థానాన్ని పొందాయంటే శ్రీనియా కృషి, పట్టుదల ఎంత బలమైనవో ఇట్టే తెలిసిపోతాయి.

**సాధనమున సమకూరిన కళ**

స్వతహాగా చిత్రకారిణి అయిన శ్రీనియా ఈ కళలో రాణించడానికి మట్టిపైనే చిత్రాలు వేసేది. ఆ తర్వాత మట్టితో కళారూపాలు తయారుచేసి వాటిపైనే చిత్రీకరించేది. తన ప్రతి చిత్రంలోనూ సమాజం గురించిన ఆలోచనలు ప్రతిబింబిస్తాయి. 'సెరామిక్స్‌తో రకరకాల కళాత్మక రూపాలను తయారుచేయడం అనేది శతాబ్దాలుగా ఉంది. కానీ, నేను ప్రత్యేకంగా ఎంచుకున్న మగ్గులతో డిజైన్లు, మగ్గులపై పెయింటింగ్.. ప్రజల్లో మంచి డిమాండ్ ఉంది. దీనిని అనుసరించే నేను నా దైన సృజనను జోడించాను. అభ్యాసనకు మట్టితోనే కళారూపాలను తీర్చడంలో కొన్నాళ్లు నిమగ్నమయ్యాను. ఎంతోమందిని అవి ఆకట్టుకున్నాయి. వీటికున్న డిమాండ్‌ను బట్టి ఆర్ట్‌ప్రెన్యూర్‌గా మారాలనుకున్నాను.

**నెలల సమయం..** కోవిడ్ టైమ్‌లోనూ నా ఆలోచనా విధానాన్ని నలుగురితో పంచుకోవడానికి, శిక్షణ ఇవ్వడానికి వెబ్‌షాప్‌ను ప్రారంభించాను. కొన్ని వారాల పాటు వెబ్‌షాప్‌ను నిర్వహించాను. వ్యూవర్స్‌లో మంచి ఆసక్తి కనపడింది. కానీ, నిత్యసాధనతోనే ఈ కళలో రాణించగలరు. ఏ కాలమైనా సరే యంత్రంతో తయారుచేసిన వస్తువుకన్నా, పూర్తిగా చేతితో తయారుచేసిన వస్తువు ఖరీదు ఎక్కువ. అందుకే, సిరామిక్‌తో మగ్ తయారీ నుంచి వాటి రూపాల్లో మార్పులతో పాటు.. ఒక కళాఖండంగా తయారుచేయడా నికి చాలా సమయం పడుతుంది. ముందుగా నేను అనుకున్న కళారూపం స్కెచ్ వేసుకుంటాను. అది సంతృప్తిగా అనిపించాక దానిని వాస్తవ రూపానికి తీసుకు రావడానికి నెలల సమయం పడుతుంది. ఒక్కో సమయంలో అయితే ఒక చిన్న పీస్‌ను మాత్రమే తయారు చేస్తుంటాను. ఒకదానితో మరోటి అస్సలు పోలికే ఉండదు. దేనికదె ప్రత్యేకం. కానీ, అన్ని కళారూపాలకు మంచి డిమాండ్ ఉంది. ఆన్‌లైన్ వేదిక ద్వారా నా కళారూపాలను నేనే మార్కెటింగ్ చేస్తుంటాను. విదేశీయులు కూడా ఈ ఫంక్షనల్ ఆర్ట్‌ను బాగా ఇష్టపడుతున్నారు. వ్యాపారిగా మారినప్పటికీ ప్రతీ కళారూపాన్ని నేనే స్వయంగా సృష్టిస్తాను. ఎవరి సాయమూ తీసుకోను. అచ్చులు పోయడం అనేది నా ఆలోచనకు పూర్తి విరుద్ధం. అందుకే ప్రతీ కళాఖండం విభిన్నంగా ఉంటుంది' అని వివరిస్తారు శ్రీనియా.






## హ్యాపీ.. మానిక్యూర్!

క్రిస్మస్ సంబురాల్లో అలంకరణదే అగ్రస్థానం. తగ్గేదేలే అన్నట్టు ఉంటుంది అమ్మాయిల ముస్తాబు. అందులోనూ చేతిగోళ్ల సింగారింపులో రకరకాల థీమ్స్ వస్తున్నాయి. స్టార్స్, కేక్స్, క్యాండిల్స్, బెల్స్, క్రిస్మస్ తాత.. ఇలా అనేక బొమ్మలు గోటి మీదికి ఎక్కుతున్నాయి. వీటికి త్రీడీ ఎఫెక్ట్ కూడా ఇస్తున్నారు.



## కిడ్నీలో రాళ్లకు హోమియో చికిత్స



మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడటం ఈ మధ్య కాలంలో చాలా మందిలో కనిపిస్తున్న సమస్య. ఒక సర్వే ప్రకారం భారత్‌లోని పురుషుల్లో 10.6 శాతం, స్త్రీలలో 7.1 శాతం ఈ సమస్యతో బాధపడుతున్నారని తేలింది. మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, స్థూలకాయం వంటివి దీనికి ప్రధాన కారణాలు. మన శరీరం ఒక భారీ కర్మాగారం లాంటివి. ఇందులో నిరంతరం రకరకాల జీవక్రియలు జరుగుతుంటాయి. వీటిలో మూడు విసర్జక అవయవాలు కీలక పాత్ర పోషిస్తాయి. అవి మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, చర్మం. వీటిల్లో 90 శాతం మలినాలను విసర్జించేది మూత్రపిండాలే. కిడ్నీలు రక్తంలోని విష పదార్థాలను, అదనపు నీటిని క్రమంగా తొలగిస్తుంటాయి. మన మూత్రపిండాలు రోజుకు 200 లీటర్ల రక్తాన్ని వడపోస్తాయి. నేటి ఆధునిక జీవన శైలిలో చాలామంది సరిపడా నీళ్లు కూడా తాగలేకపోతున్నారు. ఫలితంగా మూత్రపిండాల్లో రాళ్ల సమస్య పెరుగుతోంది. చాలా సందర్భాల్లో ఈ రాళ్లు చిన్నవిగా ఉండి, మూత్రంతో విసర్జింపబడతాయి. కొన్నిసార్లు రాళ్ల పరిమాణం పెద్దవిగా ఉండి, మూత్ర నాళాల్లో చిక్కుకుని తీవ్రమైన నొప్పి కలిగిస్తాయి.

కారణాలుజి

అధిక బరువు, ద్రవపదార్థాలు సరిపడా తీసుకోకపోవడం

మూత్రావయవాల్లో వచ్చే ఇన్‌ఫెక్షన్

జన్యుపరమైన ఇన్‌ఫెకనుఢ్ల

ఎక్కువగా వేడి వాతావరణంలో ఉండటం

వంశపారంపర్యం

కొన్ని రకాల మందుల వాడకం

లక్షణాలుజి

పొత్తి కడుపులో తీవ్రమైన నొప్పి

నీరసం, వికారం, తీవ్రమైన జ్వరం

మూత్రంలో రక్తం పడటం (దీన్ని హిమచ్యూరియా అంటారు)

మూత్రంలో మంట, చీము రావడం

**జాగ్రత్తలు**

నీటిని ఎక్కువగా తాగాలి. కనీసం రోజుకు 4 లీటర్ల ద్రవ పదార్థాలు తీసుకోవాలి.

కిడ్నీలో ఆక్సలేట్ రాళ్లు ఉంటే, ఆక్సలేట్ ఉండే పదార్థం, అంటే చాక్‌లెట్, పాలకూర, సోయా, ఎండు చిక్కుడు వంటివి తీసుకోకూడదు.

కాల్షియం సిట్రేట్‌కు కిడ్నీలో రాళ్లు ఏర్పడకుండా నివారించే లక్షణం ఉంది. కాబట్టి అవి శరీరానికి అందేలా ఆహార నియమాలు పాటించాలి.

కూల్‌డ్రింక్‌లను అసలు ముట్టుకోకూడదు

**నిర్ధారణ పరీక్షలు**

కిడ్నీ ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కాన్, కిడ్నీ పరీక్ష రక్త పరీక్ష, మూత్ర పరీక్ష

**హోమియో చికిత్స**

హోమియోపతిలో శారీరక, మానసిక లక్షణాలను పరిగణనలోకి తీసుకుని ఎలాంటి సర్జరీ అవసరం లేకుండానే కిడ్నీలో రాళ్లు తొలగించవచ్చు. రాళ్ల పరిమాణం, అవి ఏ వైపు ఏర్పడ్డాయో వంటి వివరాల ఆధారంగా మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. మ్యుయంగగాఆ బెరిబెరి వల్గరీస్, సరసపరిల్ల, కలెబారియకార్బ్, పెరిర బ్రావ, కొలొసింత్ మందులను డాక్టర్ పర్యవేక్షణలో వాడాలి.

## హస్తకళాభరణం!

బంగారపు హంగులు లేవు. వెండికే సొంతమైన ధగధగల్లేవు. ముత్యాల మెరుపుల్లేవు. రత్నాల రాచ మర్యాదలూ లేవు. అయితేనేం, ఆ నగల వగలు చూడాల్సిందే. ధర తక్కువ. వైవిధ్యం ఎక్కువ. కళాత్మకతా అధికమే. ఏ చీర కట్టుకుంటే ఆ వన్నె హారం ధరించవచ్చు. అదే రంగు



ఇయర్ రింగ్స్ సింగారించుకోవచ్చు. అంతేనా, ఎకోఫ్రెండ్లీ కూడా. బంకమన్ను, గుడ్డ పేలికలు, పూసలు, దారాలు, సహజమైన రంగులు.. ఇవే ముడి సరుకు. హ్యాండ్ మేడ్ హారాలే కాదు.. జుంకాలు, ముక్కుపుడకలు, గాజులు కూడా లభిస్తాయి.




## శ్రీరామ్ మల్టీ సెక్టార్ రొటేషన్ ఫండ్

SHRIRAM Mutual Fund
NURTURING TRUST. SHAPING DREAMS

**ముంబై - నవభూమి:**శ్రీరామ్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్.. శ్రీరామ్ మల్టీ సెక్టార్ రొటేషన్ ఫండ్ పేరుతో కొత్త ఫండ్‌ను తీసుకువచ్చింది. దేశంలో ఈ తరహా ఫండ్‌ను తీసుకురావటం ఇదే మొదటిసారి. మంచి లాభాల్లో సాగుతున్న రంగాలను గుర్తించి ఎప్పటికప్పుడు పెట్టుబడుల పోర్టుఫోలియోలను మార్చుకుంటూ మధ్య, దీర్ఘకాలంలో మెరుగైన రిటర్నులు అందించే విధంగా ఈ ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ ఫండ్‌ను రూపొందించినట్లు శ్రీరామ్ ఏఎంసీ వెల్లడించింది. వివిధ రంగాల మూమెంటమ్ ఆధారంగా ట్రెండింగ్‌లో ఉన్న మూడు నుంచి ఆరు రంగాల్లో ఈ ఫండ్ ప్రధానంగా పెట్టుబడులు పెడుతుంది. పెట్టుబడులు పెట్టే రంగాలను శ్రీరామ్ ఏఎంసీకి చెందిన ఎన్‌హాన్స్‌డ్ క్వాంటమెంటల్ ఇన్వెస్టమెంట్ (ఈక్యూఐ) ఫ్రేమ్‌వర్క్ ఎంపిక చేస్తుంది. ఈ ఫండ్‌కు నిఫ్టీ 500 ఇండెక్స్ బెంచ్‌మార్క్‌గా ఉంటుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.500. క్రమానుగత పెట్టుబడి (సిప్) రూపంలో కూడా ఇంతే మొత్తం పెట్టుబడిగా పెట్టవచ్చు. ఈ ఫండ్ ముగింపు తేదీ డిసెంబరు 2.

## ఎలక్ట్రిక్ వాహనాలకు పెద్దపీట: ఉత్తమ్




**హైదరాబాద్- నవభూమి:**రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఎలక్ట్రిక్ త్రిచక్ర వాహనాల సంస్థ ఆర్‌ఏపీ ఎకో మోటర్స్..తాజాగా 'ఈ-రాజా' ఆటోను మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ ఆటోను రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ఎలక్ట్రిక్ వాహనాలకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని, ఇలాంటి వాహనాల వల్లనే వాతావరణ కాలుష్యం తగ్గనున్నదన్నారు. ఈవీలను తయారు చేసే సంస్థలకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించనున్నట్లు ప్రకటించారు. ఆర్‌ఏపీ ఎకో మోటర్స్ సీఈవో బాలకృష్ణన్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఉన్న ఆర్‌అండ్‌డీ సెంటర్‌లో తయారైన ఈ-రాజా ఆటో సింగిల్ చార్జింగ్‌తో 120 కిలోమీటర్ల నుంచి 140 కిలోమీటర్లు ప్రయాణించనున్నదన్నారు. నలుగురు కూర్చోవడానికి వీలుండే విధంగా డిజైన్ చేసిన ఈ ఆటో గంటకు 50 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. 3 గంటల్లో ఈ ఆటో పూర్తిగా చార్జింగ్ అవుతుంది.

## విద్యార్థులకు ఇండిగో ఆఫర్




**న్యూఢిల్లీ-నవభూమి:** ఇండిగో.. విద్యార్థులకు ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. విమాన టికెట్‌పై 6 శాతం రాయితీతోపాటు 10 కిలోల అదనపు లగేజీకి అవకాశం ఇచ్చింది. కంపెనీ వెబ్‌సైట్, యాప్ ద్వారా బుకింగ్ చేసుకున్నవారికే ఆఫర్. విద్యార్థుల అకాడమి ఏడాదికి సంబంధించిన బుక్స్ అధికంగా ఉంటాయని, ఈ నేపథ్యంలో 10 కిలోల లగేజీ తీసుకుపోవడానికి అనుమతినిచ్చినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రత్యేక ఆఫర్ హైదరాబాద్‌తోపాటు గోవా, ముంబై, ఢిల్లీ, బెంగళూరుతోపాటు 80 రూట్లలో నుంచి నడిచే విమాన సర్వీసుల్లో అందుబాటులో ఉంటాయి. 12 ఏండ్లకు పైబడి స్కూల్/యూనివర్సిటీకి సంబంధించిన ఐడీ కార్డు ఉన్నవారికే ఈ ఆఫర్.

## మస్క్ సంపదకు ట్రంప్ కిక్కు



**న్యూయార్క్-నవభూమి:**ప్రపంచ కుబేరుడిగా వెలుగొందుతున్న టెస్లా అధినేత ఎలాన్ మస్క్ సంపదకు అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం బాగా కలిసొచ్చింది. ట్రంప్ గెలిచిన దగ్గర్నుంచి మస్క్ ఆస్తుల విలువ ఏకంగా 70 బిలియన్ డాలర్లు (రూ.5.89 లక్షల కోట్లు) ఎగబాకింది మరి. దీంతో ఇప్పుడాయన సంపద బ్లూంబర్గ్ బిలియనీర్ ఇండెక్స్ ప్రకారం తొలిసారి 347.8 బిలియన్ డాలర్ల (రూ.29.25 లక్షల కోట్లు)ను చేరింది. 2021 నవంబర్‌లో గరిష్ఠంగా 321.7 బిలియన్ డాలర్లుగా నమోదై రికార్డు సృష్టించగా, ఆ రికార్డు ఇప్పుడు చెరిగిపోయినైట్టెంది. ట్రంప్, మస్క్ మధ్యనున్న సంబంధాలు.. స్టాక్ మార్కెట్లలో టెస్లా షేర్ విలువను పరుగులు పెట్టిస్తున్నాయి.

## బీఎండబ్ల్యూ ఎం5



**న్యూఢిల్లీ-నవభూమి:** బీఎండబ్ల్యూ..దేశీయ మార్కెట్లోకి మరో మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. అత్యంత శక్తివంతమైన వీ8 ఇంజిన్‌తో తయారైన ఎం5 మాడల్ ధర రూ.1.99 కోట్లుగా నిర్ణయించింది. లగ్జరీ కార్లకు భారత్‌లో డిమాండ్ అధికంగా ఉండటంతో సరికొత్త మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

## టాప్-8 సంస్థల ఎం-క్యాప్ రూ.1.55 లక్షల కోట్లు వృద్ధి.. హెచ్డీఎఫ్సీ బ్యాంక్.. టీసీఎస్‌లకు భారీగా లబ్ధి..!





**న్యూఢిల్లీ-నవభూమి:** గతవారం దేశీయ స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్ ముగిసిన తర్వాత బీఎస్ఈలో టాప్-10 కంపెనీలలో ఎనిమిది కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1,55,603.45 కోట్లు వృద్ధి చెందింది. హెచ్డీఎఫ్సీ బ్యాంక్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) భారీగా లబ్ధి పొందాయి. మరోవైపు రిలయన్స్ ఇండస్ట్రీస్, భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) నష్టపోయాయి. గతవారం బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 1,536.8 పాయింట్లు (1.98 శాతం), ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 374.55 (1.59 శాతం) పాయింట్లు పెరిగాయి. బీఎస్ఈ సెన్సెక్స్ శుక్రవారం 1961.32 పాయింట్లు (2.52 శాతం) వృద్ధి చెంది 79,117.11 పాయింట్లు పెరిగితే, ఎన్ఎస్ఈ నిఫ్టీ 557.35 (2.39 శాతం) పుంజుకుని 23,907.25 పాయింట్ల వద్ద స్థిర పడ్డాయి.

హెచ్డీఎఫ్సీ బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.40,392.91 కోట్లు వృద్ధి చెంది రూ.13,34,418.14 కోట్ల వద్ద స్థిర పడింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఎం-క్యాప్ రూ.36,036.15 కోట్లు పెరిగి, రూ.15,36,149.51 కోట్లకు చేరుకున్నది. ఐసీఐసీఐ బ్యాంక్ ఎం-క్యాప్ రూ.16,266.54 కోట్లు పుంజుకుని రూ.9,01,866.22 కోట్ల వద్ద నిలిచింది. ఇన్ఫోసిస్ ఎం-క్యాప్ రూ.16,189.33 కోట్ల లబ్ధితో రూ.7,90,151.83 కోట్ల వద్ద ముగిసింది.

హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్‌యూఎల్) మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.13,239.95 కోట్లు పెరిగి రూ.5,74,569.05 కోట్లకు చేరుకున్నది. ఐటీసీ ఎం-క్యాప్ రూ.11,508.91 కోట్లు పుంజుకుని రూ.5,94,272.93 కోట్ల వద్ద నిలిచింది. భారతీ ఎయిర్ టెల్ ఎం-క్యాప్ రూ.11,260.11 కోట్లు వృద్ధి చెంది రూ.8,94,068.84 కోట్ల వద్ద స్థిర పడింది. భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) ఎం-క్యాప్ రూ.10,709.55 కోట్లు పెరిగి రూ.7,28,293.62 కోట్ల వద్ద ముగిసింది.

మరోవైపు భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.11,954.24 కోట్లు నష్టపోయి రూ.5,62,545.30 కోట్ల వద్ద స్థిర పడింది. రిలయన్స్ ఎం-క్యాప్ రూ.2,368.16 కోట్లు పతనమై రూ.17,13,130.75 కోట్లకు చేరుకుంది. గతవారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత టాప్-10 సంస్థల్లో రిలయన్స్ మొదటి స్థానంలో కొనసాగుతున్నది. తర్వాతి స్థానాల్లో టీసీఎస్, హెచ్డీఎఫ్సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్ టెల్, ఇన్ఫోసిస్, భారతీయ స్టేట్ బ్యాంక్, ఐటీసీ, హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్‌యూఎల్), ఐటీసీ నిలిచాయి.

## అదానీల చుట్టూ బిగుస్తున్న ఉచ్చు




**న్యూయార్క్-నవభూమి:** లంచం, నేరారోపణల కేసులో అమెరికా దూకుడును ప్రదర్శిస్తున్నది. అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీతోపాటు ఆయన మేనల్లుడు సాగర్ అదానీకి అమెరికా స్టాక్ మార్కెట్ రెగ్యులేటర్.. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) సమన్లు పంపింది. అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్‌కు సాగర్ అదానీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్న విషయం తెలిసిందే. కాగా, దేశంలో సోలార్ పవర్ కాంట్రాక్టులను పొందడానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు, ఉన్నతాధికార వర్గాలకు రూ.2,200 కోట్లకు పైగా లంచాలు ఇచ్చారని ఎస్ఈసీ ఆరోపిస్తున్న సంగతి విదితమే. ఈ వ్యవహా రంలో అమెరికా న్యాయ శాఖ, ఎఫ్‌బీఐ దర్యాప్తులూ జరుగుతుండగా.. అదానీసహా మొత్తం 8 మందిపై అభియోగాలు నమోదయ్యాయి. ఇప్పటికే గౌతమ్ అదానీ, సాగర్ అదానీలపై అమెరికాలో అరెస్ట్ వారెంట్లు కూడా జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆరోపణలపై వివరణ కోరుతూ ఎస్ఈసీ ఈ సమన్లు జారీ చేసింది. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లోగల అదానీల నివాసాలకు వీటిని పంపింది. ఈ సమన్లు అందుకున్న 21 రోజుల్లోగా సమాధానం చెప్పాలంటూ గురువారం న్యూయార్క్ ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ కోర్టు ద్వారా జారీ అయిన నోటీసుల్లో పేర్కొన్నది. స్పందించకపోతే కోర్టు ధిక్కారంగా పరిగణించాల్సి ఉంటుందని, తదుపరి చర్యలకు బాధ్యులు అవుతారని కూడా ఎస్ఈసీ హెచ్చరించింది.

**ఇదీ సంగతి..**

ఇన్వెస్టర్లను మోసం చేసి నిధుల సమీకరణకు అదానీ పాల్పడ్డారని ఎఫ్‌బీఐతోపాటు అమెరికా ప్రాసిక్యూటర్లు, రెగ్యులేటర్లు చెప్తున్నారు. ఈ కేసులో ప్రధానంగా రెండు ఆరోపణలున్నాయి. అందులో మొదటిది తప్పుడు ప్రకటనలతో భారత్‌లో సోలార్ పవర్ కాంట్రాక్టులను అడ్డుపెట్టుకొని అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు, అమెరికా మదుపరుల నుంచి 2 బిలియన్ డాలర్లకుపైగా రుణాల సమీకరణకు దిగారు. ఇక రెండోది అంతర్జాతీయ ఆర్థిక సంస్థలను భాగస్వామ్యం చేస్తూ 1 బిలియన్ డాలర్లకుపైగా విలువైన బాండ్లను జారీ చేశారు. వీటిని అమెరికా తదితర మార్కెట్లలో ప్రవేశపెట్టి, అక్కడి మదుపరులకు అమ్మారు. అందుకే అమెరికా ఈ కేసును తీవ్రంగా పరిగణిస్తున్నది. కాగా, 2022లోనే ఈ కేసులో దర్యాప్తు మొదలైందని, అయితే అడ్డంకులు సృష్టించారని అక్కడి ప్రాసిక్యూటర్లు వెల్లడించారు. అయితే ఈ కేసును అదానీ గ్రూప్ ఖండిస్తున్నది. తాము ఏ తప్పూ చేయలేదని, అధికార ప్రతినిధులు ప్రకటిస్తున్నారు.

**మా కంపెనీలు భద్రమే: గ్రూప్ సీఎఫ్‌వో**

అదానీ గ్రూప్ అధిపతి గౌతమ్ అదానీపై లంచం కేసు నేపథ్యంలో గ్రూప్‌నకు చెందిన 11 సంస్థలపై ఎలాంటి అభియోగాలు నమోదు కాలేదని, కాబట్టి సంస్థలకు ఏ రకమైన న్యాయపరమైన చిక్కులు లేవని అదానీ గ్రూప్ సీఎఫ్‌వో జుగేషిందర్ రోబీ సింగ్ అన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో స్పందించారు. కాగా, ఈ కేసు గురించి మీడియాలో రకరకాల వార్తలు వస్తున్నాయని, మేము ఈ అంశంలో పూర్తి వివరణ ఇచ్చేదాకా ఎలాంటి ఊహాగానాలను ప్రచారం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. గౌతమ్ అదానీ, సాగర్ అదానీలతోపాటు అదానీ గ్రీన్ ఎనర్జీ ఎండీ వినీత్ జైన్, అజుర్ పవర్ గ్లోబల్ మాజీ సీఈవో రంజిత్ గుప్తా, దాని మాజీ ఉద్యోగి రూపేశ్ అగర్వాల్, సీడీపీక్యూ మాజీ ఉద్యోగులు సిరిల్ క్యాబెన్స్, సౌరభ్ అగర్వాల్, దీపక్ మల్హోత్రాలు ఈ కేసులో నిందితులుగా ఉన్నారు.

## 80 వేలకు చేరువలో 10 గ్రాముల బంగారం.. బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..



**న్యూఢిల్లీ-నవభూమి:** బంగారం, వెండి కొనుగోలు చేయాలనుకుంటున్నారా? ఇటీవల వరుసగా తగ్గుతూ వస్తున్న బంగారం ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. దీపావళికి ముందు రూ.80 వేల పైకి చేరిన బంగారం ఆ తర్వాత క్రమంగా తగ్గింది. గత వారం రూ.76 వేల స్థాయికి పడిపోయింది. అయితే ఈ వారంలో మళ్లీ బంగారం ధరలు పైకి ఎగబాకాయి. మళ్లీ రూ.80 వేల స్థాయికి చేరుకున్నాయి. దేశంలో పెళ్లిళ్ల సీజన్ కావడంతో చాలా మంది బంగారం కొనుగోళ్లు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో నేడు (నవంబర్ 24న) ఉదయం 7.00 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. రూ. 79, 640కి చేరింది.

ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 79, 790కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 73,150కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 79, 640కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 73, 000కి చేరింది. వెండి ధరలు కూడా భారీగా తగ్గి మళ్లీ పెరుగుతున్నాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.

దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం రేట్లు (10 గ్రాములకు) (24 క్యారెట్, 22 క్యారెట్)

హైదరాబాద్‌లో రూ. 79, 640, రూ. 73, 000
విజయవాడలో రూ. 79, 640, రూ. 73, 000
ఢిల్లీలో రూ. 79, 790, రూ. 73, 150
ముంబైలో రూ. 79, 640, రూ. 73, 000
వడోదరలో రూ. 79, 690, రూ. 73, 050
కోల్‌కతాలో రూ. 79, 640, రూ. 73, 000
చెన్నైలో రూ. 79, 640, రూ. 73, 000
బెంగళూరులో రూ. 79, 640, రూ. 73, 000
కేరళలో రూ. 79, 640, రూ. 73, 000
పుణెలో రూ. 79, 640, రూ. 73, 000

ప్రధాన నగరాల్లో వెండి ధరలు (కేజీకి)

హైదరాబాద్‌లో రూ. 1, 01, 000
విజయవాడలో రూ. 1, 01, 000
ఢిల్లీలో రూ. 92, 000
చెన్నైలో రూ. 1, 01, 000
కోల్‌కతాలో రూ. 92, 000
కేరళలో రూ. 1, 01, 000
ముంబైలో రూ. 92, 000
బెంగళూరులో రూ. 92, 000
భువనేశ్వర్‌లో రూ. 1, 01, 000

## 11న దేశీయ మార్కెట్లోకి టయోటా కమ్రీ.. ధరెంతంటే..?!



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రముఖ కార్ల తయారీ సంస్థ టయోటా కిర్లోస్కర్.. తన మిడ్ సైజ్ సెడాన్ 2025 టయోటా కమ్రీ కారును డిసెంబర్ 11న భారత్ మార్కెట్లో ఆవిష్కరించనున్నది. దేశీయ మార్కెట్లో తొలిసారి 2013లో ఆవిష్కరించింది. ప్రస్తుతం వస్తున్న నైన్త్ జనరేషన్ టయోటా కమ్రీ కారు పలు అప్ డేట్స్‌తో అందుబాటులోకి వస్తున్నది. ఆల్ వీల్ డ్రైవ్ హైబ్రీడ్ పవర్ ట్రైన్ తో వస్తున్న టయోటా కమ్రీ గ్లోబల్ మార్కెట్లలో సుమారు రూ.23.7 లక్షలు (28,400 యూఎస్ డాలర్లు %-% ఎక్స్ షోరూమ్), టాప్ వేరియంట్ దాదాపు రూ.30.1 లక్షలు (36,125 యూఎస్ డాలర్లు %-% ఎక్స్ షోరూమ్) పలుకుతుంది. న్యూ కమ్రీ కారు నాలుగు వేర్వేరు ట్రిమ్స్ %-% ఎల్ఈ, ఎస్ఈ, ఎక్స్ఎల్ఈ, ఎక్స్ఎస్ఈ వేరియంట్లలో వస్తుంది. వీటిల్లో ఎస్ఈ, ఎక్స్ఎస్ఈ వేరియంట్లు స్పోర్ట్ ట్యూన్డ్ సస్పెన్షన్‌తో అందుబాటులోకి వస్తున్నాయి. గ్లోబల్ మార్కెట్లలో కమ్రీ ఫ్రంట్ వీల్ డ్రైవ్ లేదా ఆల్ వీల్ డ్రైవ్ కాన్ఫిగరేషన్ తో వస్తున్నాయి.

2025 టయోటా కమ్రీ పూర్తిగా ఫ్రంట్ ఎండ్ డిజైన్ రీవర్క్ చేశారు. ప్రస్తుత జనరేషన్ లెక్సస్ సెడాన్ కార్లలో మాదరిగా వైడర్ ఫ్రంట్ గ్రిల్లె, షార్పర్ హెడ్ ల్యాంప్స్ ఉంటాయి. ఇంటిగ్రేటెడ్ ఎల్ఈడీ డీఆర్ఎల్స్ తోపాటు స్లీక్ హెడ్ ల్యాంప్స్, సెడాన్ కారుకు బోల్డ్ లుక్ వచ్చేలా లార్జ్ రేడియేటర్ గ్రిల్లె ఉంటుంది. స్పోర్ట్ మెష్ ఫ్రంట్ గ్రిల్లెస్, సైడ్ రాకర్స్, డ్యుయల్ టిప్ ఎగ్జాస్ట్స్, బ్లాక్డ్ ఔట్ వెర్టికల్ ఎయిర్ వెంట్స్ వంటి ఫీచర్లతో ఎస్ఈ, ఎక్స్ఎస్ఈ మోడల్ కార్లు స్పోర్టీ లుక్ కలిగి ఉంటాయి. ఇంక ఇంటీరియర్‌గా, ఇన్ఫోటైన్ మెంట్ సిస్టమ్‌లోనూ టయోటా కమ్రీ కారు పలు అప్ గ్రేడ్స్ పొందింది. స్టాండర్డ్‌గా క్లాత్ అండ్ సింథటిక్ అప్‌హోల్‌స్టరీ, ఎస్ఈ అండ్ ఎక్స్ఎస్ఈ వేరియంట్లలో హీటెడ్ సీట్స్, హీటెడ్ స్టీరింగ్ వీల్ తోపాటు లెదర్ అప్‌హోల్‌స్టరీ ఉంటాయి. రేర్ ప్యాసింజర్లు వ్యక్తిగత క్లైమేట్ జోన్స్ పొందుతారు. కమ్రీ ఎల్ఈ వేరియంట్ 8- అంగుళాల ఇన్‌ఫోటైన్ మెంట్ స్క్రీన్ తో వస్తుంది. ఇతర రెండు మోడళ్లలో ప్రామాణికంగా ఉండే 12.3 అంగుళాల పొడవైన స్క్రీన్ ఎస్ఈ వేరియంట్ కారులో ఉంటుంది. డిజిటల్ గాజ్ క్లస్టర్, ఎమర్జెన్సీ బ్రేకింగ్ విత్ పెడిస్ట్రైన్ డిటెక్షన్, అడాప్టివ్ క్రూయిజ్ కంట్రోల్, లేన్ అసిస్ట్ తదితర ఫీచర్లు ఉంటాయి. 2025 టయోటా కమ్రీ మోడల్ కారులో 3.5 లీటర్ల వీ6 ఇంజిన్ తప్పించేసి వేర్వేరు డ్రైవ్ ట్రైన్స్‌లో రెండు హైబ్రీడ్ ఇంజిన్లను అందిస్తున్నది. రెండింటిలోనూ స్టాండర్డ్‌గా 2.5 లీటర్ల ఫోర్ సిలిండర్ ఇంజిన్ ఉంటుంది. ఎఫ్ డబ్ల్యూడీ వేరియంట్ విత్ టూ ఎలక్ట్రిక్ మోటార్స్, ఏడబ్ల్యూడీ వేరియంట్ విత్ థర్డ్ మోటార్ డ్రైవింగ్ ది రియల్ యాక్సిల్ ఆప్షన్లతో టయోటా కమ్రీ వస్తున్నాయి. ఎఫ్ డబ్ల్యూడీ వేరియంట్ 225 బీహెచ్పీ విద్యుత్, ఏడబ్ల్యూడీ మోడల్ 232 బీహెచ్పీ విద్యుత్ విడుదల చేస్తాయి. భారత్ మార్కెట్లో విడుదల చేసే కమ్రీ కేవలం ఏడబ్ల్యూడీ డ్రైవ్ ట్రైన్ ఆప్షన్ తో వస్తుంది.

## 2030 నాటికి రూ.3.38 లక్షల కోట్లు



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలోని ప్రధాన నగరాల్లో క్విక్ కామర్స్ సేవలకు గిరాకీ వేగంగా పెరుగుతోంది. వినియోగదారులు తమ ఇంటి దగ్గర్లోని కిరాణా దుకాణానికి వెళ్లి తెచ్చుకోగలిగేంత తక్కువ సమయంలోనే క్విక్ కామర్స్ కంపెనీలు ఆ సరుకులను ఇంటి వద్దకే డెలివరీ చేస్తున్నాయి. పైగా డిస్కౌంట్లూ ఆఫర్ చేస్తున్నాయి. దాంతో క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా ఆర్డర్ చేసే కస్టమర్ల సంఖ్య రోజురోజుకీ పెరుగుతూపోతోంది. 2024లో 610 కోట్ల డాలర్ల (రూ.51,484 కోట్లు) స్థాయికి చేరనున్న దేశీయ క్విక్‌కామర్స్ మార్కెట్.. 2030 నాటికి 4,000 కోట్ల డాలర్ల (రూ.3.38 లక్షల కోట్లు) స్థాయికి పెరగవచ్చని దాతుమ్ ఇంటెలిజెన్స్ తాజా నివేదిక అంచనా వేసింది. క్విక్ కామర్స్ కంపెనీలు ఇప్పటికే సంప్రదాయ కిరాణా షాపులకు చెందిన దాదాపు సగం విక్రయాలను చేజిక్కించుకోగలిగాయని రిపోర్టు పేర్కొంది. కిరాణా షాపుల నుంచి కొనుగోళ్లు తగ్గించామని కంపెనీ సర్వేలో పాల్గొన్న 46 శాతం మంది వెల్లడించారు.

దేశీయ క్విక్ కామర్స్ రంగంలో బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, ఫ్లిప్‌కార్ట్ మినట్స్ ప్రముఖ కంపెనీలుగా ఉన్నాయి. ఈ ప్లాట్‌ఫామ్స్ కస్టమర్లకు 10-30 నిమిషాల్లో ఇంటివద్దకే సరుకుల డెలివరీ అందిస్తున్నాయి. తొలుత నిత్యావసర, ఎఫ్ఎంసీజీ ఉత్పత్తులను మాత్రమే ఆఫర్ చేసిన ఈ ప్లాట్‌ఫామ్స్.. ఈ మధ్య కాలంలో ప్రొడక్ట్ పోర్ట్‌ఫోలియోను ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్, కాస్మెటిక్స్, దుస్తులు, జువెలరీ, బుక్స్, క్రీడల ఉత్పత్తులు, ఔషధాలు, మాంసాహారోత్పత్తులు సహా పలు విభాగాలకు విస్తరించాయి. ఈ ఏడాదిలో 128 కోట్ల డాలర్ల విలువైన కిరాణా షాపుల విక్రయాలను క్విక్ కామర్స్ వేదికలు చేజిక్కించుకోనున్నాయని అంచనా. ఇది ఆ ప్లాట్‌ఫామ్స్ మొత్తం విక్రయాల్లో 21 శాతంగా ఉండనుందని రిపోర్టు పేర్కొంది. ఈ ఏడాది క్విక్ కామర్స్ సేవలు 74 శాతం మేర వృద్ధి చెందవచ్చని అంచనా. 2023-28 మధ్య కాలంలో ఈ మార్కెట్ 48 శాతం సమ్మిళిత వృద్ధి రేటు (సీఏజీఆర్)తో దూసుకెళ్లనుందని నివేదిక పేర్కొంది.

**2 లక్షల కిరాణా స్టోర్ల మూత : ఏఐసీపీడీఎఫ్**

దేశంలో క్విక్ కామర్స్ సంస్థల సేవల శరవేగ వ్యాప్తి సంప్రదాయ కిరాణా దుకాణాల మనుగడపై తీవ్ర ప్రభావం చూపుతోంది. క్విక్ కామర్స్ దెబ్బకు గడిచిన ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా దాదాపు 2 లక్షల కిరాణా స్టోర్లు మూతపడ్డాయని ది ఆల్ ఇండియా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ డిస్ట్రిబ్యూటర్స్ ఫెడరేషన్ (ఏఐసీపీడీఎఫ్) ప్రకటించింది. దేశంలో దాదాపు 1.3 కోట్ల కిరాణా దుకాణాలున్నాయని అంచనా. అందులో కోటికి పైగా ద్వితీయ శ్రేణి, చిన్న నగరాలు, పట్టణాల్లో ఉన్నాయి. క్విక్ కామర్స్ సేవలు ప్రధానంగా మెట్రో నగరాల్లోని కిరాణా దుకాణాల వ్యాపారంపై అధిక ప్రభావం చూపుతున్నాయని.. గత ఏడాది కాలంలో మెట్రో సిటీల్లోని 90,000 స్టోర్లు మూతపడ్డాయని ఏఐసీపీడీఎఫ్ అంటోంది. ప్రథమ శ్రేణి నగరాల్లో 60,000.. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో మరో 50,000 దుకాణాలను కట్టేశారని తెలిపింది. క్విక్ కామర్స్ సంస్థల భారీ డిస్కౌంట్లు, అనుచిత వ్యాపార విధానాలు సంప్రదాయ కిరాణా దుకాణాల సంఖ్యతో పాటు వాటి కస్టమర్లు, లాభాలకూ గండికొడుతున్నాయని, వాటి మనుగడకు ప్రశ్నార్థకంగా మారాయని ఏఐసీపీడీఎఫ్ జాతీయ అధ్యక్షుడు ధైర్యశీల్ పాటిల్ అన్నారు.





## రైతులకు హీరో విజయ్ విందు..

**చెన్నై-నవభూమి:** విల్లుపురం జిల్లా విక్రవాండిలో తమిళగ వెట్రి కళగం(టీవీకే) తొలి మహానాడుకు స్థలమిచ్చిన రైతులను శనివారం ఉదయం ఆ పార్టీ నేత, నటుడు విజయ్(ఘనంగా సత్కరించారు. అదే సమయంలో అందరికీ ప్రత్యేక విందు కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేశారు. విక్రవాండి మహానాడు కోసం వి.సాలై వద్ద సుమారు 170 ఎకరాల విస్తీర్ణం కలిగిన స్థలాన్ని ఉపయోగించుకోవడానికి అక్కడి పంటలు పండించే రైతులు అనుమతించిన విషయం తెలిసిందే. అక్కడ జరిపిన పార్టీ మహానాడు ఘన విజయం సాధించడంతో స్థలమిచ్చిన రైతులను ఘనంగా సత్కరించాలని విజయ్ నిర్ణయించారు.
ఆ మేరకు పనయూరులో ఉన్న టీవీకే ప్రధాన కార్యాలయంలో భారీ ఏర్పాట్లు చేపట్టారు. రైతులకు విందునిచ్చేందుకు అనువుగా తగిన సదుపాయాలు కల్పించారు. ఆ తర్వాత మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీఆనంద్ తదితర పార్టీ ప్రముఖులతోపాటు విజయ్ ఆ ప్రాంతానికి చేరుకున్నారు. రైతులందరినీ శాలువలతో సత్కరించి విజయ్ ధన్యవాదాలు తెలిపారు. ఆ తర్వాత రైతులందరికీ ప్రత్యేక విందును ఏర్పాటు చేసిన శాఖాహార వంటకాలను వడ్డించారు. ఆ సందర్భంగా విజయ్ రైతులందరికీ చేతులెత్తి నమస్కరిస్తూ, చేతులు ఊపుతూ వేగంగా నడచుకుంటూ కారెక్కి అక్కడి నుండి బయలుదేరి వెళ్లారు.

## ఏం చేసిందని మహాయుతికి ఈ ఓట్ల సునామీ?




**ముంబై-నవభూమి:** మహారాష్ట్రలో ఏం చేసిందని బీజేపీ సారథ్యంలోని మహాయుతి కూటమికి ఓట్ల సునామీ వచ్చిందో అర్థం కావడం లేదని శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే వ్యాఖ్యానించారు. బీజేపీకి సానుకూల పవనాలు వీచాయనడం కంటే దాని గెలుపునకు సునామీయే వచ్చినట్టు ఫలితాలు చెబుతున్నాయన్నారు. అయితే ఇంత భారీ విజయం ఆ కూటమికి ఎలా దక్కిందో తెలియడం లేదని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ తీవ్ర నిరాశ వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ)... అంచనాలను మించి ఫలితాలు సాధించడం, బీజేపీని కంగుతినిపించిన విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ నాలుగు నెలల్లో పరిస్థితులు ఇంతలా ఎలా మారిపోతాయని సందేహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రైతుల దుస్థితి, నిరుద్యోగిత వంటి సమస్యలను ఎన్‌డీఏ పరిష్కరించిందా అని ప్రశ్నించారు. కరోనా కష్టకాలంలో నాతో నిలబడి, నన్ను కుటుంబ పెద్దలా భావించి నా మాట విన్న ఇదే మహారాష్ట్ర ఇలాంటి తీర్పునిచ్చిందంటే నమ్మలేకపోతున్నానని చెప్పారు. విజయం సాధించిన మహాయుతిని అభినందిస్తూ.. ఆ కూటమి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, పథకాలను అమలు చేయాలని సూచించారు.

## ఆటోవాలా నుంచి 'మహా'నేతగా



**ముంబై-నవభూమి:** తన వర్గం ఎమ్మెల్యేలను కూడగట్టుకొని బీజేపీ మద్దతుతో సీఎం అయిన ఏక్‌నాథ్ శిందే నిన్నటిదాకా 'తిరుగుబాటు' నేతే! ఇప్పుడు మాత్రం జనామోదం పొందిన అగ్రనేత. రెండున్నరేళ్ల క్రితం బీజేపీ సాయంతో శివసేనను చీల్చి.. ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టి, కమలం పెద్దల ఆశీస్సులతోనే పదవిలో కొనసాగాడనిపించుకున్న శిందే.. తాజా ఎన్నికల ద్వారా ఒక్కసారిగా శిఖరస్థానానికి ఎదిగారు.
ఇప్పుడో మహారాష్ట్రలో దిగ్గజనేత. ఉద్ధవ్ ఠాక్రే శివసేన మట్టికరవడంతో 'అసలైన శివసేన' అధిపతి తానేనని అనిపించుకున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో 15 స్థానాల్లో పోటీ చేసిన ఏడింట్లోనే గెలిచి పెద్దగా ప్రభావం చూపకపోయిన శిందే శివసేనను మహాయుతి కూటమి భాగస్వామిగా తాజా అసెంబ్లీ ఎన్నికల్లో 57 స్థానాల్లో పార్టీని గెలిపించుకొని పడిలేచారనిపించుకున్నారు. రెండున్నరేళ్లు ఆయన ముఖ్యమంత్రిగా ఆయన ప్రవేశపెట్టిన వివిధ పథకాలకు లభించిన ఆదరణ ఆయనకు ఓట్లు రాల్చిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2022లో శివసేన పార్టీ అగ్రనేత ఉద్ధవ్‌ఠాక్రేపై 40 మంది ఎమ్మెల్యేలతో తిరుగుబాటు చేసి బీజేపీ మద్దతుతో 2022 జూలై 30న శిందే ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టారు. శిందే మౌనముని. తక్కువగా మాట్లాడతారు. శిందే వయసు 58 ఏళ్లు. ఆయన స్వస్థలం సతారా తాలూకాలోని జవాలీ. నూనుగు మీసాల వయసులో షిండే కుటుంబ పోషణ కోసం ఠాణేలో ఆటో రిక్షా నడిపేవారు. బాల్‌ఠాక్రేకు వీరాభిమాని. అదే ఆయన్ను రాజకీయాల్లోకి ప్రవేశించేలా చేసింది. 1980లో అప్పటి ఠాణే శివసేన అధ్యక్షుడు ఆనంద్ దీఘే ఆశీస్సులతో శిందే రాజకీయాల్లోకి వచ్చారు. 1997లో ఠాణే మునిసిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికయ్యారు. 2001లో ఆనంద్ దీఘే స్థానంలో ఠాణేలో శివసేన పగ్గాలు చేపట్టారు షిండే. బాల్‌ఠాక్రే మేనల్లుడు రాజ్‌ఠాక్రే పార్టీ వీడి మహారాష్ట్ర నవనిర్మాణ సేన పేరుతో వేరు కుంపటి పెట్టిన తర్వాత శివసేనలో శిందే ప్రాధాన్యం పెరిగింది. తాజా ఎన్నికలతో కలుపుకొంటే కోప్రీ-పచ్ పఖాడీ అసెంబ్లీ స్థానం నుంచి షిండే వరుసగా ఐదుసార్లు.. అంటే 2004, 2009, 2014, 2019, 2024లో ఎమ్మెల్యేగా గెలిచారు. 2019లో ఆరోగ్య, కుటుంబసంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. షిండే కుమారుడు శ్రీకాంత్ శిందే వైద్యుడు. 2014లో శ్రీకాంత్ కల్యాణ్ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు.

## క్యాన్సర్ పనిపడుతున్న కొవిడ్!



**లండన్-నవభూమి:** కొవిడ్ సోకడం వల్ల ఆరోగ్యానికి కలిగే దుష్ప్రభావాలే కాదు.. మొదటిసారిగా కొవిడ్ ఇన్ఫెక్షన్‌తో ఒక ప్రయోజనం ఉందని చెప్తున్నారు ఇంగ్లండ్‌కు చెందిన శాస్త్రవేత్తలు. తీవ్రమైన కొవిడ్ ఇన్ఫెక్షన్ సోకడం.. క్యాన్సర్ తీవ్రతను తగ్గించడానికి ఉపయోగపడుతుందని వీరు ఎలుకలపై చేసిన ప్రయోగాల్లో గుర్తించారు. ఇందుకు సంబంధించిన వివరాలు 'జర్నల్ ఆఫ్ క్లినికల్ ఇన్వెస్టిగేషన్'లో ప్రచురితమయ్యాయి.
ఈ పరిశోధన ప్రకారం.. శరీరంలో మైనోసైట్లు అనే రకమైన తెల్ల రక్త కణాలు ఉంటాయి. ఇన్ఫెక్షన్లు, వైరస్‌ల నుంచి శరీరానికి రక్షణ కల్పించడంలో ఇవి కీలకపాత్ర పోషిస్తాయి. అయితే, క్యాన్సర్ బాధితుల్లో మాత్రం కొన్నిసార్లు క్యాన్సర్ కణాలు ఈ మోనోసైట్లను హైజాక్ చేసి క్యాన్సర్ అనుకూల కణాలుగా మార్చేస్తాయి. దీంతో ఇవి శరీర రోగనిరోధక వ్యవస్థ నుంచి క్యాన్సర్‌కు రక్షణ కల్పించేలా మారిపోతాయి.

**క్యాన్సర్‌పై పోరాడే మోనోసైట్ల ఉత్పత్తి**

తీవ్రమైన కొవిడ్ ఇన్ఫెక్షన్ సోకినప్పుడు శరీరంలో ప్రత్యేక రకమైన మోనోసైట్లు ఉత్పత్తి అవుతున్నాయి. ఇవి క్యాన్సర్ వ్యతిరేక గుణాలను తిరిగి పొందుతున్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు.

# బ్యాంకు లాకర్లకు జోరుగా డిమాండ్



**న్యూఢిల్లీ-నవభూమి:** ఈ రోజుల్లో మనం ఎంత జాగ్రత్తగా ఉంటున్నా.. ఇళ్లల్లో ఉంచే విలువైన వస్తువులకు భద్రత ఉంటుందా అనేది అనుమానమే. ఇండిపెండెంట్ గృహాలైనా, అపార్ట్‌మెంట్స్ అయినా ఎప్పుడు ఏ దొంగ...

**బ్యాంకు లాకర్లకు జోరుగా డిమాండ్**

విలువైన వస్తువులకు భద్రత ఉంటుందనే భరోసా

ఈ రోజుల్లో మనం ఎంత జాగ్రత్తగా ఉంటున్నా.. ఇళ్లల్లో ఉంచే విలువైన వస్తువులకు భద్రత ఉంటుందా అనేది అనుమానమే. ఇండిపెండెంట్ గృహాలైనా, అపార్ట్‌మెంట్స్ అయినా ఎప్పుడు ఏ దొంగ కన్నం వేస్తాడో తెలియని పరిస్థితి. దీంతో ప్రజలు తమ దగ్గర ఉన్న విలువైన వస్తువులు, ఆభరణాలు, కీలక పత్రాలు భద్రపరుచుకునేందుకు బ్యాంక్ లాకర్లను ఆశ్రయిస్తున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలనే తేడా లేకుండా బ్యాంకు లాకర్ల కోసం ఎగబడుతున్నారు. దీంతో బ్యాంకుల్లో లాకర్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది.
అర్హత : దాదాపు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు తమ శాఖల్లో లాకర్ సౌకర్యం అందిస్తున్నాయి. మైనర్లు తప్ప, వయోజనులైన ప్రతి ఒక్కరు ఒంటరిగా లేదా ఉమ్మడిగా నిర్ణీత వార్షిక ఫీజుతో ఈ సౌకర్యాన్ని ఎంచుకోవచ్చు. భాగస్వామ్య సంస్థలు, లిమిటెడ్ కంపెనీలు, అసోసియేషన్లు, క్లబ్బులు కూడా తమ పేరు మీద బ్యాంకు లాకర్లను తీసుకోవచ్చు. బ్యాంకు-బ్యాంకు లాకర్‌ను అద్దెకు తీసుకున్న వ్యక్తి/సంస్థల మధ్య ఉండే సంబంధం.. ఏదైనా ఆస్తిని లీజుకు ఇచ్చిన వ్యక్తి-లీజుకు తీసుకున్న వ్యక్తి మధ్య ఉండే సంబంధంలాంటిదే.
నూరు శాతం భద్రత: ఇంట్లో దాచుకునే విలువైన నగ, నట్రా, కీలక పత్రాలకు పూర్తి స్థాయిలో భద్రత ఉండకపోవచ్చు. బ్యాంకు లాకర్లలో దాచుకునే వాటికి మాత్రం పూర్తి భద్రత ఉంటుందనే భరోసాతో ఉండవచ్చు. ఇందుకు చెల్లించే వార్షిక ఫీజు నామమాత్రమే. క్రమం తప్పకుండా వార్షిక ఫీజు చెల్లిస్తూ నిబంధనలు పాటించినంత కాలం బ్యాంకులు కూడా లాకర్‌ను క్లోజ్ చేయవు. కాకపోతే ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో లాకర్ దొరకడమే కొద్దిగా కష్టం. ప్రైవేట్ బ్యాంకులతో పోలిస్తే ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)ల్లో లాకర్ ఫీజు తక్కువ. దీంతో వీటికి విపరీతమైన డిమాండ్ ఉంది. నామినేషన్ సదుపాయం: లాకర్‌ను లీజుకు తీసుకున్న వ్యక్తులకు బ్యాంకులు నామినేషన్, సర్వైవర్‌షిప్ సదుపాయాలు కల్పిస్తున్నాయి. కొన్ని ప్రభుత్వ బ్యాంకులు నామినేషన్ సదుపాయాన్ని ఒకరికి మాత్రమే పరిమితం చేస్తున్నాయి. లాకర్ ఒకరి కంటే ఎక్కువ మంది పేరు మీద ఉండి, వారిలో ఒకరు చనిపోతే, ఆ లాకర్, అందులోని వస్తువులు జీవించి ఉన్న మిగతా వ్యక్తులకు వెంటనే సంక్రమించవు. నామినేషన్, సర్వైవర్‌షిప్ క్లాజును ఎంచుకున్నప్పుడు మాత్రమే, ఆ లాకర్‌ను ఆపరేట్ చేసే హక్కు జీవించి ఉన్న మిగతా జాయింట్ హోల్డర్ లేదా నామినీకి సంక్రమిస్తుంది. ఫీజులు: లాకర్‌ను లీజుకు ఇచ్చినందుకు బ్యాంకుకు ఏటా ముందుగానే వార్షిక ఫీజు చెల్లించాలి. ఈ ఫీజు లాకర్ పరిమాణం, బ్యాంకు ఉన్న ప్రాంతాన్ని బట్టి మారుతుంటుంది. ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ)తో పోలిస్తే, ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో ఈ ఫీజు ఎక్కువ. దాదాపు అన్ని పీఎస్‌బీలు ఒక ఆర్థిక సంవత్సరంలో 12 సార్లు ఉచితంగా లాకర్‌ను ఓపెన్ చేసే సదుపాయం కల్పిస్తున్నాయి. అంతకు మించితే మాత్రం ప్రతి ఓపెనింగ్‌కు రూ.100 ప్లస్ జీఎస్టీ చెల్లించాలి. ఒకవేళ లాకర్ తాళం పోగొట్టుకున్నా, లాకర్ బ్రేక్ చేయాల్సి వచ్చినా, సమయానికి లాకర్ ఫీజు చెల్లించక పోయినా రూ.1,000 ప్లస్ జీఎస్టీతో పాటు లాకర్ బ్రేక్ చేయడానికి అయ్యే ఖర్చులు కూడా చెల్లించాలి. దీనికి తోడు లాకర్ ఇచ్చేటప్పుడే నిర్ణీత ఫీజు సహా జీఎస్టీ, కొంత మొత్తం ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలి. అనధికార దందా: వీటికి తోడు లాకర్ సైజును బట్టి.. లాకర్ ఇచ్చే ముందే పెద్ద మొత్తంలో నగదు తమ బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) చేయమని బ్యాంకులు అడుగుతుంటాయి. ప్రైవేట్ బ్యాంకులు ఇందుకు లాకర్ సైజును బట్టి రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షలు అడుగుతుంటే, పీఎస్‌బీలూ రూ.లక్ష నుంచి రూ.1.5 లక్షల వరకు వసూలు చేస్తున్నాయి. అలా చెల్లించలేని వారికి లాకర్లు ఖాళీ లేవని చెప్పేస్తున్నాయి. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) నిబంధనలకు ఇది పూర్తిగా విరుద్ధం. అయినా చాలా బ్యాంకులు ఇప్పటికీ ఈ దందా కొనసాగిస్తున్నాయి.

## ప్రపంచ కుబేరుడిగా ఎలన్ మస్క్.. రికార్డు స్థాయిలకు చేరిన టెస్లా షేర్..




**అమెరికా-నవభూమి:** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ గెలిచిన దగ్గర్నుంచి టెస్లా షేర్ పరుగులు పెడుతోంది. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడు కావడంలో టెస్లా వ్యవస్థాపకుడు ఎలన్ మస్క్ (%జుశ్రీశీఅ వీబంఎ%) కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మస్క్ సంపద భారీగా పెరుగుతోంది. అమెరికా అధ్యక్ష ఎన్నికల రోజు నుంచి ఇప్పటివరకు టెస్లా షేర్ ఏకంగా 40 శాతం పెరిగింది. దీంతో మస్క్ సంపద 334.4 బిలియన్ డాలర్లకు చేరింది. దీంతో మస్క్ ప్రపంచ కుబేరుడిగా అవతరించినట్లు అమెరికా వార్తా సంస్థ వెల్లడించింది. శుక్రవారం ఒక్కరోజే టెస్లా స్టాక్ 3.84 శాతం పెరిగింది. దీంతో మస్క్ నికర సంపద 320 బిలియన్ డాలర్ల మార్క్‌ను దాటి 334.4 బిలియన్ డాలర్లకు చేరింది. అమెరికా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్‌తో సాన్నిహిత్యం కారణంగానే మస్క్ సంస్థపై మదుపర్లకు విశ్వాసం పెరిగింది. ట్రంప్ తన కార్యవర్గంలో ఎలన్ మస్క్‌ను కూడా చేర్చుకుని కీలక బాధ్యతలు అప్పగించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ (డోజ్) సంయుక్త సారథులుగా ఎలన్ మస్క్, వివేక్ రామస్వామిలను నియమించారు. దీంతో అమెరికా ప్రభుత్వ నిర్ణయాలపై మస్క్ ముద్ర కనిపించబోతోంది.
అమెరికా అధ్యక్ష ఎన్నికల కోసం పోటీ పడుతున్న సమయంలో రిపబ్లిక్ అభ్యర్థి అయిన ట్రంప్‌నకు మస్క్ మద్దతుగా నిలిచారు. భారీ స్థాయిలో విరాళాలు అందించారు. ప్రచారంలో ట్రంప్‌నకు అనుకూలంగా పెద్ద ఎత్తున క్యాంపెయిన్ నిర్వహించారు. ప్రజల మూడ్‌ను ట్రంప్‌నకు అనుకూలంగా మార్చడంలో మస్క్ క్రియాశీలకంగా పని చేశారు. ఈ నేపథ్యంలోనే మస్క్‌కు ట్రంప్ సముచిత గౌరవం కల్పించారు. అధ్యక్షుడికి సన్నిహితుడు కావడంతోనే ట్రంప్ సంస్థ షేర్లు పరుగులు పెడుతున్నాయి.

## ఘోర ప్రమాదం.. ఇలాంటి యాక్సిడెంట్ ఎప్పుడూ చూసుండరు..




**న్యూఢిల్లీ-నవభూమి:** మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఓ డ్రైవర్ అశ్రద్ధ నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. అతని నిర్లక్ష్యం కారణంగా ఓ బాలుడు ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. స్థానికులు అరుస్తున్నప్పటికీ పట్టించుకోని డ్రైవర్.. బస్సును నిర్లక్ష్యంగా నడిపాడు. ఏకంగా బాలుడి పైనుంచి బస్సు నడిపి మృతిచెందేందుకు కారణం అయ్యాడు. ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. ఈ వీడియో కాస్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. డ్రైవర్ నిర్లక్ష్యంపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
గ్వాలియర్‌లోని హజీరా జాతీ లైన్ ప్రాంతానికి చెందిన భవిష్య(14) అనే బాలుడు స్థానిక బీటీఐ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. అయితే ఆదివారం మధ్యాహ్నం పాఠశాల అనంతరం తన స్నేహితుడిని ఇంటి వద్ద దింపేందుకు భవిష్య నిర్ణయించుకున్నాడు. అనంతరం ఇద్దరూ కలిసి సైకిల్‌పై ఏఆర్పీ కాలనీకి బయలుదేరారు. రోడ్డుపై విపరీతమైన ట్రాఫిక్ ఉండడంతో వారిద్దరూ మెల్లిగా వెళుతున్నారు. అయితే ఓ కూడలి వద్ద ఎడమ వైపునకు వెళ్లేందుకు డ్రైవర్ బస్సును నిలిపివేశాడు. అనంతరం బస్సు పక్క నుంచి మూడు ద్విచక్రవాహనాలు వరకూ ముందుకు వెళ్లిపోయాయి. అయితే ఎడమ వైపునకు టర్న్ తీసుకునేందుకు బస్సు పక్కనే భవిష్య, అతని స్నేహితుడు ఆగారు. వాహనాలు వెళ్లిపోయిన తర్వాత వెంటనే బస్సు డ్రైవర్ ఎడమవైపు టర్న్ తీసుకున్నాడు. అయితే తమపైకి బస్సు రావడంతో తప్పించుకునేందుకు ఇద్దరు విద్యార్థులు ప్రయత్నించారు. అయినప్పటికీ వారిని గమనించని డ్రైవర్ ముందుకు వెళ్లాడు. సైకిల్ వెనకాల కూర్చున్న బాలుడు కిందకు దిగిపోగా.. భవిష్య మాత్రం తప్పించుకునేందుకు వీలులేకుండా పోయింది. దీంతో అతన్ని బస్సు డ్రైవర్ 10మీటర్లు మీర లాక్కెళ్లిపోయాడు. అనంతరం అతని పైనుంచి బస్సును నడిపించాడు. ప్రమాదంలో విద్యార్థి భవిష్యకు తీవ్రగాయాలు అయ్యాయి. అయితే అప్పటికే ప్రమాదాన్ని గమనిస్తున్న స్థానికులు గట్టిగా కేకలు వేయడం ప్రారంభించారు. అప్రమత్తమైన డ్రైవర్ బస్సును నిలిపివేశాడు. ప్రమాదం జరిగిందని తెలుసుకుని అక్కడ్నుంచి పారిపోయాడు. దీంతో స్థానికులు భవిష్యను హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తరలించి బాలుడి కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. ఈ మొత్తం ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. అయితే భవిష్య చికిత్సపొందుతూ మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. డ్రైవర్ కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. బాలుడి మృతితో బాధిత కుటుంబం తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయింది.

## ఖైబర్ ఫఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో హింస.. 24 గంటల్లో 18 మంది మృతి



**న్యూఢిల్లీ-నవభూమి:** పాకిస్థాన్‌లోని ఖైబర్ ఫఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో జరిగిన హింసలో 18 మంది దుర్మరణం చెందారు. మరో 30 మంది వరకు గాయపడ్డారు. వాహనాల కాన్వాయ్‌పై దాడి అనంతరం ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దులోని కుర్రం జిల్లా అలీజాయ్, బగన్ తెగల మధ్య ఘర్షణ చోటు చేసుకున్నది. ఈ ఘటనలో 47 మంది వరకు హత్యకు గురయ్యారు. మరో వైపు బలిషెల్, ఖార్ కాలీ, కుంజ్ అలీజాయ్, మక్బాల్‌లో సైతం కాల్పులు కొనసాగుతున్నాయి. భారీ ఆయుధాలతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటున్నారు. ఈ ఘర్షణల్లో ఇప్పటి వరకు 18 మంది చనిపోగా, 30 మంది గాయపడ్డారు. ఈ ఘర్షణల్లో 30 మందికిపైగా మీడియా నివేదికలు పేర్కొన్నాయి. ఘర్షణల్లో ఇండ్లతో పాటు దుకాణాలు సైతం ధ్వంసమయ్యాయి. ఘర్షణల నేపథ్యంలో పలువురు ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివచ్చారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో శనివారం విద్యాసంస్థలను మూసి ఉంచినట్లు ప్రైవేట్ ఎడ్యుకేషన్ నెట్‌వర్క్ ఛైర్మన్ ముహమ్మద్ హయత్ హసన్ తెలిపారు. బగన్, మందూరి, ఓచాట్‌లో గురువారం 50 మందికిపైగా ప్రయాణికుల వాహనాలపై దాడులకు తెగబడ్డారు. ఈ క్రమంలో ఆరు వాహనాలు ఢీకొట్టడంతో మహిళలు, పిల్లలు సహా 47 మంది ప్రాణాలు కోల్పోయారు. వాహనాలు పరాచినార్ నుంచి ఖైబర్ ఫఖ్తుంఖ్వా రాజధాని పెషావర్‌కు వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకున్నది. బాధితుల్లో ఎక్కువ మంది షియా వర్గానికి చెందిన వారు ఉన్నారు.

## శబరిమలకు పోటెత్తిన భక్తులు.. పంబ వరకూ క్యూలైన్.. ఈ సీజన్‌లో ఇదే హయ్యెస్ట్



**శబరిమల-నవభూమి:** రెండు నెలల పాటు సాగే మండల మకరు విళక్కు పూజల కోసం తెరుచుకున్న శబరిమల అయ్యప్ప దర్శనానికి భక్తులు పోటెత్తారు. భక్తుల రద్దీతో శబరిగిరులు అయ్యప్ప నామస్మరణతో మారుమోగిపోతున్నాయి. గతవారం సాదారణంగా ఉన్న భక్తుల సంఖ్య.. శుక్రవారం నుంచి ఒక్కసారిగా పెరిగిపోయింది. దీంతో భారీగా క్యూలైన్‌లు ఏర్పడ్డాయి. రోజుకు 80 వేల టోకెన్లు జారీచేయనున్నట్టు యాత్ర ప్రారంభానికి ముందే కేరళ ప్రభుత్వం ప్రకటించింది. గతేడాది ఏర్పాట్లపై విమర్శలు రావడంతో ఈసారి ముందే జాగ్రత్తలు తీసుకుంది.
ప్రధానాంశాలు: శబరిమల అయ్యప్ప దర్శనానికి గత రెండు రోజుల నుంచి భక్తులు తాకిడి ఎక్కువగా ఉంది. భక్తుల రద్దీతో శబరిగిరులు కిక్కిరిసిపోతున్నాయి. పంబ వరకూ క్యూలైన్ వ్యాపించింది. ఆంధ్రప్రదేశ, తెలంగాణ తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో అయ్యప్పలు తరలివస్తున్నారు. శుక్రవారం ఒక్క రోజే 87,186 మంది స్వామిని దర్శించుకున్నారు. ఈ సీజన్‌లో ఇంత సంఖ్యలో భక్తులు దర్శించుకోవడం ఇదే మొదటిసారి. శని, ఆదివారాలు కూడా రద్దీ ఎక్కువగా ఉంది. రాత్రి 11 గంటల తర్వాత ఆలయం మూసివేయడంతో దర్శనాలు నిలిచిపోయాయి.. ఆదివారం తెల్లవారుజామున 3 గంటల నుంచి మళ్లీ భక్తులను అనుమతిస్తున్నారు. దర్శనాలకు 10 నుంచి 14 గంటల సమయం పడుతోంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మరకుట్ట సమీపంలోని మూడు చోట్ల భక్తులను నియంత్రించి... సన్నిధానానికి ఒకేసారి ఎక్కువ మంది రాకుండా ఉండేందుకు ఆంక్షలు విధించారు.
సీజన్‌లో భారీగా అయ్యప్ప దర్శనాలకు భక్తుల వస్తారని అంచనా వేసి.. రోజుకు 80 వేల మందికి (వర్చువల్ క్యూ 70,000, స్పాట్ బుకింగ్‌లు 10,000) దర్శన టిక్కెట్లు జారీచేయాలని నిర్ణయించారు. అయితే, గతవారం భక్తుల రద్దీ అంచనా కంటే తక్కువగా ఉండటంతో అదనంగా మరో 10 వేల దర్శన టిక్కెట్లు జారీచేసే ఆలోచనలో ఉన్నట్టు ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు తెలిపింది. దీని వల్ల భక్తుల సంఖ్యను పెరుగుతోందని ఆశించింది. ఈ క్రమంలో శుక్రవారం నుంచి అనూహ్యంగా భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఈ ఏడాది ఆలయంలో మండల పూజల సీజన్ మొదలైన తర్వాత వారం రోజుల్లో 5.30 లక్షల మంది స్వామిని దర్శించుకున్నారు. గతేడాది మొదటి వారంలో ఈ సంఖ్య 2.64 లక్షలే కావడం గమనార్హం.

**శబరిమలలో కనివిని ఎరుగని రద్దీ.. దర్శనం చేసుకోకుండానే వెళ్లిపోతున్న భక్తులు**

'శుక్రవారం 87,216 మంది భక్తులు దర్శించుకున్నారు.. వీరిలో 11 వేల మంది స్పాట్ బుకింగ్ టోకెన్లు ద్వారా దర్శనం చేసుకున్నారు.. గతవారం నిలక్కల్, ఎరుమేలి, సత్రం వద్ద ఏర్పాటుచేసిన స్పాట్ బుకింగ్ కౌంటర్ల ద్వారా 50 వేల మంది భక్తులు టోకెన్లు తీసుకున్నారు..' అని టీడీబీ ఛైర్మన్ పీఎస్ ప్రశాంత్ తెలిపారు. అయితే, దర్శన టోకెన్ల పెంపుపై ఆయన ఆచితూచి స్పందించారు. నిర్వహించ స్థాయికి మించిన భక్తుల రాక లాజిస్టికల్ సవాళ్లకు దారితీస్తుందని చెప్పారు. అయితే, గతేడాది డిసెంబరులో దర్శన టిక్కెట్లను 90 వేలకు పెంచాలని కేరళ హైకోర్టు ఆదేశించింది. దీనిపై తాజాగా శబరిమల స్పెషనల్ కమిషనర్ ఆర్ జయకృష్ణన్.. కోర్టుకు నివేదిక సమర్పించారు. నివేదిక పరిశీలించిన కోర్టు ప్రస్తుతం రోజుకు 80 వేల టోకెన్లు జారీ అవుతున్నాయని, తమ ఉత్తర్వులు అమలు కావడం లేదని వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో మరో 10 వేల దర్శన టోకెన్లను పెంచేందుకు టీడీబీ చర్యలు తీసుకుంటోంది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
8 | హైదరాబాద్
శనివారం
23 । నవంబర్ । 2024



## బిగ్ బాస్ నుంచి యష్మీ గౌడ ఎలిమినేట్.?

బుల్లితెర ప్రేక్షకుల ఫేవరేట్ షో బిగ్ బాస్ సీజన్ 8 చివరి దశకు చేరుకుంది. ఇప్పటికే 12 వారాలుగా అలరిస్తున్న ఈ షో మరికొన్ని రోజుల్లో ముగియనుంది. అయితే ఈ షోకి సంబంధించి ఆదివారం వస్తుందంటే చాలు ప్రేక్షకులు టెన్షన్‌తో టీవీలకు అతుక్కుపోతారన్న విషయం తెలిసిందే. ఇప్పటికే హౌజ్ నుంచి బేబక్కతో పాటు, శేఖర్ బాషా, అభయ్, సోనియా ఆకుల, గంగవ్వ, హరితేజ, నవీన్ తదితరులు ఎలిమినేట్ అవ్వగా.. ఈ వారం ఎవరు ఎలిమినేట్ అవ్వబోతున్నారు అనేది ఆసక్తికరంగా మారింది.అయితే ఇంతకుముందు ఉన్న వారాలతో పోల్చుకుంటే ఈ వారం ఎలిమినేషన్ చాలా భిన్నంగా జరిగింది. గతంలో హౌజ్ నుంచి వెళ్లిపోయిన సభ్యులు వచ్చి హౌజ్‌లో ఉన్నవారిని ఈ వారం నామినేట్ చేశారు. ఇక నామినేషన్స్‌లో ఉంది ఎవరు చూసుకుంటే.. నబీల్, ప్రేరణ, నిఖిల్, పృథ్వీ, యష్మీ.. ఉన్నారు. ఇందులో ఈ వారం తక్కువ ఓటింగ్‌తో డేంజర్ జోన్‌లో ఉంది యష్మీ గౌడ. దీంతో ఈ వారం హౌజ్ నుంచి ఎలిమినేట్ అయ్యింది యష్మీ గౌడ అని వార్తలు వస్తున్నాయి. హౌజ్‌లోకి వచ్చిన ఫస్ట్ డే నుంచి తన ఆటతో ఆకట్టుకుంది ఈ అమ్మడు. ఇక 12 వారాలు టైటిల్ విన్నర్‌కి స్ట్రాంగ్ కంటెస్టెంట్‌గా కనిపించిన ఈ భామ తక్కువ ఓటింగ్‌తో ఎలిమినేట్ అయినట్లు తెలుస్తుంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాలి అంటే ఈరోజు ఎపిసోడ్ వచ్చేవరకు వెయిట్ చేయాల్సిందే.

నవచిత్ర






## ఎక్స్ కోసం కాస్ట్లీ గిఫ్ట్స్.. అవన్నీ వేస్ట్ ఖర్చు: సమంత

అందులో అవసరం లేకపోయినా మీరు అత్యధిక మొత్తంలో దేని కోసం ఖర్చు పెట్టారు? అని వరుణ్ ధావన్ సామ్ ను ప్రశ్నించారు. స్టార్ హీరోయిన్ సమంత.. ఇటీవల సిటాడెల్ హనీ బన్నీ వెబ్ సిరీస్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. రాజ్ అండే డీకే తెరకెక్కించిన ఆ సిరీస్.. అమెజాన్ ప్రైమ్ వీడియోలో కొద్ది రోజుల క్రితం అందుబాటులోకి వచ్చింది. అందులో బాలీవుడ్ స్టార్ హీరో వరుణ్ ధావన్ కూడా కీలక పాత్రలో నటించారు. ప్రపంచవ్యాప్తంగా 200 దేశాల్లో సిరీస్ ప్రసారమవుతుండగా.. అనేక దేశాల్లో టాప్ లో ఉంది.ే వరుణ్, సామ్ యాక్టింగ్ కు మంచి ప్రశంసలు లభిస్తున్నాయి. అదే సమయంలో పోస్ట్ ప్రమోషన్స్ లో భాగంగా వారిద్దరూ చిట్ చాట్ లో పాల్గొన్నారు. స్పైసీ రాపిడ్ ఫైర్ ఆడారు. అందులో అవసరం లేకపోయినా మీరు అత్యధిక మొత్తంలో దేని కోసం ఖర్చు పెట్టారు? అని వరుణ్ ధావన్ సామ్ ను ప్రశ్నించారు. దీంతో తన మాజీకి ఇచ్చిన ఖరీదైన కానుకలని తెలిపారు సమంత. వాటి కాస్ట్ ఎంత ఉంటుందని వరుణ్ అడగ్గా.. కాస్త ఎక్కువేనని సమంత అన్నారు. ఆ తర్వాత ఇక కొనసాగిద్దామని తెలిపారు. దీంతో సామ్ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. తెగ చక్కర్లు కొడుతున్నాయి. రాపిడ్ ఫైర్ కు సంబంధించిన వీడియో ట్రెండ్ అవుతోంది. అయితే సమంత ఎవరి కోసం అలా అన్నారోనని నెటిజన్లు డిస్కస్ చేసుకుంటున్నారు. ఆ తర్వాత ఇక్కడికి రావడానికి ముందు ఎవరికి మెసేజ్ చేశారు?.. ఆ మెసేజ్ ను పైకి చదివి వినిపిస్తారా? అని వరుణ్ క్వశ్చన్ చేశారు. అది రివీల్ చేయడానికి ఇష్టపడలేదు సామ్. ఆన్సర్ బదులు పచ్చిమిర్చి తినేశారు. అనంతరం హనీ బన్నీ షూట్ సమయంలో ఎవరితోనైనా తన కోసం గాసిప్స్ చెప్పారా అని వరుణ్ అడగ్గా.. లేదని అన్నారు సమంత.

అయితే సమంత.. సిటాడెల్ తర్వాత మా ఇంటి బంగారం పేరుతో ఒక మూవీని అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. తన బర్త్ డే కానుకగా ప్రకటించారు. తన సొంత నిర్మాణ సంస్థ ట్రాలాల మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ పై నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆ సమయంలో స్పెషల్ పోస్టర్ కూడా రిలీజ్ చేశారు. అందులో సామ్.. పవర్ ఫుల్ ఉమెన్ గా కనిపిం చారు. కానీ ఆ తర్వాత ఇప్పటి వరకు.. ఎలాంటి అప్డేట్ ఇవ్వలేదు. షూటింగ్ స్టార్ట్ అయిందో కూడా తెలియదు. ఇప్పుడు సామ్ చేతిలో ఆ మూవీ కాకుండా మరో ప్రాజెక్టు లేదు. సామ్ కొత్త సినిమాల కోసం ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వినిపిస్తున్నా.. అనౌన్స్మెంట్ రావడం లేదు. మరి చూడాలి సామ్ నెక్స్ట్ ఏ ప్రాజెక్టుతో ప్రేక్షకుల ముందుకు రానున్నారో..


## అల్లు అర్జున్, శ్రీలీల స్టైలిష్ డ్యాన్స్.. కిస్సిక్ ఫుల్ సాంగ్



టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్ కాంపౌండ్ నుంచి వస్తోన్న పాన్ ఇండియా చిత్రం పుష్ప 2 ది రూల్ . సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ ఫ్రాంఛైజీ ప్రాజెక్ట్ డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలకు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ప్రమోషనల్ ఈవెంట్స్‌తో ఫుల్ బిజీగా ఉంది టీం. ఇప్పటికే విడుదల చేసిన సాంగ్స్ నెట్టింటిని షేక్ చేస్తున్నాయి.మరోవైపు కిస్సిక్ సాంగ్ ప్రోమోతో డ్యాన్స్ ఫ్లోర్ దద్దరిల్లిపోవం పక్కా అని అర్థమవుతోంది. తాజాగా ఫుల్ లిరికల్ వీడియో సాంగ్ అప్‌డేట్ ఇస్తూ కొత్త లుక్ విడుదల చేశారు మేకర్స్. ఈ సాంగ్‌ను ఇవాళ రాత్రి 7:02 గంటలకు చెన్నై ఈవెంట్‌లో లైవ్ పర్‌ఫార్మెన్స్‌తో లాంచ్ చేయనున్నారు. శ్రీలీల, బన్నీ స్టైలిష్ కలర్‌ఫుల్ డ్యాన్స్‌తో థియేటర్లు షేక్ అవడం గ్యారంటీ అని తాజా పోస్టర్ చెప్పకనే చెబుతోంది.ఫస్ట్ పార్ట్‌లో ఊ అంటావా సాంగ్ బాక్సాఫీస్‌ను ఏ రేంజ్‌లో షేక్ చేసిందో తెలిసిందే. మరి కిస్సిక్ కూడా అలాంటి ట్రెండ్ క్రియేట్ చేస్తుందా..? అనేది చూడాలి. సీక్వెల్‌లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ తెరకెక్కిస్తోన్న ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.


## చరణ్, కియారా పర్పుల్ లవ్.. థర్డ్ సింగిల్ ఎప్పుడంటే?

టాలీవుడ్ స్టార్ హీరో రామ్ చరణ్, కోలీవుడ్ ప్రముఖ దర్శకుడు శంకర్ కాంబోలో గేమ్ ఛేంజర్ మూవీ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే షూటింగ్ పూర్తవ్వగా.. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 10వ తేదీన సినిమా రిలీజ్ చేయనున్నట్లు ఇప్పటికే మేకర్స్ ప్రకటించారు.
ఆర్ఆర్ఆర్ తర్వాత చరణ్ సోలోగా యాక్ట్ చేస్తున్న సినిమా కావడంతో మెగా ఫ్యాన్స్ గేమ్ ఛేంజర్ కోసం ఎంతగానో వెయిట్ చేస్తున్నారు. చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ కియారా హీరోయిన్ గా నటిస్తున్నారు. తెలుగమ్మాయి అంజలి కీలక పాత్ర పోషిస్తున్నారు. శ్రీకాంత్, ఎస్ జే సూర్య, సునీల్, సముద్రఖని ముఖ్యమైన రోల్స్ లో కనిపించనున్నారు.
భారీ బడ్జెట్ తో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై దిల్ రాజు నిర్మిస్తున్నారు. అయితే ఆ మధ్య కాస్త సైలెంట్ గా ఉన్న గేమ్ ఛేంజర్ మేకర్స్.. ఇప్పుడు వరుస అప్డేట్స్ తో సందడి చేస్తున్నారు. ఇప్పటికే మూవీ నుంచి రెండు సాంగ్స్, టీజర్ రిలీజ్ చేశారు. ఆడియన్స్ లో మూవీపై మంచి అంచనాలు క్రియేట్ చేశారు. పాజిటివ్ బజ్ కూడా సృష్టించారు.
ఇప్పుడు ఎంతగానో ఎదురుచూస్తున్న గేమ్ ఛేంజర్ థర్డ్ సాంగ్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. మూడో పాటను నవంబర్ 28న రిలీజ్ చేయబోతున్నట్టు ఆదివారం ఉదయం ప్రకటించారు. అదే సమ యంలో కొత్త పోస్టర్ కూడా రిలీజ్ చేశారు. అందులో చరణ్, కియారా పర్పుల్ కలర్ ఔట్ ఫిట్స్ లో ఓ రేంజ్ లో కనిపిస్తున్నారు. అందరినీ ఎంతో ఆకట్టుకుంటున్నారు.
పస్తుతం చరణ్, కియారా పోస్టర్ తెగ చక్కర్లు కొడుతోంది. పోస్టర్ చాలా కూల్ గా ఉందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. బ్యాక్ గ్రౌండ్ అదిరిపోయిందని, టాలీవుడ్ సూపర్ హిట్ మెలోడీ సాంగ్ ఆన్ లోడింగ్ అంటూ సందడి చేస్తున్నారు. కచ్చితంగా సాంగ్ చార్ట్ బస్టర్ గా నిలుస్తుందని.. వెయిటింగ్ ఫర్ సాంగ్ అని చెబుతున్నారు.అయితే ఆ సాంగ్ కు సంబంధించి ఇప్పటికే గేమ్ ఛేంజర్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ బజ్ క్రియేట్ చేశారు. లిరిసిస్ట్ రామ జోగయ్య శాస్త్రి హైప్ సృష్టించారు. తమన్ నుంచి వచ్చిన బెస్ట్ సాంగ్స్ లో ఒకటి అని తెలిపారు. దీంతో అంతా మంచి అంచనాలు పెట్టుకున్నారు. మరి గేమ్ ఛేంజర్ నుంచి రానున్న మెలోడీ సాంగ్ ఎలా మెప్పిస్తుందో చూడాలి.





## విజయ్ దేవరకొండతో రష్మిక మందన్న సీక్రెట్ డేటింగ్.. ఫొటోలు



టాలీవుడ్ స్టార్ నటులు విజయ్ దేవరకొండ-రష్మిక మందన్న ప్రేమలో ఉన్నారంటూ గత కొంతకాలంగా వార్తలొస్తున్న విషయం తెలిసిందే. 'గీత గోవిందం' 'డియర్ కామ్రేడ్' చిత్రాల్లో కలిసి నటించిన ఈ జంట పర్సనల్ లైఫ్‌లో చాలా సన్నిహితంగా ఉంటారు. ఇరు కుటుంబాల మధ్య కూడా చక్కటి స్నేహసంబంధాలున్నాయి. ఈ నేపథ్యంలో వీరిద్దరి లవ్ ఎఫైర్‌పై అనేక కథనాలొచ్చాయి. అయితే తాము కేవలం స్నేహితులం మాత్రమేనని, తమ మధ్య ఎలాంటి ప్రేమబంధం లేదని ఈ తారలిద్దరూ అనేక సందర్భాల్లో వివరణ ఇచ్చారు.
అయితే రీసెంట్‌గా సాహిబా అనే మ్యూజిక్ ఆల్బమ్‌లో నటించిన విజయ్.. ఈ ఆల్బమ్ ప్రమోషన్స్‌లో భాగంగా.. తన రిలేషన్‌షిప్ స్టేటస్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తాను సింగిల్ కాదని నాకు 35 ఏళ్లు వచ్చాయి. ఇంకా సింగిల్‌గా ఉన్నానని ఎలా అనుకుంటున్నారు అంటూ అసలు విషయం బయట పెట్టాడు. అయితే విజయ్ ప్రస్తుతం రష్మికతో డేటింగ్‌లో ఉంటున్నాడు అంటూ వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ క్రమంలోనే ఈ వార్తలకు బలం చేకూరుస్తూ.. తాజాగా విజయ్ దేవరకొండ %-% రష్మిక మందన్నకలిసి ఒక రెస్టారెంట్‌లో బ్రేక్ ఫాస్ట్ చేస్తూ కనిపించారు. అయితే రష్మిక తన ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేయగా వీరిద్దరి కలిసి తింటున్న ఫొటోలు బయటికి వచ్చాయి. ఈ ఫొటోలు చూస్తుంటే.. ఈ జంట ప్రస్తుతం వెకేషన్‌లో ఉన్నట్లు తెలుస్తుంది.సినిమాల విషయానికి వస్తే.. విజయ్ గౌతమ్ తిన్ననూరితో ఒక సినిమా చేస్తుండగా.. రష్మిక మందన్న అల్లు అర్జున్‌తో కలిసి పుష్ప సినిమాలో నటిస్తుంది.

## టెస్టుల్లో కోహ్లీ 30వ సెంచరీ.. ఇన్నింగ్స్ డిక్లేర్ చేసిన భారత్



**న్యూఢిల్లీ-నవభూమి:** బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ తొలి టెస్టులో ఆస్ట్రేలియా ముందు భారత్ భారీ లక్ష్యాన్ని ఉంచింది. రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 487 పరుగుల వద్ద భారత్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. ఆస్ట్రేలియాకు 533 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం లక్ష్యచేధన కోసం బరిలో దిగిన ఆస్ట్రేలియా ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. బుమ్రా బౌలింగ్‌లో ఆస్ట్రేలియా ఓపెనర్ నాథన్ మెక్ స్వీని ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు.
అంతకుముందు మూడో రోజు ఆట మొదలవగానే భారత ఓపెనర్‌లు యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ తమ నిలకడైన ఆటను కొనసాగించారు. అయితే కాసేపటికి తన వ్యక్తిగత స్కోర్ 77 పరుగుల వద్ద కేఎల్ రాహుల్ ఔటయ్యాడు. ఆ తర్వాత జైస్వాల్ సెంచరీ పూర్తిచేసుకున్నాడు. తర్వాత ఆటలో దూకుడు పెంచి 161 పరుగులకు చేరుకున్న తర్వాత ఔటయ్యాడు. జైస్వాల్ ఔట్ తర్వాత పంత్, ధ్రువ్ జురేల్ వెంటవెంటనే ఔటయ్యారు.విరాట్ కోహ్లీ నిలదొక్కుకుని వాషింగటన్ సుందర్ (29), నితీష్ రెడ్డి (38 నాటౌట్) సహకారంతో పరుగుల వరద పారించాడు. మొత్తానికి 145 బంతులను ఎదుర్కొని టెస్టుల్లో తన 30వ సెంచరీని సాధించాడు. అంతకుముందు కేఎల్ రాహుల్ ఔటవగానే క్రీజులోకి వచ్చిన పడిక్కల్ (25) కుదురుకుంటున్నట్లే కనిపించినా కొద్దిసేపటికే ఔటయ్యాడు.

## ఆదిలోనే ఆసీస్‌కు ఎదురుదెబ్బ.. 12 పరుగులకే ముగ్గురు ఔట్



**న్యూఢిల్లీ-నవభూమి:** బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ తొలి టెస్టులో ఆస్ట్రేలియాకు ఓటమి తప్పేలా లేదు. భారత్ నిర్దేశించిన 534 పరగుల భారీ లక్ష్యచేధన కోసం రెండో ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా ఆదిలోనే కష్టాల్లో కూరుకుపోయింది. మూడో రోజు చివరలో 4.2 ఓవర్‌లు ఆడి కేవలం 12 పరుగులు మాత్రమే చేసిన ఆస్ట్రేలియా మూడు కీలక వికెట్‌లు కోల్పోయింది. ఓపెనర్ నాథన్ మెక్ స్వీని పరుగులేమీ చేయ కుండానే పెవిలియన్ బాటపట్టాడు. కెప్టెన్ జస్ప్రీత్ బుమ్రా మెక్ స్వీనిని ఎల్బీడబ్ల్యూ చేశాడు. ఆ తర్వాత వన్ డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్ కూడా రెండు పరుగులు చేసి ఔటయ్యాడు. మహ్మద్ సిరాజ్ బౌలింగ్‌లో కమ్మిన్స్ కోహ్లీకి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ తర్వాత మార్నస్ లబుషేన్ కూడా తక్కువ స్కోర్‌కే ఔటయ్యాడు. లబుషేన్‌ను కూడా కెప్టెన్ బుమ్రానే ఎల్బీడబ్ల్యూ రూపంలో వెనక్కి పంపాడు.
దాంతో ఆస్ట్రేలియా కేవలం 12 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది.

నవక్రీడ

## జైస్వాల్ ఔట్‌తో తడబడ్డ భారత్.. ప్రస్తుతం స్కోర్ ఎంతంటే..



**న్యూఢిల్లీ-నవభూమి:** పెర్త్ వేదికగా జరుగుతున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్ లో అద్భుతంగా రాణించిన ఓపెనర్ యశస్వి జైస్వాల్ తన వ్యక్తిగత స్కోర్ 161 వద్ద ఔటయ్యాడు. జైస్వాల్ మొత్తం 297 బంతులను ఎదుర్కొని 161 పరుగులు (15 ఫోర్‌లు, 3 సిక్స్‌లు) చేశాడు. అయితే జైస్వాల్ ఔట్ అనంతరం భారత బ్యాటింగ్ లైనప్ తడబడింది. వికెట్ కీపర్ రిషబ్ పంత్ (1), ధ్రువ్ జురేల్ (1) వెంటవెంటనే వికెట్లను సమర్పించుకున్నారు. దాంతో భారత్ కేవలం 8 పరుగుల వ్యవధిలో వరుసగా మూడు వికెట్లు కోల్పోయినట్లయ్యింది. మరో ఎండ్‌లో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (%ఎఅతీఛ్ ఖశీప్త్రశ్రీఅ%) నిలకడగా ఆడుతున్నాడు. ప్రస్తుతం 45 బంతుల్లో 27 పరుగులతో బ్యాటింగ్ కొనసాగిస్తున్నాడు. కోహ్లీకి తోడుగా వాషింగ్టన్ సుందర్ (2) క్రీజులో ఉన్నాడు. ప్రస్తుతం భారత్ స్కోర్ ఐదు వికెట్ల నష్టానికి 334 పరుగులు. దాంతో ఆధిక్యం 380 పరుగులకు పెరిగింది.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: SHAIK SHAHANAZ, Phone: 9246123493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com RNI No: TEL TEL: 82083